తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

బుధవారం 10.12.2025 | సంపుటి :12 సంచిక : 141 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV




# గ్లోబల్ క్యాపిటల్‌గా తెలంగాణ

## రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు

### సమ్మిట్‌కు క్యూ కట్టిన కార్పొరేట్ కంపెనీలు

### 2 రోజుల్లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు



తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రముఖులు

- ఫుడ్ ప్రాసెసింగ్ డేటాసెంటర్లు
- ఫార్మా సెక్టార్ క్లీన్ ఎనర్జీలో భారీ ప్రాజెక్టులు
- స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించాం
- మారుమూల గ్రామంలోని రైతు కుటుంబం నుంచి వచ్చా..
- పేదలు, రైతుల సమస్యలు బాగా తెలుసు
- విజన్-2047 డాక్యుమెంట్‌లో సీఎం రేవంత్
- ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తెలంగాణ: భట్టి విక్రమార్క
- ఫ్యూచర్ సిటీలో త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణరైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రెండో రోజు వివిధ కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. వారితో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాలు పెంపునకు వచ్చిన భారీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయని అధికారు లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, డేటా సెంటర్లు, ఔషధ రంగం, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇన్‌ఫ్రాకీడిసి పార్క్ మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

సినీ ప్రముఖులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

2లో



తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది

## ప్రతీ కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి

### అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను గ్లోబల్ సమ్మిట్ వేదిక నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో రూ. 5.8 కోట్లతో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 18 అడుగుల ఎత్తుతో విగ్రహాల నిర్మాణం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మిగతా 2లో..

## సమ్మిట్‌లో కంపెనీలు, పరిశ్రమలతో ఒప్పందాలు

- ఫుడ్ అండ్ ఎఫ్ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్ ఒప్పందం
- ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల క్రైన్స్ టెక్నాలజీ విస్తరణ
- రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో జేసీకే ఇన్‌ఫ్రా ఒప్పందం
- మూడు దశల్లో ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా రూ.2,500 కోట్ల పెట్టుబడులు
- 50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్వైలోన్ నెక్సస్ ఒప్పందం
- హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌కు ఏజీపీ గ్రూప్ ఒప్పందం
- రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న ఏఐ-రెడీ డేటా పార్క్
- ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్న హెటెరో గ్రూప్
- రాష్ట్రంలో రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న అరబిందో ఫార్మా
- పెప్టైడ్స్ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యూల్స్ ఇండియా
- వ్యాక్సిన్, ఆర్అండ్‌డీ, సీడీఎంవో విస్తరణకు బయోలాజికల్-ఈ ఒప్పందం
- రెండోరోజు పర్యాటకరంగంలో రూ.11,395 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

## ఎస్ఐఆర్.. రైట్ రైట్

### ప్రక్రియ కొనసాగాల్సిందే

### రాష్ట్రాలకు స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ సవరణను సవాల్ చేస్తూ, దాని నిర్వహణలో ఎదురవుతోన్న పరిస్థితులపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బెంగాల్‌లో ఎస్ఐఆర్ జరుగుతోంది. ఈ ప్రక్రియ లో భాగమైన బీఎల్ఓలు ఇతర అధికారులకు బెదిరింపులు రావడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలను తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థితులు ఎదురు కావొచ్చని హెచ్చరించింది. మిగతా 2లో..



## తెలంగాణకు రూ.71 వేల కోట్ల రుణసేకరణకు అనుమతి

కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి

2లో

## 'పది' పరీక్షలు మార్చి 14 నుంచి..



### ఏప్రిల్ 16 వరకు నిర్వహణ

**హైదరాబాద్(జనంసాక్షి):** పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజిక్స్, ఏప్రిల్ 7న బయాలజీ, ఏప్రిల్ 13న సోషల్ స్టీడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 15న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పీరీక్ష, ఏప్రిల్ 16న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది.

## రూ.1.5 లక్షల కోట్లు



### భారత్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి

- మోదీతో భేటిలో సత్య నాదెళ్ల ప్రకటన
- హర్షం వ్యక్తం చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 17.5 బిలియన్ డాలర్లను (రూ. 1.5 లక్షల కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ మిగతా 2లో..

## ఆర్ఎస్ఎస్ గుప్పిట్లో ఎన్నికల వ్యవస్థ

### ఈసీని బీజేపీ కబ్జా చేసింది

### లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఎన్నికల సంస్కరణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందన్నారు. సీఈసీని కాపాడేందుకు ఏకంగా చట్టాలనే మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే తప్పు చేసినా శిక్ష అనుభవించకుండా తప్పించుకునే అవకాశాన్ని ఈసీ కి కల్పించారన్నారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద అనేక ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు. ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా? సర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు



అందుతున్న సమయంలో.. ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం మిగతా 3లో..



## గాడినపడుతున్న ఇండిగో

### సర్వీసులు సాధారణ స్థితికి • 'ఎక్స్' వేదికగా సీఈఓ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కొన్ని రోజులుగా సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి చేస్తోన్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. సర్వీసుల రద్దు మంగళవారం కూడా కొనసాగినప్పటికీ.. కార్యకలాపాలు గాడిన పడుతున్నాయి. ఇదే విషయాన్ని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఎక్స్ వేదికగా వెల్లడించారు "మీ విమానయాన సంస్థ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అతిపెద్ద కార్యనిర్వాహక వైఫల్యం కారణంగా మిమ్మల్ని తీవ్రంగా నిరాశపరిచాం. అందుకు చింతిస్తున్నాం. లక్షలాది వినియోగదా రులు వారి రీఫండ్లను పొందారు. ఆ ప్రక్రియను మేం కొనసాగిస్తున్నాం. విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన లగేజీని మీ ఇంటివద్దకు చేర్చాం. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాం. నిన్నటి నుంచి వందకుపైగా గమ్యస్థానాలకు మా సర్వీసులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వానికి మా సహకారం అందిస్తున్నాం. అసలు ఈ సమస్యకు గల కారణాలను గుర్తించడంపై ఇప్పటికే దృష్టిపెట్టాం. " అని పీటర్ వీడియో సందేశం విడుదల చేశారు


## వ్యవస్థలను మెరుగుపర్చేందుకే నిబంధనలు

- ప్రజలను వేధించడానికి కాదు
- ఇండిగో సంక్షోభంపై మోదీ స్పందన
- ఎంత పెద్ద సంస్థైనా సహించేది లేదు
- ఇండిగోకు కేంద్రం స్ట్రాంగ్ మెసేజ్
- దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో తనిఖీలు

2లో

## భారత్ ఊహల్లో తేలొద్దు

- వారు ఎలాంటి దాడి చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం
- అత్యుత్సాహం ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలు
- సీడీఎఫ్‌గా బాధ్యత స్వీకరణ అనంతరం మునీర్ ప్రసంగం



**ఇస్లామాబాద్(జనంసాక్షి):** దాయాది దేశం పాకిస్తాన్ మరోసారి భారత్‌పై కవ్వింపు చర్యలకు దిగింది. పాకిస్తాన్ త్రివిధ దళాధిపతిగా నియమితుడైన తర్వాత తన తొలి ప్రసంగంలోనే ఆసిమ్ మునీర్..భారత్‌కు హెచ్చరిక జారీ చేశారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తూ.. పాకిస్తాన్‌పై భారత్ ఎలాంటి దాడి చేసినా ప్రతీకార చర్య చాలా తీవ్రంగా, వేగంగా ఉంటుందని అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన మిగతా 2లో..

## బియ్యంపై బాదుడు!



### భారత్‌పై మళ్లీ సుంకాలకు ట్రంప్ రెడీ?



**న్యూయార్క్(జనంసాక్షి):**ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్-అమెరికా చర్చలకు సిద్ధమవుతుండగా ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ నుంచి దిగుమతయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించాలనే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. చౌకైన విదేశీ వస్తువులు అమెరికా ఉత్పత్తిదారులను దెబ్బతీస్తున్నాయని అక్కడి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రంప్ అదనపు సుంకాల గురించి యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా రైతుల కోసం 12 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ ప్రారంభానికి వైట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ట్రంప్ మాట్లాడుతూ.. పలు దేశాలు చౌక ధరలకే బియ్యాన్ని అమెరికా మార్కెట్‌లోకి డంప్ చేస్తున్నాయంటూ వస్తున్న వాదనలను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కొందరు రైతులు సబ్సిడీ బియ్యం దిగుమతులు అమెరికా మార్కెట్‌లను దెబ్బతీస్తున్నాయని, దేశీయ ధరలను తగ్గిస్తున్నాయని వాదించారు. దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రంప్ మాట్లాడుతూ.. వారు (పలు దేశాలను ఉద్దేశిస్తూ) మోసం చేస్తున్నారని.. సుంకాల విధింపు మార్గాన్ని అనుసరించవచ్చని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కెనడా నుంచి ఎరువుల దిగుమతుల పైనా ఆయన ప్రస్తావించారు. ఓ రైస్‌మిల్ సీఈఓ మెరిల్ కెన్నెడీ మాట్లాడుతూ.. అగ్రరాజ్యానికి తమ ఉత్పత్తులను డంప్ చేస్తున్న దేశాల్లో భారత్, థాయ్‌లాండ్ చైనాలు ప్రధానంగా ఉన్నాయన్నారు. చైనా వస్తువులు ఏకంగా ప్యూర్టోరికోలోకి కూడా వెళ్తున్నాయని ఆందోళన మిగతా 2లో..

## రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు

### విజయ్ దివస్ సందర్భంగా కేటీఆర్ వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. విజయ్ దివస్ సందర్భంగా ఆయన ఎక్స్‌లో.. కేసీఆర్ దీక్ష విరమించిన ఫోటోలు పంచుకున్నారు. సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏళ్లు అని తెలిపారు. నవంబర్ 29న దీక్షా దివస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివస్ లేదన్న ఆయన.. డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని అన్నారు.

## సోనియా గాంధీకి కోర్టు నోటీసులు

9లో

## ఇండోనేషియాలో ఘోర ప్రమాదం..

### 20 మంది సజీవ దహనం!

**జకార్త(జనంసాక్షి):**ఇండోనేషియా రాజధాని జకార్తలో మంగళవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ ఏడంతస్తుల భవనంలో మంటలు చెలరేగి.. 20 మంది దాకా సజీవ దహనం అయ్యారు. సహాయక చర్యలు కొనసాగుతుండడంతో మృతుల సంఖ్య పెరగొచ్చని అక్కడి అధికారులు చెబుతున్నారు. సెంట్రల్ జకార్తాలోని ఓ భవనంలో మంగళవారం మధ్యాహ్న సమయంలో ఈ ఘోరం చోటు చేసుకుంది. మొదటి అంతస్తులో ప్రారంభమైన మంటలు శరవేగంగా పై అంతస్తులకు వ్యాపించాయి. దట్టమైన పొగ, మంటలు కనిపించడంతో స్థానికులు మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10.12.2025



## ఫ్యూచర్ సిటీలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

### సినీ ప్రముఖులతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినీ పరిశ్రమని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని టాలీవుడ్ ప్రముఖులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా వారికి సీఎం వివరించారు. 24 క్రాఫ్ట్‌లో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని వారికి సీఎం రేవంత్ సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ వివరించారు. సీఎం రేవంత్‌తో సమావేశమైన వారిలో చిరంజీవి, అజయ్ దేవగన్ అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటులు జెనీలియా, అక్కినేని అమలతోపాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు ఉన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నేటితో అంటే.. మంగళవారంతో ముగియనుంది.

## ఎస్ఐఆర్.. రైట్ రైట్

బీఎల్ఓలకు బెదిరిం పులు, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాల గురించి తమ దృష్టికి తీసుకువస్తే.. వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించింది. బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గాలను అనుసరిస్తూ.. ఎస్ఐఆర్ జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే.. అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు వెల్లడించింది. ఇదిలా ఉంటే.. ఎస్ఐఆర్‌లో భాగమైన పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తోన్న సంగతి తెలిసిందే. "బీఎల్‌వోలు పనిభారం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే.. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకోవచ్చు. వారి పని గంటలు తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎస్ఐఆర్ విధుల నుంచి తమను మినహాయించాలని ఎవరైనా కోరితే.. అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది" అని న్యాయస్థానం గతంలో పేర్కొంది. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండోదశ ఎస్ఐఆర్ కొనసాగుతోంది.

## స్కూళ్లకు 6 రోజుల సెలవులు

**హైదరాబాద్,డిసెంబర్9(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండటంతో, ప్రభుత్వం పలు దఫాలుగా సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు ఆరు రోజుల పాటు విరామం దొరకనుంది. తొలి విడత పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్ల కోసం జనవరి 10, 11 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ జనవరి 13, 14 తేదీల్లో జరగనుండగా, ఆ రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో అవి సాధారణ సెలవులుగా కలిసివచ్చాయి. అనంతరం మూడో విడత పోలింగ్ సందర్భంగా జనవరి 16, 17 తేదీల్లో కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడం కోసం ఈ నిర?యం తీసుకున్నారు. మరోవైపు, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## బియ్యంపై బాదుడు!

వ్యక్తంచేశారు. అనేక సంవత్సరాలుగా తామే ప్యూర్టోరికోకు బియ్యం ఎగుమతులు చేయడం లేదని వెల్లడించారు. వీటన్నింటివల్ల దక్షిణాదిలో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విధించిన సుంకాలు పని చేస్తున్నాయని.. అయితే, వాటిని రెట్టింపు చేయాలని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. వివిధ దేశాలపై విధించిన సుంకాలను పెంచాలా అని అడిగారు. ఇందుకు రైతులు బదులిస్తూ ఇతర దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులను నియంత్రించాలని కోరారు. అమెరికా రైతుల ఉత్పత్తులను దెబ్బతీసేలా ఉన్న దేశాల జాబితాను సమర్పించాలని వాణిజ్య కార్యదర్శి స్కాట్ బెసెంట్‌ను ట్రంప్ ఆదేశించారు. స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. వీటిలో భారత్, థాయ్‌లాండ్, చైనాలు ముందున్నాయన్నారు. మరిన్ని దేశాలు కూడా ఉన్నాయని, దీనికి సంబంధించి పూర్తి జాబితా అందిస్తామని తెలిపారు. వీటిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ట్రంప్ హామీ ఇచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చల ప్రారంభానికి ముందే ట్రంప్ అదనపు సుంకాల గురించి ఆలోచనలు చేయడం గమనార్హం. ఇక, భారత్– అమెరికాల మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించిన చర్చలు ఈనెల 10 నుంచి దిల్లీలో జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు అమెరికా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మన దేశంలో పర్యటించనున్నారు. ఈ చర్చల్లో భారత్ తరపున వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పాల్గొనున్నారు.

# గ్లోబల్ క్యాపిటల్‌గా తెలంగాణ



150 ఎకరాల్లో 1గిగావాట్ సామర్థ్యం గల భారీ డేటా పార్క్ అభివృద్ధి చేపట్టుందుకు రూ. 70 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. జెసీకేఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పెద్ద స్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపడుతోంది. దీంతో సుమారు 2 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఏజీపీ గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) టీకాలు, పరిశోధన–అభివృద్ధి, తయారీ సేవల విస్తరణలో భాగంగా రూ.3,500 కోట్ల కొత్త పెట్టుబడి ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి మొత్తం రూ.4 వేల కోట్లు అవుతుంది. 3 వేలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి.ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీంతో 800 పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాలు తయారీకి రూ.200 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు.వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ ఫ్రీజ్‌డ్రైడ్ కాఫీ ప్లాంట్ స్థాపనకు రూ.1,100 కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా వెయ్యి మంది వరకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే యూనిట్ ద్వారా వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ సేవల విస్తరణలో కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదించింది.ఆర్సీసీటీ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మూడు విడతల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 1,600 కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి.పర్యూ గ్రూప్ 50 మెగావాట్ల సామర్థ్యం గల గ్లోబల్ కెపాసిటీ, ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉంది.అరబిందో ఫార్మా రూ.2 వేల కోట్లతో విస్తరణ చేపట్టి 3వేలకి పైగా ఉద్యోగాలు సృష్టించనున్నారు.హెటెరో సంస్థ మందుల తయారీ యూనిట్ల విస్తరణకు రూ.1,800 కోట్ల పెట్టుబడి ప్రకటించింది. దీంతో 9వేలకి పైగా ప్రత్యక్ష పరోక్ష ఉద్యోగాలు సృష్టించనున్నారు.గ్రాన్యూల్స్ ఇండియా రూ.1,200 కోట్ల పెట్టుబడితో 2,500?3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. భారత్ బయోటెక్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల కోసం ఆధునిక కేంద్రం ఏర్పాటు చేస్తోంది. దీంతో 200లకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆహార పానీయాల తయారీ విస్తరణలో కేజేఎస్ ఇండియా రూ.650 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 1,551 మందికి ఉపాధి దొరకనుంది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ రాష్ట్రంలో పాల ఉత్పత్తి విస్తరణకు రూ.150 కోట్ల పెట్టుబడితో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఆక్వెలాన్నెక్సస్ లిమిటెడ్ తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఆధారంగా 50 మెగావాట్ల నెట్ జీరో ఉద్గారాల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల భారీ పెట్టుబడులు రానున్నాయి ప్రత్యక్షంగా 10 వేల మందికి,పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది. ఫుడ్ లింక్ ఎఫ్‌అండ్‌బీ హోల్డింగ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,000 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. డ్రీమ్‌వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్ రూ.1,000 కోట్లతో నిర్మించనున్నారు. సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,000 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) రూ.800 కోట్లు, కేఈఐ గ్రూప్ (కామినేని గ్రూప్) రూ.200 కోట్లు, పోలిన్ గ్రూప్ (టర్కీ), మల్టీవర్స్ హోటల్స్ రూ.300 కోట్లు, ఫ్లుడ్రా ఇండియా (స్పెయిన్) రూ.300 కోట్లు, శ్రీ హవిషా హాస్పిటాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.300 కోట్లు, రిధిరా గ్రూప్ రూ.120 కోట్లు, సలామ్ నమస్తే దోసా హట్ (ఆస్ట్రేలియా), విశాఖ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ యానిమేషన్ ఐఫా ఉత్సవం, ఏథెన్స్ ఈవెంట్ల భాగస్వామ్యం ద్వారా రాష్ట్రానికి రూ.5,50,600 కోట్ల ఆర్థిక లాభం చేకూరనుంది. టిడబ్ల్యుఐ గ్రూప్ ప్రపంచంలోనే తొలి ప్లగ్–ఇన్ హైబ్రిడ్ మోటార్‌బైక్ తయారీ కేంద్రం తెలంగాణలో ఏర్పాటు. రూ.1,100 కోట్లు పెట్టుబడితో 500 మందికి ఉద్యోగాల కల్పన అవకాశాలు రానున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్ర జహీరాబాద్ యూనిట్ విస్తరణకు నాలుగేళ్లలో రూ.500 కోట్లకు పైగా పెట్టుబడికి ముందుకొచ్చింది. ఇండియా ఎక్స్ ట్రీమ్ అడ్వెంచర్20 ఎకరాల్లో ఎక్స్ ట్రీమ్ స్పోర్ట్స్, అడ్వెంచర్, ఈ–స్పోర్ట్స్ అరేనా. మొత్తంగా రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టింది. బయోవరంటిష్యూ ఇంజినీరింగ్, రెజెనరేటివ్ మెడిసిన్, సెల్?జీన్ థెరపీకి ప్రత్యేక కేంద్రం రూ. 250 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. జ్యూరిక్ ఇన్సూరెన్స్ ఇండియాలో తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (ఉఅఅ) కోసం హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంది. మూడేండ్లలో దశలవారీగా విస్తరించనున్నారు. కెనడియన్ ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తమ తొలి భారతీయ సంస్థను హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇంజినీరింగ్ సైబర్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొంది. స్వేచ్ఛ, సామాజిక న్యాయం,

**సమానత్వం సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించాం : సీఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ చైతన్యవంతమైన నేల అని సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా 'తెలంగాణ రైజింగ్ విజన్–2047' డాక్యుమెంట్ రూపొందించినట్లు తెలిపారు. గ్లోబల్ సమిట్ ముగింపు వేడుకలో ప్రసంగిస్తూ 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాలవారిని సంప్రదించి పేదలు, రైతులు, వ్యాపారులు, యువతకు అభివృద్ధి ఫలాలు దక్కేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ సీఎం రేవంత్ తరెడ్డి ఆవిష్కరించారు. డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఆనంద్ మహీంద్ర, చిరంజీవి, దువ్వూరి సుబ్బారావు పాల్గొన్నారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రికార్డుస్థాయిలో ఒప్పందాలు జరిగాయి. సమిట్ రెండురోజుల్లో కలిపి మొత్తం రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ కంపెనీలు, పరిశ్రమలు ప్రభుత్వంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్? సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్? గ్లోబల్? సమిట్? ముగింపు దశకు చేరుకుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్?రెడ్డి వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీ బిజీగా గడుపారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఇప్పటి వరకు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

భారీగా ఉద్యోగాలు వచ్చేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నెట్ జీరో కార్బన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. దేశ ఎకానమీ చరిత్రలో లేని అత్యంత భారీ లక్ష్యాన్ని 2047 కోసం నిర్దేశించుకున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు.

## ప్రతి కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి

మాట్లాడుతూ..."తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. 2009లో ఇదే రోజు (డిసెంబర్ 9) తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. 6 దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది. ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి ఆవిష్కరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. తెలంగాణ తల్లిని తలుచుకుని పనులు మొదలు పెట్టేందుకే విగ్రహాలు ఆవిష్కరించాం. స్వరాష్ట్ర కల నిజమై.. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్‌గా రూపొందుతోంది. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులు అధిగమించి మరీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు.ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం డిసెంబరు 9న కావడం మా అందరికీ సంతోషాన్ని కలిగించే పర్వదినం. ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాలతో పాటు, సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను తెలంగాణ ప్రజలు నిర్వహించుకుంటారు. మా పథకాలు, కార్యక్రమాల్లో సోనియా, మన్మోహన్ స్ఫూర్తి కొనసాగుతోంది" అని అన్నారు.

## దేశ విభజనకు నెహ్రూ కారణం

### 'వందేమాతరం' ప్రజల్లో స్ఫూర్తి నింపుతూనే ఉంటుంది: అమిత్ షా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. లోక్‌సభలో సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించగా.. మంగళవారం రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఆయన మా ట్లాడుతూ.. కాలంతో సంబంధం లేకుండా 'వందేమా తరం' దేశ ప్రజల్లో ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉంటుందన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔచిత్యం ఉందని.. భవిష్యత్తులోనూ ఉంటుందన్నారు. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని.. ప్రజా సమస్యల నుంచి దేశాన్ని పక్కదారి పట్టించేందుకు వందేమాతరంపై చర్చకు తెర తీశారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను అమిత్ షా ఖండించారు.



వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌కు చెందిన వ్యక్తి అయినప్పటికీ.. ఈ గేయం కేవలం బెంగాల్‌కే పరిమితమైనది కాదన్నారు. వందేమాతరంపై ప్రజల్లో అభిమానం గతంలోనూ ఉందని.. భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు. బ్రిటిష్ వారు కూడా మన జాతీయగేయాన్ని ఆపలేకపోయారని పేర్కొన్నారు. బ్రిటిష్ సంస్కృతిని అనుసరించేవారు కూడా ఎప్పటికీ దానిని ఆపలేరన్నారు. పార్లమెంటు ఉభయసభల్లో ఈ చర్చ ద్వారా భవిష్యత్ తరాలు వందేమాతర గేయానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటాయని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై ప్రత్యేక చర్చను సోమవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మొత్తంగా ఈ చర్చ కోసం దిగువ సభలో 10 గంటల సమయాన్ని కేటాయించారు. విపక్ష కాంగ్రెస్ తరపున 'వందేమాతరం'పై లోక్‌సభలో పార్టీ ఉప నేత గౌరవ్ గొగొయ్, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకొని ఈ చర్చకు తెరతీశారని విమర్శించారు.

## వ్యవస్థలను మెరుగుపర్చేందుకే నిబంధనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. వ్యవస్థలను మెరుగుపర్చేందుకే నిబంధనలని.. ప్రజలను వేధించడానికి కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్డీయే పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.'ప్రభుత్వం వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలి. నియమనిబంధనలు మంచివే. అయితే వ్యవస్థను మెరుగుపర్చేందుకు వాటిని రూపొందించాలి. అవి ప్రజలను వేధించకూడదు" అని ప్రధాని మాటలను కేంద్ర మంత్రి గుర్తుచేసుకున్నారు. "సామాన్య పౌరుల్ని ఇబ్బందిపెట్టే చట్టం, నిబంధన ఉండకూడదని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. చట్టాలు ప్రజలపై భారంగా పరిణమించకూడదు" అని వెల్లడించారు. వారం రోజులకు పైగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాంతో రోజుకు వందల సంఖ్యలో సర్వీసులు రద్దు, ఆలస్యమవుతున్నాయి. దాంతో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాస్తూ ఇబ్బందిపడుతోన్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఇప్పటికీ అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలను కేంద్రం ఇప్పటికే సీరియస్‌గా తీసుకుంది. దీనిపై విచారణ కమిటీని వేసింది. ఇక ఈ అవాంతరాలకు ప్రధానంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో ప్రాథమికంగా వెల్లడించింది. స్వల్ప సాంకేతిక లోపాలు, విమానాల షెడ్యూళ్లను మార్చడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ దీనికి కారణం అని తెలిపింది. కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ ఫేజ్ రోస్టరింగ్ నియమాలు కూడా ఒక కారణంగా పేర్కొంది. ఇప్పటికే ఈ కొత్త నియమాలను కేంద్రం తాత్కాలికంగా పక్కనపెట్టిన సంగతి తెలిసిందే.

**ఎంత పెద్ద సంస్థ అయినా సహించేది లేదు**

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే ఏ సంస్థను ఉపేక్షించబోమని పార్లమెంట్‌లో పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భద్రత విషయంలో ఎలాంటి బేరసారాలు ఉండవని తేల్చిచెప్పారు. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ఆయన లోక్‌సభలో స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చారు "ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు క్రమంగా సాధారణస్థితికి చేరుకుంటున్నాయి. రిఫండ్, లగేజీని ప్రయాణికులకు చేర్చే చర్యలు కొనసాగుతున్నాయి. డీజీసీఏ ఇప్పటికే ఇండిగో యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. దర్యాప్తు కూడా ప్రారంభమైంది. దర్యాప్తులో వెల్లడైన వివరాల ఆధారంగా తగిన చర్యలు ఉంటాయి. ఎంతపెద్ద విమానయాన సంస్థ అయినా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదు. పౌర విమానయానంలో భద్రత విషయంలో బేరసారాలు లేవు" అని మంత్రి వెల్లడించారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్..పైలట్ల పని గంటలకు సంబంధించిన ఈ కొత్త నియమాలు ఇండిగో సంక్షోభానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ.. ఈ సంస్కరణలు ప్రయాణికుల భద్రతను పెంచుతాయన్నారు. పైలట్ల అలసటను దృష్టిలోపెట్టుకొని శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని రూపొందించినట్లు చెప్పారు. "అన్ని విమానయాన సంస్థలతో చర్చించిన తర్వాతే డీజీసీఏ వీటిని దశలవారీగా అమలుచేస్తోంది. 2025, జులై ఒకటి నుంచి తొలి దశ, నవంబర్ ఒకటి నుంచి రెండో దశను అమలుచేస్తున్నాం. ఈ నిబంధనలను పాటిస్తామని ఇండిగో హామీ ఇచ్చింది.హామీ ఇచ్చినప్పటికీ.. రోస్టరింగ్ నియమాలను అమలుచేయడంలో వైఫల్యమే సర్వీసుల రద్దుకు దారితీసిందని గుర్తించాం" అని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనక ప్రజాప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. దానిలోభాగంగా ఈ సర్వీసుల రద్దు వేళ విమాన టికెట్ ఛార్జీలపై పరిమితులు విధించామని గుర్తుచేశారు. ఈ రంగంలో గుత్తాధిపత్యానికి తాము తావివ్వడం లేదని, మరిన్ని విమానయాన సంస్థలను ఇందులోకి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కొత్త సంస్థలు అడుగుపెట్టడానికి ఇదే సరైన తరుణమని మరోసారి పేర్కొన్నారు.

## భారత్ ఊహల్లో తేలొద్దు

వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.అయితే, పాకిస్తాన్ చరిత్రలో పాకిస్తాన్ తొలి రక్షణ దళాల చీఫ్ గా ఆసిమ్ మునీర్‌ను షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. అనంతరం, మునీర్ సోమవారం తన తొలి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆసిమ్ మునీర్ మాట్లాడుతూ.. పాకిస్తాన్‌లో రక్షణ దళాల ప్రధాన కార్యాలయ స్థాపన చారిత్రాత్మకమైనది. ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ కలిసి ఏకీకృత చర్యలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. సాయుధ దళాలు యుద్ధానికి కొత్త అవసరాలకు అనుగుణంగా ఉండాలి. పాకిస్తాన్‌పై భారత్ ఎలాంటి దాడి చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. దీనికి పాకిస్తాన్ ప్రతీచర్య తీవ్రంగా ఉంటుంది. పాక్ చాలా కఠినంగా స్పందిస్తుంది. కాబట్టి భారత్ ఎలాంటి ఊహల్లో ఉండకపోతే మంచిది' అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇదే సమయంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ సైన్యం పనితీరుపై మునీర్ ప్రశంసలు కురిపించారు.ఇదిలా ఉండగా.. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ ఆర్మీని బలోపేతం చేసే దిశగా పాకిస్తాన్ అడుగులు వేసింది. ఈ క్రమంలోనే పాక్.. తమ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాలను ఏకీకృతం చేసేందుకు సీడీఎఫ్ పదవిని సృష్టించింది. ఇందుకు షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణ చేసింది. మరోవైపు.. పాక్ ఆర్మీ చీఫ్‌గా పనిచేసిన మునీర్ పదవీ కాలం గత నెల 29తో ముగిసింది. దీంతో, సీడీఎఫ్ పదవిని ఆసిమ్ మునీర్‌కు ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో ఐదేళ్ల కాలానికి ఏక కాలంలో సైనిక దళాల చీఫ్‌గా వ్యవహరించేందుకు సీడీఎఫ్ పదవికి ఆసిమ్ మునీర్‌ను నియమించాలని పాక్ ప్రధాని సమర్పించిన సిఫార్సును అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆమోదించారు. ఈ మేరకు పాక్ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఈ నియామకంతో పాక్‌లో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా మునీర్ నిలవనున్నారు. న్యాయపరమైన విషయాల్లో అధ్యక్షుడితో సమానంగా రక్షణ పొందనున్నారు. ఆయన్ను ప్రాసిక్యూట్ చేసే అవకాశం కూడా ఉండదు. ఐదేళ్ల పాటు ఈ పదవిలో మునీర్ కొనసాగనున్నారు.

## రూ.1.5 లక్షల కోట్లు

సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో మంగళవారం భేటీ అయిన ఆయన.. ఈ పెట్టుబడి గురించి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. భారత్‌లో ఏఐ అవకాశాలపై స్ఫూర్తిదాయక సంభాషణ తమ మధ్య జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీతో ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేశారు.దేశ ఏఐ ఆశయాలకు మద్దతుగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టనున్నట్లు సత్యానాదెళ్ల ప్రకటించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. భారత్‌లో కృత్రిమ మేధ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను అందించేందుకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు. రాబోయే నాలుగేళ్లలో (2026–29) మధ్య ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్లకు ఈ పెట్టుబడి అదనమని తెలిపింది.మైక్రోసాఫ్ట్ పెట్టుబడి ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏఐ విషయంలో భారత్ పట్ల ప్రపంచం ఆశావాదంతో ఉందన్నారు. సత్యనాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగిందని తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా భారత్‌ను ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ యువత ఈ గొప్ప అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందని, ఏఐ ఆపారశక్తిని సృజనాత్మకంగా ఉపయోగించుకుంటుందని ఆకాంక్షించారు.

## ఇండోనేషియాలో ఘోర ప్రమాదం..

ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. మృతుల్లో 15 మంది పురుషులు, ఐదుగుర మహిళలు ఉన్నారు. గాయపడిన వాళ్లను ఆస్పత్రులకు తరలించారు.ప్రమాదం సంభవించిన భవనంలో టెర్రా డ్రోన్ ఇండోనేషియా అనే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. స్థానిక టీవీ చానెల్స్ ప్రసారం చేస్తున్న విజువల్స్‌లో .. అగ్నిమాపక సిబ్బంది బాధితులను బయటకు తీసుకువస్తూ.. కొందరి బాడీ బ్యాగ్‌లను మోసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. పై అంతస్తుల నుండి కొంతమంది ఉద్యోగులు పోర్టబుల్ లాడర్లు ఉపయోగించి బయటకు తప్పించుకున్న విజువల్స్ కూడా వైరల్ అవుతున్నాయి. సహాయం కోసం కొందరు బిల్డింగ్ పైన నిల్చున్న? దృశ్యాలు నెట్టింటకు చేరుతున్నాయి.ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. లంచ్ టైంలో ఘటన చోటు చేసుకుందని ప్రాణాలతో బయటపడిన కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చి సహాయక చర్యలు ముగిశాకే ప్రమాదంపై ఓ స్పష్టమైన ప్రకటన చేయస్తామని అధికారులు అంటున్నారు.

## తెలంగాణకు రూ.71 వేల కోట్ల రుణసేకరణకు అనుమతి

### కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.71 వేల కోట్ల రుణసేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'కి సేకరించే ఆర్థిక వనరులను ఎఫ్‌ఆర్‌బీఎం చట్టం నుంచి మినహాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 9న కేంద్రానికి లేఖ రాసినట్లు చెప్పారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా అన్ని ప్రభుత్వాలకూ ఒకే కొలమానాన్ని వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిర్దేశించిన ఆర్థిక పరిమితులకు లోబడే రాష్ట్ర ప్రభుత్వాలకు రుణసేకరణకు అనుమతిస్తుందని చెప్పారు. దాన్ని అనుసరించే ఈ ఏడాది రూ.71 వేల కోట్లకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



## ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిట్లో ఎన్నికల వ్యవస్థ

- ఈసీని బీజేపీ కబ్జాచేసింది
- లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

కట్టుబడి ఉంటుందా? భాజపాకు అనుకూలంగా ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సీసీ ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలన్నీ ప్రజల ముందుకు తీసుకువచ్చినప్పటికీ ఇప్పటి వరకు వాటిపై ఈసీ తమకు సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 23 ఓట్లు ఉన్న అంశాన్ని ఆయన మళ్లీ గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌పైనా రాహుల్ గాంధీ లోక్‌సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక్కొక్కటిగా అన్ని వ్యవస్థలను కబ్జా చేస్తోందన్నారు. దేశంలోని వ్యవస్థలన్నిటిపైనా ఆధిపత్యం చూపిస్తోందని విమర్శించారు.

**'ఈసీ'ని కేంద్రం కబ్జా చేసింది**

ఈసీ, ఈడీ, సీబీఐ వంటి స్వతంత్ర సంస్థలను కేంద్రం కబ్జా చేసిందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌కు అనుగుణంగానే ఈసీ ఎన్నికలను నిర్వహిస్తోందని మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ గెలిచిన అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలోని అవకతవకలను బయటపెట్టామని రాహుల్ గాంధీ చెప్పారు. వారి స్వార్థం కోసం ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించేలా కేంద్రం చట్టాలను తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సీసీ ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధిచిన ఆధారాలన్నీ ప్రజల ముందుకు తీసుకువచ్చినప్పటికీ ఇప్పటి వరకు వాటిపై ఈసీ తమకు సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 23 ఓట్లు ఉన్న అంశాన్ని ఆయన మళ్లీ గుర్తు చేశారు. మన దేశం 150 కోట్ల ప్రజలతో కుట్టిన వస్త్రమన్న రాహుల్, దాన్ని ఓట్లతో కలిపి అల్లారని చెప్పుకొచ్చారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య నాశనం కోసం ఈసీని బీజేపీ వాడుకుంటోందని, పథకం ప్రకారమే ఈసీ ఎంపిక ప్యానల్ నుంచి సీజేఐను తొలగించారని వివరించారు.

# ప్రయాణికుల సమస్యలపై ఆరాతీయండి

- ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం
- ఇండిగో సంక్షోభంపై మంత్రి రామ్మోహన్ దృష్టి
- ఎయిర్‌పోర్టులకు ప్రత్యేక బృందాల తరలింపు
- కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం



**న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) :** ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివర్ణించిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్‌లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్‌కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్‌పోర్ట్‌లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక జంట వీడియో కాల్ ద్వారా తమ వివాహ రిసెప్షన్‌కు జరుపుకుంటే.. మరికొందరు వివాహ వేడుకలను రద్దు చేసుకోడానికి రెడీ అయ్యారు. కొందరైతే పెళ్లి వాయిదా వేయడం ఇష్టం లేక ఖరీదైన చార్టర్ ఫ్లైట్‌ను బుక్ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను..ఏం చేయాలి యార్ అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. ఓ యూజర్ ..అతను త్వరగా వివాహం చేసుకోవాలని, అతని సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కారమవ్వాలని, విమానాశ్రయాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను అంటూ స్పందించారు.

# తెలంగాణలో చలి పంజా..

- గణనీయంగా పెరిగిన చలి తీవ్రత
- సాధారణంకంటే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు



**హైదరాబాద్, డిసెంబర్9 (జనంసాక్షి) :** తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉషో?గ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.దాదాపు అన్ని జిల్లాల్లో కనిష' ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై ద ృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం చింతగూడకు చెందిన 60 ఏళ్ల వ ృద్ధుడు గంగారెడ్డి చలి తీవ్రతకు బలవ్వడం ఈ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రానున్న రోజుల్లో చలి ప్రభావం మరింత ఎక్కువ అవుతుందని చెప్పారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజులు (డిసెంబర్ 10, 11, 12, 13) చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష' ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 16 వరకు చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. ముఖ్యంగా జగిత్యాల, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి ఉన్నాయి.ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని, ఇక్కడ కనిష్ట ఉషో?గ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వ ృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా వెచ్చటి దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రాకుండా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలని, వేడి వేడి భోజనం చేయాలని తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

**అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు**




**హైదరాబాద్, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు.. ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఆ అనుమానాస్పద మెయిల్ న్యూయార్క్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఎలాంటి ముప్పు లేదని సెక్యూరిటీ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి 20కిపైగా బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. 5 ఘటనల్లో నిందితులను గుర్తించారు. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతోంది.

## అమెరికాలో బిజీగా మంత్రి లోకేశ్

- పెట్టుబలు కోసం పలు సంస్థలతో భేటీ

**అమరావతి, డిసెంబర్9 (జనంసాక్షి) :** అమెరికాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన వరుస భేటీలు నిర్వహించారు. ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మతో సమావేశమయ్యారు. అమరావతిలో డిజైన్ / ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో డెస్క్ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో యూఎస్ పెట్టుబడులకు సహకారం అందించాలన్నారు. శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డితో సమావేశమై.. ఏపీలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరితోనూ మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌తో సమావేశమై.. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. రిగెట్టి కంప్యూటింగ్ సీటీవో డేవిడ్ రివాస్‌తో భేటీ అయ్యారు. ఏపీలో ఎలక్ట్రోలైజర్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యక్తిగత వైరమే టారీఫ్ పెంపుకు కారణం

- రష్యా చమురు కొనుగోళ్లు కారణం కాదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



**న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీ మొత్తంలో సుంకాలు విధించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని ట్రంప్ చెప్పినప్పటికీ అసలు కారణం మాత్రం ఇది కాదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లు కేవలం ఒక సాకు మాత్రమేనని, వ్యక్తిగత వైరమే అసలు కారణమని ఆయన చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం ఎంతగా పాకులాడారో అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. శాంతి బహుమతి పొందడానికి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను తానే ఆపానంటూ ట్రంప్ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే భారత్, పాక్ మధ్య అణు యుద్ధాన్ని నిలువరించినట్లు ట్రంప్ చెప్పుకున్నారు. ఇరు దేశాలనూ టారిఫ్ లతో బెదిరించి కాల్పుల విరమణకు అంగీకరించేలా చేశానని ప్రచారం చేసుకున్నారు. ఈ ప్రచారానికి పాక్ వంతపాడగా.. భారత్ మాత్రం ఎప్పటికప్పుడు ఖండించింది. పాకిస్థాన్ సైన్యం ప్రాధేయపడడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రధాని మోదీ పలు సందరాల్లో స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికా సహా మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు క్రెడిట్ ఇవ్వలేదనే ఆగ్రహంతో భారత్ పై ట్రంప్ కక్ష పెంచుకున్నారని, ఆ కోపంతోనే భారీగా టారీఫ్ లు విధించారని రఘురామ్ రాజన్ ఆరోపించారు. ఈ విషయంలో ట్రంప్ ప్రచారానికి వంత పాడడం ద్వారా పాక్ ప్రయోజనం పొందిందని చెప్పారు. పాకిస్థాన్ పై 19 శాతం టారీఫ్ లు విధించిన ట్రంప్.. భారత్ పై మాత్రం 50 శాతం సుంకాలు వడ్డించడానికి ఇదే కారణమని చెప్పారు. రష్యా చమురు కొనుగోళ్లు అమెరికాకు ఎప్పుడూ ప్రధాన సమస్య కాదని రఘురామ్ రాజన్ చెప్పారు. తాజాగా హంగేరీలో విక్టర్ ఓర్బన్ రష్యా నుంచి చమురు కొనుగోలుపై ట్రంప్ మినహాయింపు ఇవ్వటాన్ని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు.

## లారీలు ఢీకొని డ్రైవర్ సజీవ దహనం

**ప్రకాశం జిల్లా బెస్తవారిపేట వద్ద ఘటన**

**బెస్తవారిపేట, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బెస్తవారిపేట మండలం పెంచికలపాడు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దురెటనలో ఒక లారీ డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయి మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. వివరాల్లోకి వెళ్తే, అనంతపురం నుంచి టమాటా లోడ్‌తో రాజమండ్రికి వెళ్తున్న లారీ పెంచికలపాడు వద్దకు రాగానే టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీనితో లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు టమాటా లారీ బోల్తా పడగా, ఆయిల్ ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. ఆ వెంటనే లారీలో మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. దీంతో అతను అక్కడికక్కడే సజీవ దహనమయ్యాడు. మ ృతుడిని పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి వాసిగా గుర్తించారు. విశాఖ సమీపంలోని పరవాడ నుంచి చమురు లోడ్ చేసుకుని తాడిపత్రిలోని ఒక సిమెంట్ పరిశ్రమకు వెళ్తుండగా ఈ విషాదం జరిగింది. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగరి వద్ద రోడ్డు ప్రమాదం

**రెండు కార్లు ఢీకొని ముగ్గరు మృతి**

**ఇద్దరు తిరుచానూరు పోటు కార్మికులుగా గుర్తింపు**

**తిరుపతి, డిసెంబర్9 (జనంసాక్షి) :** రాష్ట్రంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయి.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న పరిస్థితి. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ కూడా అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటిని ప్రమదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. తాజాగా తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు తిరుచానూరు అమ్మవారి ఆలయ పోటు వర్కర్లుగా గుర్తించారు. కార్మికులు ఇద్దరు తిరుపతి నుంచి తిరుత్తనికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో నగరి మండలం తడుకు పేట వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మరో కారు డ్రైవర్ కూడా సంఘటనా స్థలంలోనే చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోటు కార్మికుల మృతి.. తిరుచానూరులో ఉన్న మిగిలిన పోటు కార్మికుల్లో విషాదాన్ని నింపింది.

# నన్ను కూర్చోబెట్టేది ఎవరు?

- మా వల్లే వందేమాతరానికి అన్యాయం
- కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలు
- ప్రతిపక్షాలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్
- లోక్‌సభలో సహనం కోల్పోయిన రక్షణ మంత్రి



**న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) :** లోక్‌సభలో 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చ తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. చర్చ సందరరేగా తన ప్రసంగానికి ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నన్ను కూర్చోబెట్టేది ఎవరు? ఎవరు కూర్చోబెడతారు?" అంటూ వారిపై విరుచుకుపడ్డారు. "ఏం మాట్లాడుతున్నారు మీరు... కూర్చోండి!" అని గట్టిగా హెచ్చరించారు. స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని సభ్యులను శాంతపరచాల్సి వచ్చింది. సోమవారం లోక్‌సభలో 'వందేమాతరం' అంశంపై చర్చ జరిగింది. ఈ సందరరేగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ గీతమైన 'వందేమాతరం'ను ముక్కలు చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచే ఈ అన్యాయం మొదలైందని విమర్శించారు. వందేమాతరం గీతానికి జరిగిన అన్యాయం కేవలం ఒక పాటకు మాత్రమే కాదని, యావత్ స్వతంత్ర భారత ప్రజలకు జరిగిందని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభిస్తూ వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఈ గీతం కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. వందేమాతరం వందేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని అణచివేసిందని విమర్శించారు. ఈ చర్చపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ద ృష్టిలో పెట్టుకునే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని, ప్రజా సమస్యల నుంచి ద ృష్టి మళ్లించే ప్రయత్నమే ఇదని ఆరోపించారు. నెహ్రూను విమర్శించడానికి సమయం కేటాయించడం మానేసి, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలని ఆమె సూచించారు.

## తిరుమల పరకామణి చోరీ కేసులో హైకోర్టుకు సీఐడీ మరో నివేదిక

**అమరావతి, డిసెంబర్9 (జనంసాక్షి) :** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మరో నివేదికను హైకోర్టుకు సీఐడీ సమర్పించింది. తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంపై సీఐడీ అదనపు నివేదికను వేసింది. అదనపు నివేదికను మరో రెండు సెట్లను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధతను తేల్చేందుకు విచారణ జరుపుతున్న సీజే నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలన నిమిత్తం నివేదికలు వారి ముందు ఉంచాలని రిజిస్ట్రీకి న్యాయస్థానం స్పష్టీకరించింది. అదనపు నివేదికను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు తదుపరి విచారణను బుధవారం నాటికి హైకోర్టు వాయిదా వేసింది.కాగా.. అంతకు ముందే పరకామణి చోరీ కేసు రాజీ వ్యవహారం, రవికుమార్ ఆస్తులపై నివేదికలను సీఐడీ అధికారులు సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసిన విషయం తెలిసిందే. సీఐడీ నివేదికను తమకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న రవికుమార్ తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. కాగా.. 2023 ఏప్రిల్ 29న పరకామణి విధుల్లో రవికుమార్ అమెరికన్ డాలర్లను అపహరిస్తూ దొరికిపోయాడు. అయితే తొలిసారి దొంగతనం చేశానంటూ రవికుమార్‌తో క్షమాపణ చెప్పించి ప్రభుత్వ లెక్కల ప్రకారం అప్పట్లో 14 కోట్ల 43 లక్షల విలువైన రవికుమార్ ఆస్తులను టీటీడీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేలా చేశారు. 2023 జూన్ 19న ఆ మేరకు తీర్మానం చేయడం ఆ తర్వాత 3 నెలలకే కేసును రాజీ కుదర్చడం వెనుక ఉన్న మతలబుపై విచారణ జరిపిన సీఐడీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది.

# అలనాటి బెంగాలీ, ఒరియా సమాజాల దర్పణం ఈ ఆత్మకథ

గోపీనాథ్ మొహంతి. ఈ పేరు వినగానే చాలామంది సాహితీపిపాసులు ఆయన ఒక గొప్ప నవలాకారుడని చెబుతారు. మౌలికంగా ఆయన ఒరియా భాష లో రాసినప్పటికీ అమృత సంతానం,పరజ వంటి నవలలు తెలుగు లోకి కూడా అనువాదం కావడం తో వాటికి ఎనలేని ఖ్యాతి కలిగింది. ముఖ్యంగా ఆయన కోంధ ఆదివాసి తెగ ఆలంబనగా రాసిన అమ ృత సంతానం భారతీయ సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది.

1955 లో ఆ నవలకి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఆ తర్వాత అది ఇంగ్లీష్ లోకి ఇంకా ఇతర భారతీయ భాషల్లోకి కూడా అనువదించబడింది. అలాగే మటి మటాల అనే ఒరియా నవల కి జ్ఞానపీఠ పురస్కారం వరించింది. నవలలు, కథలు,వ్యాసాలు విరివిగా రాశారు. తన చివరి దినాల్లో అమెరికా లోని సాన్ జోస్ యూనివర్శిటీ లో ఆంథ్రోపాలజీ పాఠాలు చెబుతూ అక్కడే తుదిశ్వాస విడిచారు. అయన 1914లో కటక్ ప్రక్కనే ఉన్న నాగావళి అనే గ్రామం లో జన్మించి 1991 లో అమెరికా లోని సాన్ జోస్ లో మరణించారు. గోపీనాథ్ మొహంతి తన జీవిత కాలం లో ఇంచుమించు విద్యార్థి దశనుంచి తాను మరణించే వరకు డైరీ రాసుకున్నారు. వాటన్నిటినీ కలిపి ఆయన ఆత్మకథ గా ఒరియా భాష లో గ్రంథ రూపం లో తీసుకొచ్చారు. ఆ తరువాత విస్తృతం గా ఇతర భాషల్లో కూడా ఉన్న ఆయన అభిమానుల కోసం ఇంగ్లీష్ లో కూడా అనువాదం చేశారు.

మొదటి భాగం పేరు srotaswati (The Flowing stream) అనువాదకురాలి పేరు సుధేష మొహంతి. గోపీనాథ్ మొహంతి తను బతికిఉన్న రోజుల్లో తన ఆత్మ కథ కి సంబంధించి వారసులకి కొన్ని కండీషన్లు పెట్టారుట. ఒకటి తను పోయిన తర్వాతనే దాన్ని ప్రచురించాలి, అలాగే టైటిల్ ని స్రోతస్వతి అని ఉంచాలి, అలాగే అట్ట మీద తాను వేణువు వాయిస్తున్న ఫోటో ని ముద్రించాలి అంటూ ఆయన పెట్టిన షరతులన్నిటినీ వారసులు తుచ తప్పకుండా పాటించారు. ఈ గోపీనాథ్ మొహంతి గారి ఆత్మ కథ వల్ల మనకి చాలా విషయాలు, ముఖ్యంగా , దేశం స్వేఛ్ఛా వాయువులు పీల్చక ముందు తూర్పు దిశలో ఉన్న భారతీయ సమాజం ఎలా ఉండేది అనేది చక్కగా తెలుస్తుంది. తాను రచయిత గా, ఆలోచనాపరునిగా ఎదగడం లో తన చుట్టు పక్కన ఉన్న ప్రజలు ఎలా సహకరించారు అనేది చెబుతూనే తాను ఎదుర్కున్న విభిన్న సాంఘిక సంఘర్షణల్ని మన కళ్ళ ముందు ఉంచుతారు. కటక్ ప్రక్కనే గల నాగావళి అనే గ్రామం లో జన్మించిన గోపీనాథ్ ఆరేడు ఏళ్ళ వరకు పాఠశాల కి వెళ్ళలేదు. ఇంటిదగ్గరే అక్షరాలు నేర్చుకున్నాడు. అప్పట్లో బీహార్ ,ఒరిస్సా,బెంగాల్ అంటూ ప్రత్యేకం గా లేవు. సంస్థానాలు ఉండేవి. తనతండ్రి సోనే పూర్ మహారాజా ఆస్థానం లో పనిచేస్తు అనారోగ్యం వల్ల ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రామానికి వచ్చేయడం తో చాలా బాధలు పడతారు. కుటుంబ దీనస్థితి చూసి మళ్ళీ ఆయన ఉద్యోగానికి అప్లయ్ చేసుకోవడం తో 58వ యేట సర్వేయర్ గా ఉద్యోగం వస్తుంది. నాగాబళి నుంచి సోనే పూర్ అక్కడ నుంచి ప్రస్తుత పాట్నా కి మకాం మారుతుంది. పాట్నా లో గోపీనాథ్ యొక్క పెద్దన్నయ్య చిరుద్యోగి. తండ్రి మరణించిన తరువాత పాట్నా లోనే ఎక్కువ కాలం ఉంటాడు.

పాట్నా లోని ఆయన స్కూల్ జీవితం నాటి విద్యా వ్యవస్థ యొక్క తీరు తెన్నుల్ని తెలియపరుస్తుంది. ఒక వైపు ఒరియా సాహిత్యాన్ని, మరో వైపు ఇంగ్లీష్ సాహిత్యాన్ని చదువుతూ ఉపాధ్యాయులకి ప్రీతిపాత్రుడవుతాడు. విద్యాధికారి గా ఉన్న ఓ బ్రిటీష్ జాతీయుడు వీరి స్కూల్ ని సందర్శించినప్పుడు గోపీనాథ్, షేక్స్ పియర్ నాటకాల్ని వరించిన తీరు ని చూసి ప్రత్యేకంగా రెండు రోజులు సెలవు మంజూరు చేస్తాడు.

పాట్నా నుంచి కటక్ తిరిగివచ్చిన తరువాత ఆ ప్రాంతానికి, ఒరియా సమాజానికి ఉన్న తేడాల్ని గమనించిన విధానం ఎంతో లోతు గా ఉంటుంది. బెంగాలీ లు తమ ఆధిపత్య వైఖరి తో ఒరియా ప్రాంతానికి చెందిన జయదేవుడిని, చైతన్య మహా ప్రభువుని ఇంకా ఇతరుల్ని తమ వారిగా ప్రచారం చేసుకోవడాన్ని దీనిలో తీవ్రంగా ఖండించాడు. అలనాటి ఎన్నో సామాజిక,సాంస్క ృతిక విషయాల్ని మనం తెలుసుకోవాలంటే ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి.

**మూర్తి కె.వి.వి.ఎస్ (78935 41003)**

# రైజింగ్ తెలంగాణ 2047తో విద్యారంగం అభివద్ధి సాధ్యమేనా?

తెలంగాణ ఏర్పాటు దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత, "2047 కల్లా అభివద్ధి చెందిన రాష్ట్రం" అనే భారీ లక్ష్యాల బాటలో ప్రభుత్వం సాగుతోందని ప్రకటిస్తోంది. 'రైజింగ్ తెలంగాణ 2047' అనే దిశానిర్దేశక పత్రం కూడా విడుదల చేసింది. కానీ, ఆ స్వప్నాల్ని నిజం చేసే అసలైన పునాది విద్యారంగం. ఈరోజు ఏ స్థితిలో ఉందో చూస్తే ఆశ కన్నా ఆందోళనే ముందుకు వస్తోంది. ఒక రాష్ట్రం భవిష్యత్తును నిర?యించేది పరిశ్రమలు, రహదారులు, బడ్జెట్ గణాంకాలు కాదు. బడులు, గురువులు, పరిశోధన, విద్యార్థుల భద్రత, సమానమైన అవకాశాలు. ఇవి బలపడ్డప్పుడు మాత్రమే 2047 లక్ష్యాలు నిజం అవుతాయి. తెలంగాణలో విద్యారంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నీ ఈ స్వప్నానికి అడ్డుతగులుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు వెనుకబడి కనిపిస్తున్నారు.

గురుకులాలు, సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థలు విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టినా, సీట్లు పెరుగుతున్నాయి కానీ బడ్జెట్ కుదిస్తోంది. ఉన్నత విద్యలో పరిస్థితి మరింత క్లిష్టం యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది ఖాళీలు నింపకుండా సంవత్సరాలు గడిచాయి. విద్యార్థుల కోసం ప్రభుత్వమే రూపొందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం బకాయిలతో ఊపిరి తీసుకోలేని స్థితిలో ఉంది.

ఈ నేపథ్యంలో 2047 లక్ష్యాలను మాటలతో కాదు, బలమైన నిర?యాలతోనే చేరుకోగలం. విద్యను వ్యయం గా కాకుండా 'పెట్టుబడిగా' చూడాలి. ప్రతి పాఠశాలలో శాశ్వత ఉపాధ్యాయులు, సైన్స్ ల్యాబ్లు, కంప్యూటర్ ల్యాబ్లు, గ్రంథాలయాలు తప్పనిసరి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనే మొదటి తరగతి నుంచి ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టటం చేసినా, మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన గురువులు లేకుండా అది నామమాత్రం అవుతుంది.

2025-26 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు 23,108 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 7.6 శాతం మాత్రమే. సిఫారసు చేయబడిన 10 శాతం లక్ష్యానికి చేరలేకపోయింది. రాష్ట్రంలోని 25 వేల పాఠశాలల్లో కనీసం మూడొంతుల పాఠశాలలకు భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి ప్రాథమిక సదుపాయాలు సరిగా లేవు. ఇది బడ్జెట్ కేటాయింపుల దయనీయ స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత మరింత తీవ్రమైంది.

రాష్ట్రవ్యాప్తంగా 5,821 ప్రభుత్వ పాఠశాలలు ఒక్కో ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయి. ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించే పరిస్థితి ఇంకా కొనసాగుతోంది. టీచర్లు లేక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో 1,800కి పైగా పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాలేదు. విద్యార్థుల లేమి, ఉపాధ్యాయుల లోటు, సదుపాయాల కొరత కలిసి విద్యా వ్యవస్థను క్రమంగా పతనం వైపుకి నెడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గురుకులాలు సంక్షేమాన్ని మరిచారు. 1092 గురుకులాలు నూతనంగా ఏర్పాటు చేస్తే వాటిలో కనీసం 662 భవనాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. వాటిలో కనీస మౌళిక సదుపాయాలు లేవు, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన సరిపోవడం లేదు, పెరుగుతున్న ధరలకనుగుణంగా ఇప్పటివరకు సవరించి మెస్ ఛార్జీలు ఇచ్చింది లేదు.నాణ్యమైన భోజనం, మౌళిక సదుపాయాలు, తరచూ ఆహారం విషపూరితం కావడం విద్యార్థులు మరణించడం, ఆసుపత్రి పాలు కావడం రాష్ట్రంలో నిత్యకృత్యం అయ్యింది.




రాష్ట్రం ఏర్పడిన నుండి ఇప్పటివరకు యూనివర్శిటీలు నిధులు క్రమంగా తగ్గాయి. అభివద్ధి కోసం కేటాయించిన నిధులు శూన్యం. విద్యార్థులకు మెస్, ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు లేవు. కరీంనగర్ శాతవాహన యూనివర్శిటీలో తరగతి గదులు లేక రేకులు షెడ్డు క్రింద ఫార్మసీ, పాత హస్టల్ భవనాలు నడుస్తున్నాయి. పాలమూరు ,మహాత్మాగాంధీ యూనివర్శిటీలో గదులు, తలుపులు విరిగి పోయాయి, త్రాగు నీటి సమస్యలు ఉన్నాయి.జెఎన్టీయు ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీలు విద్యార్థులకు ప్రధానంగా విద్యార్థినీలకు హస్టల్స్ లేక ఆందోళనలు చేశారు. ఉస్మానియా యూనివర్శిటీలో నిజాం నిర్మించిన రేకుల షెడ్ల హస్టల్స్ లోనే వసతి గృహాలు ఉన్నాయి. పాడుబడిన హస్టల్స్ పెచ్చులు ఊడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. సరైన భోజన సదుపాయాలు లేవు, వైద్య, వసతి సదుపాయాలు లేవు, అనేక సార్లు నాణ్యమైన భోజనం కోసం ఉస్మానియా విద్యార్థినీలు రోడ్డెక్కారు.

2013 నుండి ఇప్పటి వరకు రాష్ట్ర యూనివర్శిటీలలో నియామకాలు లేవు. రాష్ట్ర యూనివర్శిటీలలో కేవలం 24 శాతం మంది మాత్రమే రెగ్యూలర్ పోస్టులు ఉన్నాయి.76 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెగ్యూలర్ పోస్టులు భర్తీ లేకపోవడంతో కాంట్రాక్టు, పార్ట్ టైం పద్దతిలో అధ్యాపకులను భర్తీ చేశారు. రాష్ట్రంలో 1365 మంది కాంట్రాక్టు,700 మంది పార్టు టైమ్ అధ్యాపకులు వర్శిటీలో పని చేస్తున్న వారికి కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు.రెగ్యూలర్ అధ్యాపకులు లేరని కోర్సులు మూసివేస్తున్న దుస్థితి కనపడుతుంది. 2828 పోస్టులు మంజూరు కాగా 1869 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు కాదు, కనీసం చదువుకునే అవకాశం లేకుండా పోతుంది. దేశంలో మొట్టమొదటి బాషా యూనివర్శిటీ తెలుగు యూనివర్శిటీలో కేవలం 03 రెగ్యూలర్ పోస్టులే ఉన్నాయి. తెలుగు యూనివర్శిటిలో తెలుగు ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది.

రైజింగ్ తెలంగాణ 2047 పేరుతో విదేశీ యూనివర్సిటీలను తెలంగాణకు ప్రభుత్వ ఆహ్వానిస్తుంది. ఒక పక్క ఉస్మానియాను స్టానోర్డ్, మరోపక్క కాకతీయను ఆక్స్ఫర్డ్ గా మారుస్తామని చెబుతూనే రాష్ట్రంలో విద్య కేంద్రీకరణ విధానానికి కాంగ్రెస్ పూనుకుంటుంది. రాష్ట్రంలో విద్యా కార్పొరేటీకరణ, వాణిజ్యీకరణ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే కుట్రలకు పాల్పడుతుంది. విదేశీ యూనివర్సిటీలను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు చేసుకోవడానికి తలుపులు బార్లా తెరిచి ఆహ్వానిస్తుంది. ఆస్ట్రేలియా, జర్మనీ, యూకే దేశాల నుండి యూనివర్సిటీలను తెలంగాణలో ఏర్పాటు చేయమంటూ విదేశీ యూనివర్సిటీలకు ఆహ్వానాలు పంపి తెలంగాణలో ఆఫ్ క్యాంపస్లను ఏర్పాటు చేయాలని కోరడమంటేనే తెలంగాణ విద్యా రంగాన్ని కార్పొరేట్, విదేశీ కబంధహస్తాలకు అప్పగించే ప్రయత్నం చేయడమే. ప్రధాన మానవ అభివద్ధి సూచికలైన ప్రభుత్వ విద్య, వైద్యాన్ని పరిగణలోకి తీసుకోకుండాప్రభుత్వాలు ఎన్ని 'విజన్ డెవలప్‌మెంట్' ప్రణాళికలు రూపొందించినా మంచి ఫలితాలు రావని పలు అనుభవాలు చెపుతున్నాయి. ప్రాథమికమైన ప్రజా సేవలు ముఖ్యంగా ఒక వైపు విద్యకు తగిన నిధులు కేటాయించక పోవడం మరో వైపు పెద్ద ఎత్తున నగరాభివద్ధి ప్రణాళికల ప్రాజెక్టులతో సామాన్యులకు ఒరిగేది ఏమి ఉండదు.

విద్యా రంగంలో ప్రైవేటీకరణ పట్టు మరింత బలపడుతోంది. తెలంగాణలో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థులలో 57 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇది 50 శాతానికి పైగా ఉంది. అంటే పేద కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల నాణ్యతపై నమ్మకం కోల్పోయి వాణిజ్య విద్య వైపుకి మళ్లిపోతున్నాయి. ఈ ధోరణి "విద్య అందరికీ" అనే ప్రజాస్వామ్య లక్ష్యాన్ని దెబ్బతీస్తోంది. విద్యార్థి హక్కు మార్కెట్‌లో వస్తువుగా మారిపోతోంది. మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం విద్యలో అసమానతలు, నాసిరకమైన నాణ్యత కొనసాగితే అభివద్ధి అసంపూర?ంగానే ఉంటుంది. 'రైజింగ్ తెలంగాణ 2047' విజయం విద్య ద్వారానే సాధ్యం.పేద ధనిక తేడా లేకుండా పిల్లలందరూ ఏ నివాస ప్రాంతాలలో నివసిస్తున్నారో అదే పరిసరాలలో ఉన్న విద్యాసంస్థకు మాత్రమేపోవాలనే చట్టం తేవాలి. అంటే ఆ నివాస ప్రాంతంలో నివసించే ముఖ్యమంత్రి మనవడు, ఆ ప్రాంతం లో నివసించే రోజు కూలీ కూతురు ఒకే బడికి ఒకే తరగతి గదిలో చదువుకుని నాణ్యమైన విద్యను అందుకున్నప్పుడే 'రైజింగ్ తెలంగాణ 2047"కలను సాకారం చేస్తుంది. పాఠశాల, యూనివర్సిటీలు, సంక్షేమ వసతి గ ృహాలను ప్రభుత్వ రంగంలో ఇంగ్లీష్ విద్యలో సౌకర్యాలు కల్పించి నడిపినపుడు, నిధులు అందించినపుడే అసలైన లక్షాలను సాధించగలము.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను సమయానికి విడుదల చేయకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతుంది. విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించే విధానం లేకుండా 2047 వంటి లక్ష్యాలు కాగితాలపైనే ఉంటాయి.

కాబట్టి ప్రతి విద్యార్థికి ఫీజులను సకాలంలో విడుదల చేయాలి. విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి. విద్యార్థి సంఘాల ఎన్నికలు పునఃప్రారంభించాలి. విద్యార్థుల అభ్యంతరాలు, అవసరాలు నేరుగా వ్యవస్థకు చేరాలంటే ఇదే ప్రజాస్వామ్య మార్గం.గ్రామీణ, నగర వైషమ్యాన్ని తొలగించాలి. పట్టణాల్లోని కార్పొరేట్ పాఠశాలలు ఒక ప్రపంచం, గ్రామ పాఠశాలలు మరో ప్రపంచంగా విడిపోయిన వాస్తవం కొనసాగితే సమాన అభివద్ధి అసాధ్యం. ప్రతి గ్రామ పాఠశాల కూడా కనీసం జిల్లాలోని మంచి ప్రభుత్వ పాఠశాలకు సమాన మౌలిక సదుపాయాలు కలిగి ఉండాలి. 'రైజింగ్ తెలంగాణ' అనే నినాదం ఆకర్షణీయమే. కానీ ఆ నినాదం భవిష్యత్తును మార్చాలంటే పునాది బలంగా ఉండాలి. రేపటి తెలంగాణను తీర్చిదిద్దేది పరిశ్రమలు కాదు. ఈరోజు చదువుతున్న పిల్లలు, మెరుగైన విద్య కోరుతున్న యువత. వారి విద్య హక్కు కేవలం పత్రాల్లో కాకుండా వాస్తవంగా చేరాలనే సంకల్పం ప్రభుత్వం చూపితేనే 2047 లక్ష్యాలు చేరుకోగలం. టెక్నాలజీ, జ్ఞానం, పరిశోధన, సమాన అవకాశాలపై ఆధారపడిన విద్యా పునర్నిర్మాణం జరిగితేనే తెలంగాణ నిజంగా రైజ్ అవుతుంది. లేకపోతే "2047" కూడా మరో రాజకీయ నినాదంగానే మిగులుతుంది.

**టి. నాగరాజు**
**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి**
**ఫోన్:9490098292**

## నేను వెయ్యను ఓటు

నోటు కు ఓటు
నే వెయ్యను
క్వార్టర్ కు
నేను వెయ్యను
ఓటు కులభిమానం తో
నేను వెయ్యను ఓటు
మతాభిమానం తో
డబ్బు కు దాసోహం
కాదు నా ఓటు
నేను వెయ్యను ఏ
వ్యామోహం కు ఓటు
ఓటు నా చేతిలోని
పశుపశస్త్రం
నీ జాయితికి అభిషేకం
గ్రామాభివ ృద్ధి కి
సోపానం
ఓటు తో
నిజాయితీ పరుణి?
ఎన్నుకో
గ్రామాన్ని అభివ ృద్ధి చేసుకో

**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్ ఇన్ సీవీక్స్**
**కామారెడ్డి**

## కవిత

కిలోమీటర్ పొడవై
సాగాలని లేదు
మీటరైనా రేడియం లా
మెరవాలని ఉంది

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

## రొమ్ములతోపాటు

చిగురుమొగ్గై మొగ్గపువ్వై
పరిమళపాటై
తేమఉట్టై ఉటబావై పొలాలబాటై
మిణుగురుతారై తారమెరుపులతోటై
పల్లవించడం పరుగుతీయడం
ఫలితమివ్వడం ప్రక ృతినైజం
బుడిబుడినడకల దీపంలో
వడివడివరదల రూపంకై
నవమాసాలు మోసి జన్మనిచ్చిన
తల్లిలో
తన్మయం
రొమ్ములతో పాటు నెత్తినకొమ్ములు
మొలిస్తేనే
విస్మయం

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# ఆహారపు వృధా అరికట్టకపోతే భవిష్యత్తులో ఆహార కొరత

ఒక వైపు ఆకలి కేకలు, మరో వైపు తినగల ఆహారం చెత్త బుట్టల్లో కలిసిపోతూ ఉండే ఈ విరోధాభాసం మన సమాజ ఆర్థిక నైతిక వ్యవస్థలలో ఉన్న లోతైన లోపాలను బహిర్గతం చేస్తుంది. ప్రపంచ స్థాయిలో 2022లో వినియోగదారుల దశలోనే సుమారు 1.05 బిలియన్ల టన్నుల ఆహారం వృథా అయింది, ప్రతి వ్యక్తికి సగటు 79 కిలోల చొప్పున కిచెన్ డబ్బాల్లో పడిపోయింది, ఈ మొత్తం వ్యర్థంలో ఇళ్లదగ్గరే ఆరు వంతుల భాగం తయారైంది, సేవారంగం రెస్టారెంట్లు క్యాంటీన్లు తదితరాలు దాదాపు మూడొంతులు, రిటైల్ రంగం మిగతా భాగం సృష్టించాయి, ఇదే సమయంలో ఆకలి బాధతో రోజూ కోట్లాది జనాలు తలదాచుకుంటున్నారు, ఈ వ్యర్థం నుంచి గ్రీన్ హౌస్ వాయువులు మరింతగా వెలువడుతున్నాయి అని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం తాజా ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ నివేదిక స్పష్టం చేసింది.

2.మన దేశ దృశ్యం ఇంకా తీవ్రంగా కనిపిస్తుంది. యునెప్ 2024 మూల్యాంకనం ప్రకారం భారతీయ ఇళ్లలోనే సంవత్సరానికి సుమారుగా 78 నుంచి 78.2 మిలియన్ల టన్నుల ఆహారం చెత్తగా మారుతోంది, ప్రతి పౌరుడి ఇంటివద్ద సగటు వృథా 55 కిలోలకు చేరుతోంది, మన భారీ జనాభా కారణంగా మొత్తం పరిమాణం ప్రపంచంలో అగ్రస్థానాలకు దగ్గరగా నిలుస్తోంది అని అనేక మూలాలు ఏకస్వరంగా తెలియజేశాయి. నగర ప్రాంతాలలో వృథా స్థాయి గ్రామాల కంటే ఎక్కువగా ఉండడం, ఉష్ణత ఎక్కువగల దేశాల్లో గది ఉష్ణోగ్రత నిల్వలు అస్తవ్యస్తం కావడం, శీతల సరఫరా సంకెళ్ల కొరత ప్రభావం పడడం వంటి అంశాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయని నివేదిక మరో కోణం నుంచి సూచించింది.

ఈ అర్థం చేసుకోవాలంటే ఒక కీలక తేడా తెలుసుకోవాలి, పంట కోత నుంచి మార్కెట్ దాకా నష్టాలు ఫుడ్ లాస్, వినియోగదారుల దశలో చెత్తకు వెళ్లేది ఫుడ్ వేస్ట్ అనే పరిభాష. మన దేశంలో ఫుడ్ వేస్ట్ పై దేశవ కొలమానం ఇంకా వ్యవస్థీకృతంగా మొదలయ్యే దశలోనే ఉంది, అయితే పంట తరవాత నష్టాలపై పెద్ద చిత్రమే ముందుకు వచ్చింది. నాబ్‌కాన్స్ చేపట్టిన సమీక్షా అధ్యయనంపై ఆధారపడి ఐస్రియర్ పాలసీ బ్రీఫ్ చెప్పి నట్టు 2020 నుంచి 2022 మధ్య వ్యవసాయ పంటలు సహచర ఉత్పత్తులపై సంభవించిన నష్టాల ఆర్థిక విలువ ఏటా దాదాపు 1.53 లక్షల కోట్లకు చేరింది, మన దేశంలో ధాన్యాల వద్ద శాతం నష్టం చైనాతో పోల్చితే రెట్టింపు స్థాయిలో నమోదైనట్టు అదే అధ్యయనం వివరిస్తుంది. కోత దున్నే దశల్లోనే నష్టం ఎక్కువగా జారిపోతుంది, నిల్వలో నాణ్యత తగ్గుదల కూడా రైతు ధరను కట్ చేస్తుంది, పోషక విలువలు హీనమవుతాయి, నీటి భూసారం శక్తి పెట్టుబడులు అన్నీ వృథా అవుతాయి అని రచయితలు హెచ్చరిస్తున్నారు.

కేంద్ర సంస్థల గోదాముల్లో నిల్వ రవాణా దశల్లో కూడా కొంత నష్టం తప్పడం లేదు. పంజాబ్‌లో 2019 నుంచి 2024 మధ్య 8 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం పాడైందని ప్రాంతీయ లెక్కలు చెబుతున్నాయి, ఏదో ఒక ఏడాదిలో ఏదో ఒక జిల్లాలో వందల టన్నులు పాడై దత్తడిగా నమోదవ్వడం చూస్తున్నాం. ఈ దృశ్యం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న నిల్వ సదుపాయాల్లో మైక్రో స్థాయి లోపాలకు అద్దం పడుతుంది. అదే సమయంలో ఎఫ్‌సీఐ దేశవ్యాప్తంగా నఫ్సా అవసరాలు తీర్చేందుకు లక్షల టన్నుల ధాన్యాన్ని రైల్వే ద్వారా తరలించిన నెంబర్లు కూడా ఉన్నాయి, సరఫరా వ్యవస్థ మహత్తును చూపించే సంకేతాలే అవి, అయితే ప్రతి కిలో వినియోగదారుని ప్లేట్ దాకా బద్రతగా చేరాలంటే పాడుబడే లూప్ హోల్స్ మూసివేయడమే అసలు ప్రశ్నగా మిగులుతోంది.

పండ్ల కూరగాయల వంటి త్వరగా కుళ్లే ఉత్పత్తులలో కోత తరవాత నష్టాలు సగటు శాతాల్లోనే ఎక్కువగా ఉంటాయి, కొన్ని సందర్భాల్లో అదుపు తప్పిన పరిధులకు చేరతాయి అని పలు సమగ్ర సమీక్షలు చెబుతున్నాయి. శీతల సంకెళ్ళ విస్తరణ, ప్రాథమిక గ్రేడింగ్ ప్యాకింగ్ కేంద్రాలు, గ్రామ స్థాయి సోలార్ చిల్లర్లు, తక్కువ వ్యయ ఎథిలీన్ శోషకాలు వంటి పరిష్కారాలు రైతు వద్దే నష్టాన్ని తగ్గిస్తాయి, మధ్యవర్తిత్వానికి బలమ పడకుండా రైతు గిడ్డంగి రసీదుల పథకం ద్వారా సరైన సమయంలో విక్రయించే అవకాశం




కల్పిస్తాయి, చిన్నదైన పొలం విస్తీర్ణం ఉన్న కుటుంబాలకి యంత్రాల సమూహ వినియోగ సేవలు అందితే కోత దశలో జారిపోతున్న ధాన్యం తగ్గుతుంది అని ప్రసక్తి ఉన్న ఆధారాలు సూచిస్తున్నాయి.

3.ఇప్పుడు ఆకలి దృశ్యంతో కలిపి చూడాలి. యునెప్ ప్రకటన ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు బిలియన్ల భోజనాల సమాన ఆహారం చెత్తలో కలసిపోతోంది, ఈ వ్యర్థం 8 నుంచి 10 శాతం గ్రీన్ హౌస్ ఉద్గారాలకు కారణమవుతోంది, ఆకలి బాధితుల సంఖ్య ఏడు కోట్ల డెబ్బై మూడు లక్షల నుంచి ఇంకా పైకి ఎగబాకుతోంది. రోజూ ఇళ్లలో పడే చెత్తలో కనీసం కొంత భాగం తినదగినదే, దానిని నిల్వ పద్ధతులు తెలియక లేదా భోజన పరిమాణాలను అంచనా వేయక, వంటింటిలో మెను ప్లానింగ్ లేక, వాణిజ్య స్థలాల్లో సర్వింగ్ పరిమాణాలు ఆకు మదింపు లేక వదిలేస్తున్నాం అని ఆ నివేదిక వాక్యాల సారాంశం చెబుతోంది.

దేశంలో వృథాను కొలవడం తగ్గించడం కోసం విధాన స్థాయిలో చర్యలు కావాలి, పంచాయతీ నుంచి పురపాలకమట్టం వరకు వంట నివ్వే వేడుకలలో అవశేషాల సేకరణకు నియమాలు, అంచనా మెనూ సాధనాల ప్రోత్సాహం, భోజనశాలలలో అర్థ సర్వింగ్ ఎంపిక, ప్లేట్ సైజులు శాస్త్రీయంగా నియంత్రణ, ఆహారదాతృత్వ శృంఖలాలకు పన్ను ప్రోత్సాహం వంటి సాధనాలు ఉపయోగపడతాయి. నగరాల్లో సేకరణ రవాణా నెట్వర్క్‌లు ఫుడ్ బ్యాంక్‌లతో డిజిటల్ సంకలనం సాధిస్తే పెళ్లిళ్ల కార్యాలయ క్యాఫెటీరియాలు హొటల్ లోపల మిగిలే పదార్థం గంటల్లోనే అవసర మైనవారికి చేరుతుంది, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలతో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు మున్సిపల్ ట్రాన్స్‌పోర్ట్ స్లాట్లు ఇవ్వడం ద్వారా సమయ నష్టం తగ్గుతుంది అని అంతర్జాతీయ అనుభవాలు గమనిక పెడుతున్నాయి.

ఇళ్ల స్థాయిలో పరిష్కారం సులభమైన పద్ధతుల నుంచే మొదలవుతుంది. వారాంతపు సరుకుల జాబితాలు వంటకాల ముందస్తు ప్రణాళిక మిగిలిన పదార్థంతో రెండో భోజనం కాంబోలు ఫ్రిజ్‌లో భాగాలుగా నిల్వ పెట్టే పారదర్శక పాత్రలు బైబై బఫే అబద్ధపు ఆకలి ధోరణి ముగింపు అన్నీ మన నుంచి మొదలవుతాయి, కిచెన్ వ్యర్థాన్ని హొమ్ కాంపోస్టింగ్‌లోకి మళ్లిస్తే చెత్త గుట్టల వాసన దూరమవుతుంది, పెచ్చులు ప్లాస్టిక్ సంచులు తగ్గుతాయి, పురపాలక బిల్లపై ఒత్తిడి దిగుతుంది, రైతుకు వెనక్కు వెళ్లే క్రమంలో సేంద్రియ ఎరువుకీ పునర్జన్మ లభిస్తుంది అని నిత్యాయోగ రూపకల్పన పత్రాలు సూచిస్తున్నాయి. విద్యా సంస్థలలో పాఠ్య అంశాలుగా ఆహార వ్యర్థ నిరోధాన్ని ప్రవేశపెడితే తదుపరి తరానికి అలవాటు జీర్ణమవుతుంది, హాస్టల్ మెస్‌లలో ప్లేట్ మానిటరింగ్ సిస్టమ్ పెట్టి డిజిటల్ డిస్ప్లేలో రోజువారీ వృథా కిలోగ్రాములు చూపిస్తే మంచి పోటీ తత్వం ఏర్పడుతుంది, జిల్లాస్థాయిలో ఉత్తమ మెస్ ఉత్తమ హొటల్ పురస్కారాలు ఇచ్చి సామాజిక గుర్తింపులు అందిస్తే మార్పు వేగంగా వస్తుంది, మైనర్ మార్పులే అయినా బడ్జెట్‌కు మేలు, పోషకాహారానికి లాభం, పర్యావరణానికి ఉపశమనం అనే త్రివిధ ఫలితం ముందుకు వస్తుంది. యాప్స్ ద్వారా హొటళ్లు బేకరీలు రోజుకు ముగింపు సమయానికి అమ్మలేని ఆహారాన్ని సమీప సేవా సంస్థలకు డైరెక్ట్ అలర్టు ఇవ్వగలిగే వ్యవస్థలు ఇప్పటికే కొన్ని నగరాల్లో ప్రయోగంగా మొదలయ్యాయి, వీటిని జాతీయ స్థాయికి తీసుకెళ్లే సమయం వచ్చింది అని నిపుణుల ఆలోచనలు చెప్తున్నాయి.

ప్రభుత్వ స్థాయిలో కొలమానానికి ప్రాముఖ్యత అంతకు మించి ఉంది. యునెప్ సూచించిన టార్గెట్ మేజర్ యాక్ట్ పద్ధతితో రిటైల్ సేవారంగం ఇళ్ల స్థాయిలపై సంవత్సరానికి ఒకసారి సమన్వయ కొలమానం చేపట్టాలి, రాష్ట్రాల మధ్య తులనాత్మక సూచికలను ప్రవేశపెట్టాలి, చైన్ రెస్టారెంట్లకు నివేదిక సమర్పణ విధిగా చేయాలి, పెద్ద నగరాల మున్సిపల్ కార్పొరేషన్లకు ఆహార వ్యర్థ శాతం తగ్గింపు లక్ష్యాలు కేటాయించాలి, రాష్ట్ర పోషకాహార మిషన్లతో ఫుడ్ బ్యాంకుల ఒప్పందాలు కట్టాలి అని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఇలాచేస్తే 2030 నాటికి వృథాను అర్ధానికి చేర్చాలనే ఎస్‌డిజి లక్ష్యం సాధ్యమవుతుంది, చలికాల వేడి తరంగాల దెబ్బకు నిల్వలలో పాడయ్యే పదార్థం కూడా కొంత మేర రక్షితమవుతుంది, వాతావరణ మార్పు బాధను తగ్గించే సహాయ ప్రయోజనాలు లభిస్తాయి అని నివేదికలు విశదపరుస్తున్నాయి. అంకెలతో మళ్లీ సమీక్ష. ప్రపంచ స్థాయిలో వినియోగదారుల దశలోనే ఐదో వంతు ఆహారం వృథా అయింది, ఇళ్లదగ్గర 631 మిలియన్ల టన్నులు, సేవారంగం 290 మిలియన్ల టన్నులు, రిటైల్ 131 మిలియన్ల టన్నులు, రోజుకి బిలియన్ భోజనాలకు సమాన పరిమాణం చెత్తలో కలిసిపోతోంది, భారత ఇళ్లలో సంవత్సరానికి 78.2 మిలియన్ల టన్నులు, వ్యక్తికి 55 కిలోల చొప్పున వృథా, నగరాల్లో స్థాయి ఎక్కువ, గ్రామాల్లో తక్కువ, పంట కోత తరవాత నష్టాల ఆర్థిక విలువ ఏటా 1.53 లక్షల కోట్లు, ధాన్యాల్లో శాతం నష్టం చైనా కంటే ఎక్కువ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని వేల టన్నులు గోదాముల దశలో పాడై అధికార లెక్కల్లో నమోదైపోయాయి, ఇవన్నీ ఒక్క రూపకంలో చూసుకుంటే మన తలంపులు మన పనితీరు మన పాలన కూర్చుని మళ్లీ ఆలోచించాల్సిన అవసరం ఉందని చాటుతున్నాయి. దీన్ని మారుస్తాం అంటే భోజన పరిమాణం అంచనా వేసే చిట్కాలు ఇంటి నుంచి మొదలుపెడదాం, స్కూల్ కాలేజీ ఆఫీసు మెస్ నుంచి రెస్టారెంట్ వేదిక దాకా పరిమాణాలు విజ్ఞానంతో కట్టుదిట్టం చేద్దాం, మిగిలిన పదార్థానికి రెండో జీవితం ఇచ్చే వంటకాలు నేర్చుకుందాం, శీతల సంకెళ్ల విస్తరణకు పెట్టుబడులు డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ చిల్లింగ్‌కు ప్రోత్సాహాలు సేకరణ రవాణా సమయ నియంత్రణలకు స్మార్ట్ లోజిస్టిక్స్ ఏర్పాటు చేద్దాం, దాతృత్వ శృంఖలాలను ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలతో కలపుదాం, కొలమానాన్ని దేశస్థాయిలో బలం చేకూరుద్దాం. ఆకలి కేకలు మూగబోయే రోజు దూరంలో ఉండదు.

**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

**ప్రపంచ స్థాయిలో వినియోగదారుల దశలోనే ఐదో వంతు ఆహారం వృథా అయింది, ఇళ్లదగ్గర 631 మిలియన్ల టన్నులు, సేవారంగం 290 మిలియన్ల టన్నులు, రిటైల్ 131 మిలియన్ల టన్నులు, రోజుకి బిలియన్ భోజనాలకు సమాన పరిమాణం చెత్తలో కలిసిపోతోంది, భారత ఇళ్లలో సంవత్సరానికి 78.2 మిలియన్ల టన్నులు, వ్యక్తికి 55 కిలోల చొప్పున వృథా, నగరాల్లో స్థాయి ఎక్కువ, గ్రామాల్లో తక్కువ, పంట కోత తరవాత నష్టాల ఆర్థిక విలువ ఏటా 1.53 లక్షల కోట్లు, ధాన్యాల్లో శాతం నష్టం చైనా కంటే ఎక్కువ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో కొన్ని వేల టన్నులు గోదాముల దశలో పాడై అధికార లెక్కల్లో నమోదైపోయాయి.**

## రూక పతనం

ఎగుమతులు
మందగజ గమనం
పన్నుల పోటు

చలనగతిజి
ఆయిల్ డోలనస్థితి
రవాణ డీలా

రూక పతనం
అయోమయంలో మార్కెట్
ధరల ఘాతం

**రేడియమ్**
**9291527757**

## ఆ నలుగురే..

చెడు తలపెట్టని
అంతరంగ ఇష్టమే
నిరంతర సాధనవుతే..
ఇంకెందుకు యుద్ధ
అస్త్రం?
ఆయుధ శస్త్రం?
ఇక ప్రక ృతే.. నీ తోడు
ఆ పైవాడే.. నీ వాడు
పరిస్థితులకు చెలించో
తలొంచో
భయపడని రోజు.. ఆ
పరిస్థితులే..
నీకు విజయ స్వాగతం!

ఆ క్షణం ఆనందమే
ఆహ్వానం.. ఆలింగనం
నీకై సరికొత్త ప్రపంచం వికసితం
చిగురించిన పుష్ప శోభితం
ఓ నలుగురు కన్నీటి పర్యంతం
ఆ నలుగురే.. మన
జన్మ ఆద్యంతం!!

**కోటం త్రిశూల్**
**8523005678**

## రిటైర్డ్

బొక్కలన్నీ విరిగి రెక్కలన్నీ అరిగి
పేపర్ గంట ఫోన్ గంట
మిగతా ఈ టీవీ జి టీవీ
హడాహుడి లేదు హుటాహుటి
లేదు..
తలచేవారు కొలిచేవారు
పిలిచేవారు లేరు
ఇంతేనా
ఇల్లు తోనేనా విల్లు సంధించలేనా

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# ఎన్నికల బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలి
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** ఎన్నికల బందోబస్తు విధులలో సిబ్బంది అప్రమత్తంగా, క్రమశిక్షణతో వివరించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెనెహ్రా అన్నారు. డిసెంబర్ 11న జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా కార్యాలయంలో ఎన్నికల విధులలో పాల్గొనబోయే ఏఆర్ సిబ్బందికి, హోంగార్డ్స్ సిబ్బంది సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ తెలిపినారు. బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. సిబ్బంది విధి నిర్వహణలో ప్రదర్శించాల్సిన అత్యంత ముఖ్యమైన అంశాలను ఆమె ప్రస్తావించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ (ఎంసీసీ) నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు లేదా ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వాటిని వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్పీ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమష్టి బాధ్యత అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ కోరారు. ఎన్నికల విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా లేదా క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రదర్శించినా దానిని అత్యంత తీవ్రమైన చర్యగా పరిగణించడం జరుగుతుందని, వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సమర్పించారు. జిల్లాలో జరగబోయే మొదటి దశ పంచాయతీ ఎన్నికల కోసం జిల్లా పోలీసుల సన్నద్ధతను సమీక్షించి, మరింత బలోపేతం చేసేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎస్పీ వివరణాత్మక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వాటి పరిసర ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా సిబ్బందిని మోహరించాల్సిన అవసరాన్ని ఎస్పీ తెలిపినారు. మద్యం, డబ్బు లేదా ఇతర ప్రలోభాల పంపిణీ వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, పర్యవేక్షించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహన తనిఖీలను, చెక్ పోస్టుల వద్ద తనిఖీలను మరియు సున్నిత ప్రాంతాలలో నిఘాను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుదోవ పట్టించే లేదా తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్) పట్ల అప్రమత్తంగా ఉండాలని దాని వ్యాప్తిని నిరోధించడానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోరారు. పోలింగ్ రోజున, ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేటప్పుడు ఎటువంటి అసౌకర్యాన్ని ఎదుర్కోకుండా భద్రతా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపినారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నిసి కఠినంగా అమలు చేయవలసిన ప్రాముఖ్యతను ఆమె తెలిపినారు. తమ పాత్రలు మరియు బాధ్యతలపై సంపూర్ణ స్పష్టత ఉండేలా, ఎన్నికల విధుల్లోని సిబ్బందికి చేయదగినవి, చేయకూడని వాటి గురించి పూర్తిగా వివరించాలని అధికారులందరికీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేలా చూడటం మన ప్రాథమిక బాధ్యత. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు అత్యంత అంకితభావంతో, సామర్థ్యంతో ధైర్యంతో తమ విధులను నిర్వహించాలి," అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ సరోజా, ఎస్.బీ.ఐ. డీవీపీ రాజు, జిల్లాలోని సబ్-డివిజనల్ డీఎస్పీలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావు పటేల్




**శామీర్‌పేట్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** మేడ్చెల్ జిల్లా మున్నూరు కాపు జిల్లా ఎన్నికలను జిల్లాలోని మున్నూరు కాపులు పెద్ద ఎత్తున విజయవంతం చెయ్యాలని రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోతమరావు పటేల్ అన్నారు. మంగళవారం శామీర్ పేట ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా ఎన్నికలు శుభం గార్డెన్ పిస్తా హౌస్ ప్రక్కన అలియాబాద్ చౌరస్తాలో జరుగుతాయని అయన అన్నారు. ఈ నెల 12న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఎన్నికల నిర్వహణ ఉంటిందని భోజనం తర్వాత విజయోత్సవ సభ ఉంటుందని చెప్పారు. విజయోత్సవ సభలో జిల్లా రాష్ట్ర మున్నూరు కాపు ప్రముఖులు పాల్గొంటారని సర్దార్ పేర్కొన్నారు. జిల్లా సమావేశం జిల్లా గౌరవ అధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహిస్తా రని తెలుపుతూ ఎన్నికల నిర్వాహన రాష్ట్ర కార్య దర్శి జిల్లా ఎన్నికల బాద్యులు ఇందూరి తిరుపతి పటేల్ నిర్వహిస్తారని తెలిపారు. విజయోత్సవ సభ విజయవంతం కొరకు జిల్లాలోని రాష్ట్ర పదాధి కారులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల, గ్రామ శాఖ అధ్యక్షులు కృషి చేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ర వెంకన్నా పటేల్ రాష్ట్ర కార్యదర్శి, పోతాంశెట్టి వెంకటేశ్వర్లు పటేల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఆకుల సత్యనారాయణ పటేల్ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి, గౌనె శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి, వేల్పుల శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర నాయకులు, శామీర్ పేట్ అధ్యక్షులు చాట్ల నర్సింగ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పార్టీల మాయ మాటలు నమ్మకండి

- చివరి రోజు ప్రచారంలో కాంగ్రెస్ జోరు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి బుజ్జమ్మకు మద్దతుగా నిర్వహించిన ప్రచార ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ శక్తి అంటే ఎలా ఉంటుందో ఫలితాల రోజు నిరూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రజాపాలనలో మహిళలకు మొదటి స్థానం ఉందన్నారు. సంక్షేమ ఫథకాలలో మహిళల వాటనే ఎక్కువ అన్నారు. రెండేళ్ల పాలనలో రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ చీరలు, రుణమాఫీతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. పదేళ్లు రాక్షస పాలనా బలపర్చిన అభ్యర్థి ఒక్క పైపు, రెండేళ్ళ ప్రజాపాలన బలపర్చిన అభ్యర్థి ఒక్కవైపు ఉందన్నారు. పదవుల కోసం పార్టీ మారే వాళ్ళు కావాలా, ప్రజల కోసం పని చేసే బుజ్జమ్మ కావాలా ప్రజలు ఆలోచించాలని తెలిపారు. రెండేళ్ళ తర్వాత ఓట్ల కోసం ప్రజల్లోకి వచ్చే నాయకులకు పెద్దేముల్ ప్రజలు ఓటుతో సమాధానం చెప్పాలని సూచించారు. ఎమ్మెల్యేగా రాజభవనం కట్టుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రజలకు ఎవరికైన ఇళ్ళు కట్టించడా అని ప్రశ్నించారు.. పదేళ్లు అధికారం ఇస్తే కోట్ పల్లి ప్రాజెక్ట్ కు ఎన్ని నిధులు ఇచ్చింద్రు అనేది చెప్పాలన్నారు. పదేళ్ళ కాలంలో తాండూర్ నుండి హైదరాబాద్ రోడ్డు ఎందుకు చేయాలేదని అడుగుతున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మకండి, అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధికార కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యం



**మర్పల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ పట్ల ఆకర్షితులవుతున్నారు అని ప్రతిపక్ష పార్టీలోని నాయకులు సైతం ప్రజల సంక్షేమం కాంగ్రెస్ తోటి సాధ్యమవుతుంది కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సుభాష్ యాదవ్, మర్పల్లి సర్పంచ్ అభ్యర్థి రామేశ్వర్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ కనిగిరి రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దుగ్గని రంగయ్య, సీనియర్ నాయకుల, సమక్షంలో అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతుందన్నారు. వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్ర స్పీకర్గా ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ మర్పల్లి మండలం పై ప్రత్యేక చొరవ చూపి అధిక నిధులు కేటాయిస్తున్న అన్నారు. దీంతో రాష్ట్రంలోనే ఆదర్శ మండలం గా నిర్మాణం అవుతుందన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే మన ప్రియతమ నాయకుడు ప్రసాద్ కుమార్ అండగా నిలబడతారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. అధికార పార్టీకి ఓట్లు వేసి గెలిపించినట్లయితే గ్రామ అభివృద్ధి వేగంగా జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి నాగేష్, దివాకర్, జాఫర్, తాజుద్దీన్, శేఖర్, రాములు, పెంటయ్య, వసంత్, నవీన్, మొగిలి గారి రాచన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- సామాజిక కార్యకర్త ఆకుల సతీష్



**నిజాంపేట్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ఆకృతి కన్స్ట్రక్షన్ రోడ్డు కోసం సర్వే నెంబరు 454 ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని వాడకంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంగళవారం సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ నేతృత్వంలో ఎమ్మార్వో వాణి రెడ్డికి ఫిర్యాదు చేశారు. వీటితోపాటు సర్వే నెంబర్ 80,82,83,84,91,95 బాచుపల్లి నందు ప్రభుత్వ భూములో మైరాన్ కన్స్ట్రక్షన్ ఆష్ట్ర లుమియా స్కూల్ బిల్డింగ్ అక్రమ నిర్మాణాలు పై సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని రక్షించే ప్రజా అవసరాలకు వినియోగించాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి సర్వేనెంబర్ 454 నందు ప్రభుత్వ భూమి 400 గజాలు ఆకృతి కన్స్ట్రక్షన్ అక్రమంగా ఆక్రమించుకొని 2023లో టిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద సాకారంతో రోడ్డుగా చూపించుకొని అనుమతులు తెచ్చుకొని, అక్రమ నిర్మాణం చేసుకోవడమే కాకుండా ప్రభుత్వ భూమిలో నుంచి దర్జాగా రోడ్డు వేసుకొని ప్రభుత్వ భూమి అనే బోర్డు పీకి వేయడమే కాకుండా సెప్టెంబర్ లో రెవెన్యూ అధికారులు రోడ్డును ట్రెంచ్ కొట్టిన మళ్లీ పూడ్చుకొని దర్జాగా రోడ్డుగా వాడుకోవడం కాకుండా పూల మొక్కలతో గార్డెన్ చేసుకోవడంపై తక్షణమే ఆకృతి కన్స్ట్రక్షన్ ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని రోడ్డు వేసుకున్న స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేయాలని ప్రభుత్వ భూమి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాచుపల్లి నందు సర్వేనెంబర్80, 82 83,84,91,96 నందు ప్రభుత్వ భూములు మైరాన్ ఆష్ట్ర లూమియా స్కూల్ వెల్డింగ్ మైరాన్ కన్స్ట్రక్షన్లో దాదాపు నాలుగు ఎకరాలు ఆక్రమణ అక్రమ నిర్మాణాలపై సర్వే చేసి ప్రభుత్వ భూమిని గుర్తించాలని, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమి ఆక్రమణల నుంచి కాపాడి స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేసి రక్షించడమే కాకుండా ప్రజా అవసరాలకు కేటాయించాలని బాచుపల్లి ఎమ్మార్వో ని కోరడం జరిగింది. ఈ విధంగా ప్రభుత్వ భూముల కబ్జాలు ప్రస్తుత ఎమ్మార్వో అయిన కట్టడి చేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, కవిత రెడ్డి, ప్రసాద్, అరుణ్ రావు, మాధవరావు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు



**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ తో కలిసి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పలు కీలక సూచనలు జారీ చేశారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా క్రమశిక్షణతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు చేరుకుని, ఓటర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధించబడిందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. సెన్సిటివ్, హై సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లలో అదనపు పికెటింగ్, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం అనుమతించబడదని స్పష్టం చేశారు మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ వైర్‌లెస్, విహెచ్‌ఎఫ్, మొబైల్ పార్టీలు అన్నీ పూర్తిస్థాయిలో పనిచేయాలని, ఎల్లప్పుడూ అలర్ట్‌లో ఉండాలని సూచించారు. ఓటర్ల రాకపోకలు సజావుగా సాగేందుకు అధికారులు పరస్పర సమన్వయం పాటించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఉద్రిక్తత సృష్టించడం, గుంపులు గుమికూడడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం వంటి చర్యలు జరుగుతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం విజయోత్సవ ర్యాలీలు నిషేధించబడ్డాయని కూడా గుర్తుచేశారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగగా భావించి, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, పోలీసుల సూచనలను పాటించి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



**అమీన్‌పూర్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని.. వాటిని సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని.. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఈ అలవాటు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. వినూత్న ఆలోచనలతో నూతన ఒరవడి సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పరమేష్ యాదవ్, ఐలేష్, కుమార్ గౌడ్, ప్రమోద్ గౌడ్, ఎంఈఓ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో మోసాలకు అడ్డుకట్ట



**కోట్‌పల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** నేటి సమాజంలో డిజిటల్ వాడకం ఎలా పెరిగిందో అదే విధంగా సైబర్ మోసాలు కూడా పెరిగాయని సైబర్ నేరాలపై అవగాహనతో మోసా లకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్ఐ శైలజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలకు ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అనే పేరుతో విద్యార్థినిలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ మధ్యకాలంలో లంలో పీఎం కిసాన్, స్టేట్ బ్యాంక్, ఎలక్షన్ కమిషన్, అనే పేర్లతో ఏపీకే ఫైల్సు సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్కు పంపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఏపీకే ఫైలను డౌన్లోడ్ చేసుకోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ చేసి బ్యాంకింగ్, ఓటీపీల అడిగితే తెలుపవద్దన్నారు. డిజిటల్ అరెస్ట్ అయ్యారని ఎవరైనా ఫోన్ చేస్తే, వాటిని నమ్మవద్దని వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ కు గురైతే వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పోలీస్ శాఖ సూచనలు
- కోట్‌పల్లి ఎస్ఐ శైలజ



**కోట్‌పల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలు వీడియోలు పోస్ట్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కోట్ పల్లి ఎస్ఐ శైలజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక సంస్థల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశా రు. ఎన్నికలు శాంతియుతంగా జరగాలని ఎవరూ గొడ వలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. ఓటు కొనడం అమ్మడం చట్టపరంగా నేరమని ఎక్కడైనా ఇటువంటి ప్రయ త్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు ప్రజలు సమాచారం అంది వ్వాలని కోరారు. రాత్రివేళ గుంపులుగా తిరగడం, మద్యం తాగి గొడవలు చేయడం పూర్తిగా నిషేధ మన్నారు. రాజ కీయ ఒత్తిడి, బెదిరింపులు, బలవంతపు చర్యలు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నా రు. పోలీసులు చేసే పహారా మీ భద్రత కోసమేనని ఎటు వంటి సమస్య వచ్చినా వెంటనే 100 లేదా 87126 70034 సమాచారం అందివ్వాలని సూచించారు. యువత శాంతి భద్రత పరిరక్షణలో ముందుండాలి. ప్రలోభాలు, రెచ్చగొట్టే సందేశాలు చూసి ఆవేశానికిలోను కావద్దన్నారు. చౌరస్తాలవ వద్ద గుంపులుగా నిలబడడం, గొడవలకు దిగడం నేరంగా పరిగణించబడుతుందని కేసులు నమోదు అయితే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్పోర్ట్, విదేశీ అవకాశాలపై తీవ్ర సమస్యలు తలెత్తుతా యన్నారు. బైండ్ ఓవర్ పడినవారికి భవిష్యత్తులో చిన్నగొడవ జరిగినాకేసుగా మారే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలపై అసభ్య ప్రవర్తన, వేధింపులు, బెదిరింపులు ఏవైనా జరిగితే వెంటనే షీ టీం కు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాలీలు తీయడానికి గానీ మైకులు పెట్టడానికిగానీ తహసీల్దార్ అనుమతి అవసరం లేని యెడల చట్ట పరమైన చర్యలు ఉంటాయ నారు. కులం, మతం, వర్గాల ఆధారంగా ప్రచారం చేయ డం, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నేరమవుతుంద న్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇవ్వడం పెద్ద నేరం అభ్యర్థిత్వం రద్దు అయ్యే అవకాశం ఉంటుంద న్నారు. ప్రచార వాహనాలు, హనాలు, సౌండ్ సౌండ్ బాక్సను అనుమతు లకు అనుగుణంగా తనిఖీకి సిద్ధంగా ఉంచాలని ప్రత్యర్థు లను రెచ్చగొట్టే చర్యలు పూర్తిగా నిషేధమన్నారు. ఇళ్లకు వెళ్లి ఓటర్లను బెదిరించడం, ఒత్తిడి చేయడం, మానసిక ఒత్తిడి పెట్టడం చట్టపరంగా నేరం పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు ఏర్పరచి వాతావరణాన్ని దెబ్బతీయరాదన్నా రు. ఓటర్లను తరలించడం, నియంత్రించడం, వారి ఓటు స్వేచ్ఛపై ప్రభావం చూపడం చట్టరీత్యా నేరం శిక్షార్హుల వుతారు అన్నారు. ఎవరైనా రూ.50 కు మించి నగదు తీసుకెళుతున్నప్పుడు తప్పనిసరిగా ఆ నగదుకు సంబం ధించిన ఆధారాలు వెంట పెట్టుకోవాలన్నారు. లేకపోతే ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు ఆ నగదును సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో కోట్ పల్లి ఎస్ఐ శైలజ, కోట్ పల్లి తాసిల్దార్ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 డిసెంబర్ 2025

# కోడూరు గ్రామంలో మార్పు తెద్దాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని కోడూరు గ్రామంలో ప్రజలు మార్పుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఈటే ఉమాదేవి రవీందర్ కు మద్దతుగా ప్రకటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోడూరు గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే కలహాలు లేని కోడూరు అవసరమని తెలిపారు. "ప్రజలకు సేవ చేయాలన్న మంచి ఆలోచనతో ముందుకు వస్తున్న ఈటె ఉమాదేవి రవీందర్ ఉంగరం గుర్తు పైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అని ఆయన ప్రజలను కోరారు. గత పది సంవత్సరాలుగా కోడూరులో అభివృద్ధి నిలిచిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. "సొంత బిడ్డనే చూసుకోని వారు, గ్రామ ప్రజలను ఎలా చూసుకుంటారు?" అని ప్రశ్నిస్తూ, కోడూరు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్ లలో ఉచిత ప్రయాణ సౌకర్యాలు అందిస్తున్నామని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని ఆయన గుర్తు చేశారు. గ్రామంలోని ప్రతి వాడాలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కోడూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలు ఒకతాటిపైకి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సర్పంచ్ అభ్యర్థి ఈటె ఉమాదేవి రవీందర్, నాయకులు ఖాజా, కేశవులు, , ఆంజనేయులు, అంజి, పురుషోత్తం, రామస్వామి, ప్రసాద్, చందు, కృష్ణ యాదవ్, డాక్య నాయక్, రమేష్, అర్జున్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల కల సోనియాతోనే సహకారం

● ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల కలను సహకారం చేసిన మహనీయురాలు సోనియా గాంధీ అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి సోనియా గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం ఎలాంటి సందేహం లేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియా గాంధీ దేనని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మద్యం తాగిన మత్తులో యువకులు కత్తితో దాడులు





**గద్వాల టౌన్, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** మంగళవారం తెల్లవారుజామున గద్వాల పట్టణం కృష్ణవేణి చౌక్ దగ్గరలో ఉన్న లాడ్జి కింద వంశీ ఫోటో స్టూడియో లో మద్యం తాగినా మత్తులో యువకులు కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది.గద్వాల సిఐ టంగుటూరి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణవేణి చౌక్ వద్ద ఉన్న ఓ ఫొటో స్టూడియోలో వంశీ, అర్వింద్, బులెట్ వంశీ, వసంత్, బన్నీ అనే 6గురు యువకులు మద్యం సేవిస్తుండగా ఇంటికి వెళ్లుదాం అనే చిన్న విషయమే పెద్ద గొడవకు దారితీసిందని తెలిపారు.మద్యం మత్తులో ఉన్న యువకులు పరస్పరం కత్తులతో దాడులకు పాల్పడటంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు, ఈ దాడులలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వీరిని కర్నూల్ ఆసుపత్రికి తరలించరూ, ఇట్టి విషయంపై పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ ను చరవాణి ద్వారా వివరణ కోరగా యువకులపై కేసు నమోదు చేశామని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మద్యం మత్తులో జరుగుతున్న ఇలాంటి సంఘటనలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కంది, ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్



**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో, సంగా రెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంది, ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామ లలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి సబ్ డివిజన్ డిఎస్పీ సత్తయ్య స్వయంగా నాయకత్వం వహించారు. ఈ మార్చ్‌లో పోలీసు బలగాలు, ఆర్మ్డ్ ఫోర్స్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ సత్తయ్య మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం ప్రజలలో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే అసాంఘిక శక్తులకు, రౌడీషీటర్లకు బలమైన హెచ్చరిక పంపడమేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సున్నితమైన మరియు అతి-సున్నితమైన గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేశారు అని డీఎస్పీ హామీ ఇచ్చారు ప్రజలకు కీలక సూచనలు చేస్తూ, ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఇతరులను భయపెట్టేందుకు ప్రయత్నించినా, లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడడంలో కేవలం పోలీసుల పాత్రే కాక, ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని తెలిపినారు. పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, అండగా ఉంటుందని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయడానికి అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, ఎస్సై మధుసూదన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● రైసింగ్ తెలంగాణ అని గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
● క్లోసింగ్ తెలంగాణ వైపు పాలనా సాగిస్తోంది
● మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** మహబూబ్ నగర్ మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఎరువుల కోసం లైన్‌లో ఉన్నారు. పండించిన పంటకు బోనస్ రావడం లేదు.. కరెంటు సరిగ్గా ఇవ్వడం లేదు. తాగు నీరు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు తెలంగాణ ను వెనుకకు నెట్టి వేస్తూ పాలనా సాగిస్తూ రేసింగ్ తెలంగాణ పేరుతో సమ్మిట్ నిర్వహించడం హాస్యాస్పదమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు కొనసాగించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. మన్యంకొండ రోప్ వె పనులు నిలిచాయని..బడ్జెట్ హోటల్ నిర్మాణం ఆగిందని...సాగునీరు ఇచ్చే పాలమూరు పనులను కూడా పూర్తి చేయలేదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచిన ప్రభుత్వం అభివ్రుధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామాల్లో అమలు చేయలేదని..రానున్న రెండేండ్లలో కూడా వారి ఆస్తులు పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విలువైన భూములను అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుంటే భవిష్యతులో గ్రామాలూ అభివృద్ధి అవుతాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు సర్పంచ్...గ్రామా సభ తీర్మానం చేస్తే ఇస్తారని ఎవరి బెదిరింపులకు భయపడవద్దని కోరారు. కార్యక్రమం లో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులూ రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, రామచంద్రయ్య, మొగులయ్య గౌడ్, దేవేందర్ రెడ్డి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయ్ దివాస్ వేడుకలు



**గద్వాల టౌన్, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నందు బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్చార్జ్ బాసు హనుమంతు నాయుడు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.అనంతరం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు చరిత్రత్మక విజయంగా నిలిచిన డిసెంబర్ 9వ తేదీన విజయ్ దివాస్ కార్యక్రమాన్ని గద్వాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ఢిల్లీని వణికించి ప్రత్యేక రాష్ట్ర ప్రకటనను సాధించిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. ఉద్యమకారుల త్యాగాలు,విద్యార్థుల ప్రాణత్యాగాలు, ప్రజల మద్దతు ఇవి తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి పునాది అని తెలిపారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ త్యాగం చిరస్మరణీయమని అభివర్ణించారు.ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఉద్యమ స్ఫూర్తిని నిలుపుకుని ప్రజల అభ్యున్నతికి అంకిత భావంతో పనిచేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, వెంకటేశ్వర రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను నమ్మి మోసపోకండి

**జహీరాబాద్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని,అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిందని ఎమ్మెల్యే మాణిక్ రావ్ ఆరోపించారు.సర్పంచ్ ఎలక్షన్ సందర్భంగా ఝరసంఘం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థి వినోద బాల్ రాజ్, వార్డ్ మెంబర్‌ల తరఫున మంగళవారం నాడు ఎమ్మెల్యే మాణిక్ రావ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు గ్రామాలకు చాలా అభివృద్ధి పథకాలు అందించారన్నారు.



# సోనియాగాంధీ వల్లే తెలంగాణ సాకారం

● డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్
● ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఏర్పాటు
● టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** సోనియాగాంధీ వల్లే ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మీడియాతో సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ యూపీఏ చైర్పర్సన్ గా ఉన్న సోనియాగాంధీ తెలంగాణ ఆకాంక్షల మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. తెలంగాణ అమరుల ప్రాణత్యాగాన్ని గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను గుర్తించి, సీడబ్ల్యూసీలో చర్చించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కుతుందన్నారు. సంక్షేమం. అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలే కాంగ్రెస్ పార్టీ స్థంభాలు అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ భావాజాలాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. మతాలు, కులాల పేరు మీద రాజకీయాలు చేయడం సరికాదన్నారు. భారతదేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు లింగం నాయక్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, ఫయాజ్, ఆవేజ్, బండి మల్లేష్, ఫక్రూ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, అబ్దుల్ హక్, ప్రవీణ్ కుమార్, ఖాదర్, షాఫైసల్, తాహేర్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# చిరస్థాయిగా కేసీఆర్ త్యాగం

**హుస్నాబాద్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** విజయదివస్ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా, అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమం అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కూడా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ, లిలికే.సి.ఆర్ దీక్షవలననే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, ఆ పోరాటాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. 2009 నవంబర్ 29న కే.సి.ఆర్ ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్ష 11 రోజులపాటు కొనసాగి, దాని ఫలితంగానే కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9న రాష్ట్ర ఏర్పాటుపై ప్రక్రియను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ప్రకటించిన "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రారంభిస్తాం" అనే ప్రకటన కే.సి.ఆర్ దీక్ష ఫలితమేనని నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ "మేమే తెలంగాణ ఇచ్చాం" అని గొప్పలు చెప్పుకోవడం తగదని, కే.సి.ఆర్ పోరాటం లేకపోతే రాష్ట్రం సాధ్యమయ్యేదే కాదనిలిలి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, కేవలం కే.సి.ఆర్ కుటుంబంపై విమర్శలు చేయడంలోనే కాలం గడిపేస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కే.సి.ఆర్ ముద్ర ఎప్పటికీ చెరగదని, ఆ ముద్రను తుడిచివేయాలనే కుట్రలో భాగంగా ప్రభుత్వం నిరాధార ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. కనీసం ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కే.సి.ఆర్‌పై అనవసర విమర్శలను మానుకుని, తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున రెడ్డి, సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎమ్.ఏ. అన్వర్ పాషా, మాజీ ఎంపీ పీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, సీనియర్ నాయకులు కన్నోజు రామకృష్ణ, వంగ వెంకట్రాం రెడ్డి, గుళ్ల రాజు, అయూబ్, బొజ్జ హరీష్, వాల నవీన్, ఇంద్రాల సారయ్య, పేరుక భాగ్యరెడ్డి, చొప్పరి శ్రీనివాస్, బండి పుష్ప, సారయ్య, మేకల వికాస్ యాదవ్, జీవన్ స్వరూప్, జెరిపోతుల సునీత, భూక్యా రాజు నాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, భూక్యా లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## మీడియా సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను మంగ ళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కంట్రో ల్ రూమ్ యొక్క పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులు తోమాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామ పంచా యతీ ఎన్నికలకు సంబంధిం చిన సమాచారాన్ని సేకరించి అధికారులకు అందించాలని అన్నారు. కంట్రోల్ రూమ్ కి వచ్చిన రెండు ఫిర్యాదులపై ఆరా తీశారు.అలాగే ప్రతి రోజు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్త లను పరిశీలించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన వార్తలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి ఆమె సూచిం చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు
- కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి అధికారులతో సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 9 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల హనుమకొండ జిల్లా సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మొదటి విడత మండలాల్లో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలసి ఎన్నికల పరిశీలకులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఈనెల 11న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించే భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల్లో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేసామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్వోలు వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ఈ మూడు మండలాలకు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ తనిఖీ చేయాలని ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఏర్పాట్లను పరిశీలించి వాటి నివేదికను అందజేయాలని అధికారులకు తెలియజేశామని సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడుకు వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ప్రతి వార్డు బ్యాలెట్ పేపర్ ను తనిఖీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల ప్రచారం ముగింపు..

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, డిసెంబర్ 9 (జనంసాక్షి):** గ్రామ పంచాయతీ మెదటి విడత ఎన్నికలకు డిసెంబర్ 9వ తేది సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ముగియడానికి 44 గంటల ముందు నుండి ఆయా మండలాల్లో సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందని తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఏ విధమైన ప్రచారాలు నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కాలంలో ఇతర ప్రదేశాల నుండి వచ్చిన వ్యక్తులు సంబంధిత గ్రామ పంచాయతీ పరిధిలో ఉండకూడదని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రజలు గుంపులుగా చేరరాదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ సమయంలో యంత్రాంగం పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలు జరుగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఏదేని ఉల్లంఘన జరిగినట్లు గమనిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని కలెక్టర్ స్పష్టంచేశారు.

# నిర్మల్‌లో పీఠాధిపతులు, మహామండలేశ్వర్లు



**నిర్మల్ రూరల్, డిసెంబర్9(జనం సాక్షి) :** గోదావరి నది పరిక్రమణ (ప్రదక్షణ)లో భాగంగా మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ నుండి బయలుదేరిన సుమారు 500 మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, మహామండలేశ్వర్లు, మండలేశ్వరులు, సాధువులకు మంగళవారం రోజున జిల్లా ప్రజలు నిర్మల్లో ఘనంగా స్వాగతం పలికారు. హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్వర్యంలో మధ్యాహ్నం నిర్మల్ పట్టణంలోని నటరాజ్ నగర్ లోని ఉమామహేశ్వర శివాలయం నుండి ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున బయలుదేరి వారికి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోనీ మంజులాపూర్ నుండి మంచిర్యాల చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రజలు,మహిళలు వారికి మంగళారతులు,పూలతో స్వాగతం పలుకుతూ అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. స్వామీజీల కాన్వాయ్ ముందు పెద్ద ఎత్తున భగవంతుని నామస్మరణతో జైశ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఎక్కడ చూసినా జన సందోహంతో నిండిపోయింది. 3బస్సులు,100 కార్లలో పీఠాధిపతులు,వారందరూ బయలుదేరి వచ్చారు. అనంతరం నిర్మల్ మీదుగా మంచిర్యాలకు బయలుదేరారు. నిర్వహిస్తున్నటువంటి గోదావరి పరిక్రమణ కార్యక్రమం కాళేశ్వరం, భద్రాచలం,రాజమండ్రి అంతర్వేది, యానం మీదుగా బయలుదేరి నందిపేట లోని దత్తాశ్రమంలో మూడు రోజులపాటు బస చేస్తారని హిందూ ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు



# కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ..

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్..

**మహబూబాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 9 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆవిష్కరించారు. 10 అడుగుల ఎత్తుతో రూపొందించిన ఈ విగ్రహానికి 4 అడుగుల బేస్‌మెంట్, 2 అడుగుల పీఠం కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ (స్థానిక సంస్థలు), వత్సల్ టోప్పో (రెవెన్యూ), ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, జిల్లా పరిపాలన అధికారి పవన్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశి రామ్ నాయక్ డిపిఆర్ఓ పసునూరి రాజేంద్ర ప్రసాద్ తదితర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమృతండా గ్రామపంచాయతీ ఏకగ్రీవం!

- సర్పంచ్ గా బోడ వీరా సింగ్...
- ఉపసర్పంచ్ గా బోడ సంపత్...




**చెన్నారావుపేట, డిసెంబర్ 9(జనం సాక్షి):** మండలంలోని అమృతండా గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికలలో ఏకగ్రీవమైంది. గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. గ్రామ సర్పంచ్ గా బోడ వీరా సింగ్(కాంగ్రెస్), ఉప సర్పంచ్ గా బోడ సంపత్(బిఆర్ఎస్) ఏకగ్రీవమయ్యారు. అలాగే 1వ వార్డు సభ్యుడిగా బోడ శ్రీనివాస్(బిఆర్ఎస్), 2వ వార్డ్ సభ్యుడిగా బానోతు రవీందర్(బిఆర్ఎస్), 3వ వార్డు సభ్యురాలిగా బోడ సార్క(కాంగ్రెస్), 4వ వార్డు సభ్యుడిగా బోడ సంతోష్(కాంగ్రెస్), 5వ వార్డు సభ్యుడిగా బోడ సంపత్ (ఉపసర్పంచ్)(బిఆర్ఎస్), 6వ వార్డు సభ్యురాలిగా బోడ స్వరూప (కాంగ్రెస్), 7 వ వార్డు సభ్యురాలిగా లావుడియా సుశీల (బిఆర్ఎస్), 8వ వార్డు సభ్యురాలిగా బోడ కాంతమ్మ(బిఆర్ఎస్)లు ఏకగ్రీవమయ్యారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- అధికార పార్టీ సర్పంచులను గెలిపించుకుంటేనే అభివృద్ధి
- స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం



**ఆత్మకూర్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జి ఎస్ ఆర్ గార్డెన్ నందు ఆత్మకూరు, దామెర, నడికుడ మండలాల పరిధిలోని కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూతు అధ్యక్షులతో స్థానిక సంస్థల ఎన్నికలపై పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి కోరారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. పాత కొత్త తేడా లేకుండా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఓటు అడిగే హక్కు ఒక కాంగ్రెస్ పార్టీకే ఉందని,గత రెండు సంవత్సరాలుగా మనం చేసిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం కలిగిందన్నారు.



# ఎంచగూడెం ఏకగ్రీవం

- సర్పంచ్ వాసం నర్సమ్మ
- ఉప సర్పంచ్ సంగి కుమారస్వామి

**కొత్తగూడ డిసెంబర్ 9 (జనంసాక్షి) :** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామంలోని ప్రజలు అందరూ కలిసి పార్టీలకతీతంగా సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డ్ నెంబర్ అను మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం లో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. సర్పంచ్ అభ్యర్థిగా వాసం నర్సమ్మ లక్ష్మీ నర్సు,ఉప సర్పంచ్ సంగీ కుమారస్వామి వార్డ్ నెంబర్లుగా పుదీ ప్రసన్న, వంగరాజు, వాసం సరోజన,దనుసారి కొమ్మాలు,వాసం రమేష్,వాసం సారక్క, ఎల్లబోయిన యక్కమ్మ లను స్థానిక ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఎన్నికల నిర్వహణలో స్టేజ్-2 ఆర్ఓల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్.



**ఏటూరునాగారం, డిసెంబర్ 09(జనంసాక్షి) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగనున్న ఎన్నికల నిర్వహణలో స్టేజ్ 2 ఆర్ఓ ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం ఎంపిడిఓ కార్యాలయంను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలసి స్థానిక సంస్థల ఎన్నికల సామాగ్రినీ తనిఖీ చేశారు. అనంతరం మొదటి విడత ఎన్నికల నిర్వహణలో భాగంగా స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియను ప్రశాంతంగా, పూర్తి పారదర్శకంగా జరపాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. అధి కారులు తమకు కేటాయించిన గ్రామపంచాయతీలలో పోలింగ్ ఎన్నికల కొరకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పంపిణీ కేంద్రం నుండి సామాగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టాలని తెలిపారు. మొదట. వార్డు సభ్యుల స్థానాలకు, అనంతరం సర్పంచ్ స్థానా నికి ఓట్ల లెక్కింపు చేపట్టి ఉప సర్పంచ్ను ఎన్నుకోవాలని వివరించారు. ఎన్నికలలో ఉపయోగించే సామాగ్రి కవర్లు, పోలింగ్ కేంద్రాలలో కుర్చీలు, వెలుతురు సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. కౌంటింగ్ ముందు పిఒ డైరీ, బ్యాలెట్ పేపర్, అకౌంట్ పేపర్ సీల్, అకౌంట్ స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లను పరిశీలించి ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ చేపట్టాలని తెలిపారు. జోనల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఓట్ల లెక్కింపు సమయంలో పారదర్శ కంగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో నోడల్ ఆఫీసర్, ఎంపిడిఓ, తహసిల్దార్, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రురల్ ,డిసెంబర్09,(జనంసాక్షి)** కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని మంగళవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి నిదర్శనం తెలంగాణ తల్లి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, డిసెంబర్ 9, (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతికి నిదర్శనం తెలంగాణ తల్లి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల ఓకే సంవత్సరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డకు ప్రత్యేకమైన స్థానం ఉంటుందని, మహిళను ఇంటి దేవతగా అభిమానిస్తారని తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో కుటుంబంలో కొడుకు, కూతుళ్లలో ఆడబిడ్డకు ప్రత్యేక స్థానం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని, కుటుంబానికి యజమానిగా చేసి రేషన్ కార్డులు, గృహ జ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఈ సంస్కృతిని భావితరాలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కన్నా.. అడుక్కు తినడం మిన్న..

- హనుమకొండలో బిచ్చగాళ్ళతో ర్యాలీ..



**హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 9 (జనం సాక్షి) :** అవినీతి కన్నా.. అడుక్కు తినడం మిన్న.. అని పేర్కొంటూ మంగళవారం హనుమకొండలో నిర్వహించిన ర్యాలీ ప్రజలను ఆలోచింపజేసింది. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం హన్మకొండలోని వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. బిచ్చమార్జిస్తూ జీవనం సాగించేవారు ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ, లోక్ సత్తా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లోక్ సత్తా ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు బండారు రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాల్లో అవినీతి సర్వసాధారణంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకుని కేసులు నమోదు చేస్తున్న.. వారిపై చర్యలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్ సత్తా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, జ్వాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారుల జీతభత్యాలు పింఛన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోందని,అయినప్పటికీ ప్రజలకు అవినీతి రహిత సేవలు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీబీకి పట్టుబడిన అధికారులకు మళ్లీ పోస్టింగ్ లు ఇస్తున్నారని, మళ్లీ ఉద్యోగం ఇవ్వకుండా నిబంధనలు కఠిన తరం చేయాలని ఉద్యోగ నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ వివి రావు, లోక్ సత్తా ఉద్యమ సంస్థ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, జ్వాలా అవినీతి వ్యతిరేక కార్యవర్గ సభ్యులు అచ్చే అమర్నాథ్, బుర్రి కృష్ణమూర్తి, ప్రకాష్, గుండపు సాయిచెందు, ఎల్బీ కళాశాల ఎన్సీసీ విద్యార్థులు, వరంగల్ నగరంలో ఉన్న బిక్షగాండ్లు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లిలో వ్యాపారుల బంద్ సక్సెస్

**బెల్లంపల్లి, డిసెంబర్ 9, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణ వ్యాపారస్తుల బంద్ కు అనూహ్య స్పందన లభించింది. బజార్ ఏరియాలో ఏరియాలో మున్సిపల్ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆపి వేయాలంటూ మంగళవారం వ్యాపారస్తులు బంద్ పాటించారు. రోడ్డు విస్తరణతో తమ దుకాణాలకు నష్టం జరిగి జీవనోపాధిని కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. బంద్ ను పురస్కరించుకొని వ్యాపారస్తులు పుర విధుల్లోపెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. వ్యాపారస్తుల బంద్ తో బజార్ ఏరియా నిర్మాణుష్యంగా మారింది. బెల్లంపల్లి వ్యాపారస్తులకు నష్టం చేస్తున్న బజారు ఏరియా రోడ్డు వెడల్పు పనులను నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. వ్యాపారస్తులు చేపట్టిన బంద్ కు ఆయన మద్దతు పలికారు. వ్యాపారుల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ముందు చూపు లేకుండా ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పేరట వ్యాపారస్తులకు తీరని నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు విస్తరణతో వ్యాపారస్తులకు జరిగే నష్టాన్ని గ్రహించకుండా రోడ్డు విస్తరణను చేపట్టడంపై మండిపడ్డారు. ప్రధానంగా ఎమ్మెల్యే ఒంటెత్తు పోకడలపై ఆయన ధ్వజమెత్తారు. పట్టణాభివృద్ధి పేరుతో అధికారులు వ్యాపారస్తులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా రోడ్డు విస్తరణను కుదించాలని డిమాండ్ చేశారు. కాంటా చౌరస్తా వరకే రోడ్డు విస్తరణ పనులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

# ఎన్నికల విధులు రిటర్నింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలి

- పంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**చింతకాని, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా చింతకాని మండలం లో కలెక్టర్ మంగళవారం పర్యటించి, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లను తనిఖీ చేశారు. చింతకాని లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోనకల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలను, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునే విధంగా వాహనాల ఏర్పాటుకు రూట్ ఆఫీసర్లు భాద్యత వహించాలని తెలియజేస్తూ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.అనంతరం నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్పంచ్, వార్డు మెంబర్ ల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఓటర్లకు కల్పించే మౌళిక సదుపాయాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ లు ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్,సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం, తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ కు చర్యలు చేపట్టాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నాయో లేదో రిటర్నింగ్ అధికారి చెక్ చేయాలని, సరైన సమయానికి చేరుకునేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కు ముందు రోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ నాడు ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేలా రూట్ ఆఫీసర్లు చూడాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా చేయాలని తొందర పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఓటు చాలా కీలకమైన అంశంగా గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారులు నవీన్ బాబు, కె.విజయభాస్కరరెడ్డి, చింతకాని తహశీల్దార్ ఎంపిడిఓలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉర్సు షరీఫ్ ఉత్సవాలు



**దేవరకొండ, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలో ప్రసిద్ధి చెందిన హాజ్రాత్ హాజీ హాఫెజ్ మొహమ్మద్ దుర్వేష్ ఖాద్రి ఖాదర్ షా వలి దర్గా (పెద్ద దర్గా) ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా,అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముతవల్లీలు ప్రత్యేక "ప్రార్థనలు" నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగిన ఉత్సవాల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్దఎత్తున హాజరై దర్గాను సందర్శించి తమ మొక్కులు తీర్చుకున్నారు.భద్రత మరియు సౌకర్యాల పరంగా కూడా ఏర్పాట్లు సమృద్ధిగా చేశామని,ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉర్సు ఉత్సవం యావత్తు ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చినట్లు నిర్వాహకులు ముతవల్లీలు అబ్దుల్ ఖాదర్,మహమ్మద్ ఫయాజుద్దీన్, మొహమ్మద్ రఫీ తెలిపారు.

## చందంపేట సర్పంచ్‌గా మొహమ్మద్ సాధిక్ ఏకగ్రీవం



**దేవరకొండ, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ గా మోహమ్మద్ సాదిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ ప్రజలందరూ పార్టీలకు అతీతంగా తనను ఆశీర్వదించి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలందరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకొని జిల్లాలోని చందంపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని, గ్రామానికి సైనికుడికిలా పనిచేస్తానని సాదిక్ తెలిపారు. చందంపేట గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం కావడంపై పలువురు అభినందించారు.

## పోలీసు లేని సమాజాన్ని ఊహించుకోలేం

- ఏఎస్ఐగా పదోన్నతి పొందిన ఆవుల సూర్యం

**భద్రాచలం, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** ప్రపంచమంతా



నిద్రపోయినా మేల్కొని ఉండే ఒకే ఒక్కడు పోలీస్ అని ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన ఆవుల సూర్యం అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా ఏఎస్ఐ గా పదోన్నతి పత్రాన్ని ఆవుల సూర్యం మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆవల సూర్య మాట్లాడుతూ.. 24 గంటలు ఉద్యోగం పోలీసు ఉద్యోగమేనని ఆ పోలీసు లేని సమాజాన్ని ఊహించుకోలేమని అన్నారు. గత 38 సంవత్సరాలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులను నిర్వహించి పదోన్నతి పొందిన ఆవుల సూర్యం మంగళవారం భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ గా విసులను చేపట్టారు. మరో ఐదు సంవత్సరాలు పాటు తన వృత్తిలో తను మరిన్ని కీలకమైన విధులను నిర్వహిస్తానని అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించండి

- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై పోలీసుల ఫోకస్
- 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి
- కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిఐ, ఎస్ఐ అజ్మీరా రమేష్, పోలీస్ అధికారులు సిబ్బందితో చింతకుంట్ల, గుమ్మడవల్లి, కొర్రతండా, చింతచెట్టు తండా గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికలవేళ పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- పోలింగ్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని పరిశీలించిన కలెక్టర్



**కనగల్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** ఈనెల 11న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటైర్నింగ్ అధికారులను కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్స్, పోలింగ్ బాక్స్ లను పరిశీలించారు. అనంతరం సాయిరాం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు వెళ్లి పోలింగ్ సామాగ్రి పంపిణీ ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావలసిన సామాగ్రిని పోలింగ్ కేంద్రాల వారిగా వేరుచేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డి ఆర్ డి ఎ పి డి వై శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎంఈఓ పద్మ, ఎం పి ఓ పుట్టా సతీష్ కుమార్ పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

# చందానగర్‌లో ఘనంగా బీఆర్ఎస్ విజయ్ దివస్



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలో తెలంగాణ విజయ్ దివస్ ను బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మినిమం వేజ్ బోర్డ్ మాజీ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా పార్నంది శ్రీకాంత్, వాలా హరీష్, సంగారెడ్డి, కిరణ్ యాదవ్, అల్లావుద్దీన్, రామకృష్ణ గౌడ్ తదితరులతో కలిసి చందానగర్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలనువేసి తెలంగాణతల్లి, కెసిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకంచేసి తెలంగాణ ఏర్పాటు విజయానికి సూచికగా గులాబీ రంగు బెలూన్లను గాలిలోకి ఎగురవేయడం జరిగింది. అనంతరం సామ వెంకట్ రెడ్డి, బొబ్బ నవతారెడ్డి, శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక మలుపుగా భావించదగిన డిసెంబర్ 9వ తేదీని 'విజయ్ దివస్'గా ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని, విజయ్ దివస్ చరిత్రలో నిలిచిపోయే రోజుగా వారు అభివర్ణించారు. కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన డిసెంబర్ 9 రోజే 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షకు ఒక రూపం వచ్చిందని, అంతటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించుకుంటూ ఆనాడు తెలంగాణ కోసం చేసిన అందరి త్యాగాలను స్మరించుకుంటూ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన సిద్ధించిన రోజును ఈ రకంగా గుర్తు చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, సలీం, బాల్ రాజ్, బాబు, మల్లేష్, రాజు, గణేష్ రెడ్డి, గౌస్, వంశీ, శ్రీను, శివ, సునీత, షభానా, అనంత రెడ్డి, మలేష్, గిరి, అష్రాఫ్, నగేష్ రెడ్డి, బాబా, జె. వి.రావు, దొంతి చిన్న, రాజ్ కుమార్, గిరి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవం..!

- సర్పంచ్ గా తూటిపల్లి సత్తమ్మ నాగయ్య



**పి.ఏ.పల్లి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవం అయింది.సర్పంచ్ అభ్యర్థిగా తూటిపల్లి సత్తమ్మ నాగయ్య ఒక్కరే నామినేషన్ వేయడంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయింది.ఈ సందర్భంగా తూటిపల్లి సత్తెమ్మ నాగయ్య మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు.దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్థానాన్ని అన్నారు.తన ఎన్నికకు సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేసీఆర్ అమరణ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు



**తుంగతుర్తి, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు మంగళవారం మండల కేంద్రంలో దీక్ష దివస్ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు అనంతరం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కెసిఆర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్షకు కేంద్రం స్పందించి డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజు అని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు, ఎస్ ఏ రజాక్,మాజీ ఎంపీపీ గుండ గాని కవితా రాములు గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, నాయకులు పులుసు యాదగిరి, వివిధ మండలాల అధ్యక్షులు రఘునందన్ రెడ్డి, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఉపేందర్, సోమేశ్వర్, వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి



**కేశంపేట, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** కొత్తపేట గ్రామ అభివ ృద్ధి కోసం తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించి ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో దిగిన సర్పంచ్ అభ్యర్థి పట్లూరి హైమావతి జగదీశ్వర్ అన్నారు. కొత్తపేట గ్రామంలో తమ మద్దతుదారులతో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో తనకు కేటాయించిన బ్యాటు గుర్తుకు ఓటు వేసి సర్పంచిగా భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సర్పంచ్‌గా గెలుస్తే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ గ్రామంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత 50 సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజల సంక్షేమానికి, అభివ ృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించి తను సర్పంచ్ గా పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థించారు.

## సర్పంచ్ అభ్యర్థిగా బ్యాట్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించండి



**భువనగిరి రూరల్, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** భువనగిరి మండలం, నాగిరెడ్డి పల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రావి సురేష్ రెడ్డి బ్యాట్ గుర్తుకు ఓట్లు,వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఓటర్ల ను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నాగిరెడ్డి పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేశామని అన్నారు. అదే విధంగా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రేషన్ కార్డులు,ఉచిత విద్యుత్ అందించామని అన్నారు. సర్పంచ్ రావి సురేష్ రెడ్డి సీరియల్ నెంబర్ 3బ్యాట్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు.మిగిలిన పనులను కూడా త్వరలో జరుగుతాయని అన్నారు.అదే విధంగా సర్పంచ్ అభ్యర్థి రావి సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారం తో ఊర్లో అన్ని పనులు చేస్తానని ఊరిని ఆదర్శ గ్రామం గా దిద్దుతానని సర్పంచ్ అభ్యర్థి రావి సురేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం లో ఓటర్లను కోరారు. మజహర్, చల్లగురుగుల రఘు బాబు, మండలపార్టీ ఉపాధ్యక్షులుచుక్క స్వామి మాట్లాడుతు, ఎమ్మెల్యే గెలిచిన నాటి నుండి భువనగిరి నియోజకవర్గం లో ఎన్నో సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు కుల మతా లకు అతీతంగా అందజేశారని అన్నారు.రావి సురేష్ రెడ్డి బ్యాట్ గుర్తు సీరియల్ నెంబర్ 3పై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో రాష్ట్ర సీనియర్ నాయకులు పశ్చిమట్ల శివరాజ్, మండలఅధ్యక్షులు ఎలిమినేటి కృష్ణ రెడ్డి, తంగళ్ల పల్లి రవికుమార్, పోతం శెట్టి వెంకటేష్,గ్రామ శాఖ అధ్యక్షులు గాదె కరుణాకర్, సుక్క అశోక్,సురేందర్, అనిల్, మల్లయ్య, వాసగోని సాయి, కాసాని వేంకటేష్, గాదె శేఖర్, ముసునూరు వరలక్ష్మి, ఇందిరా పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు రిటర్నింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలి

- పంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చింతకాని, డిసెంబర్ 9 (జనం సాక్షి) : డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా చింతకాని మండలం లో కలెక్టర్ మంగళవారం పర్యటించి, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లను తనిఖీ చేశారు. చింతకాని లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోనకల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలను, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునే విధంగా వాహనాల ఏర్పాటుకు రూట్ ఆఫీసర్లు భాద్యత వహించాలని తెలియజేస్తూ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.అనంతరం నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్పంచ్, వార్డు మెంబర్ ల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఓటర్లకు కల్పించే మౌళిక సదుపాయాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ లు ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్,సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం, తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ కు చర్యలు చేపట్టాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నాయో లేదో రిటర్నింగ్ అధికారి చెక్ చేయాలని, సరైన సమయానికి చేరుకునేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కు ముందు రోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ నాడు ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేలా రూట్ ఆఫీసర్లు చూడాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా చేయాలని తొందర పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఓటు చాలా కీలకమైన అంశంగా గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారులు నవీన్ బాబు, కె.విజయభాస్కరరెడ్డి, చింతకాని తహశీల్దార్ ఎంపిడిఓలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అనిల్ అంబానీ కుమారుడిపై సీబీఐ కేసు



ముంబై:రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్)కు సంబంధించిన రూ.228.06 కోట్ల బ్యాంకింగ్ మోసం కేసులో అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అంబానీపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ క్రిమినల్ కేసు నమోదు చేసింది. అనిల్ అంబానీ కుమారుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ కేసులో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్, దాని మాజీ సీఈవో, పూర్తికాల డైరెక్టర్ రవీంద్ర శరద్ సుధాల్కర్‌తో పాటు వివరాలు తెలియని కొందరు ప్రభుత్వోద్యోగుల పేర్లు కూడా ఫిర్యాదులో ఉన్నాయి. మోసం, నేరపూరిత కుట్ర, నేరపూరిత దుష్ప్రవర్తన కారణంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.228.06 కోట్ల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జై అన్మోల్ అంబానీ, రవీంద్ర సుధాల్కర్ తదితరులు రుణాలు ఇవ్వడం, తిరిగి చెల్లించడంలో అవకతవకలకు పాల్పడి ఆర్థిక నష్టాన్ని కలిగించే చర్యలకు పాల్పడ్డారని సీబీఐకి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదులో స్పష్టం చేశారు. మోసం, పదవి దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణల కింద ఏజెన్సీ కేసు నమోదు చేసింది.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ అనూప్ వినాయక్ తరాలే దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ ఆర్థిక సహాయం కోరుతూ ముంబైలోని ఎస్సీఎఫ్ శాఖను సంప్రదించింది. దాంతో 2015-2019 మధ్య యూనియన్ బ్యాంక్ ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌కు రూ.450 కోట్ల టర్మ్ లోన్లను మంజూరు చేసింది. దీనితో పాటు కంపెనీ అందించే రూ.100 కోట్ల విలువైన ప్రైవేటుగా ఉంచిన నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లకు కూడా బ్యాంకు సబ్‌స్క్రైబ్ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో తిరిగి చెల్లించడం, సెక్యూరిటీలు, ఫైనాన్షియల్స్‌ను సరిగ్గా బహిర్గతం చేయాల్సిన షరతులపై ఈ రుణాలు మంజూరు చేసింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీగా నమోదు చేయ బడి, సెప్టెంబర్ 2017లో నేషనల్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయింది. రుణ నిధులను జై అన్మోల్ అంబానీ, రవీంద్ర శరద్ సుధాల్కర్ సహా మాజీ డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇతర మార్గాల్లోకి మళ్లించారని బ్యాంక్ ఆరోపించింది. 30 సెప్టెంబర్ 2019న డెట్ అకౌంట్ నిలిపేశారు. తదుపరి పరిశీలన తరువాత బ్యాంక్ 10 అక్టోబర్ 2024న ఖాతాను 'ఫ్రాడ్'గా ప్రకటించింది. దీన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నివేదించింది.ఏప్రిల్ 2016 నుంచి జూన్ 2019 వరకు గ్రాంట్ తోర్న్‌టన్ ఇండియా ఎల్ఎల్‌పీ నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో తీవ్ర ఒడిదొడుకులు బయటపడ్డాయి. రుణం తీసుకున్న నిధులు ఇతర మార్గాల్లోకి మళ్లించినట్లు ఆడిట్‌లో కనుగొన్నారు. కంపెనీ జనరల్ పర్పస్ కార్పొరేట్ రుణాల్లో దాదాపు 86 శాతం, అంటే రూ.12,573.06 కోట్లు పరోక్షంగా అనుసంధానించిన సంస్థలకు పంపిణీ చేసినట్లు ఆడిట్ రిపోర్ట్ ఇచ్చారు. ఇందులో సర్క్యులర్ లావాదేవీలను కూడా నివేదించారు.ఈ నేపథ్యంలో నిందితులపై ఐపీసీ సెక్షన్లు 120-బీ (నేరపూరిత కుట్ర), 420 (మోసం), అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), 13(1)(డీ), సవరించిన పీసీ చట్టంలోని సెక్షన్ 7 కింద కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తును న్యూఢిల్లీలోని సీబీఐ బ్యాంకింగ్ సెక్యూరిటీ అండ్ ఫ్రాడ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రోషన్ లాల్‌కు అప్పగించారు.

# కేవలం విస్తరణ కాంక్షేనా..?

## • ఖాతా దారుల సమస్యలు పట్టవా..?



ముంబై:మీరు బ్యాంకు నుంచి లోన్ తీసుకున్నారా? క్రెడిట్ కార్డుపై బిల్లింగ్ వివాదం తో సతమతమవుతున్నారా? కార్డు రివార్డ్ పాయింట్లలో సమస్యలున్నాయా? బ్యాంకు ద్వారా ఏ కారణం లేకుండా డబ్బులు కట్ అయ్యాయా?..ఇలాంటి సమస్యలు మీకు ఒక్కరికే కాదు.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా ఏకంగా అంతకుముందు ఏడాది కంటే 13.55% పెరిగి 13.34 లక్షలకు చేరాయి. రుణాలు, క్రెడిట్ కార్డుల సర్వీసుల్లో లోపాల కారణంగా వినియోగదారులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల విడుదల చేసిన 'రిజర్వ్ బ్యాంక్-ఇంటిగ్రేటెడ్ ఓంబుడ్స్‌మన్ స్కీమ్ (ఆర్‌బీ-ఐఓఎస్) 2024-25 వార్షిక నివేదిక' స్పష్టం చేసింది.ఈ ఫిర్యాదుల పెరుగుదల ట్రెండ్‌లో అత్యంత ఆందోళనకరమైన అంశం ఏమిటంటే, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులపై ఫిర్యాదులు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను మించి 37.53%కి చేరాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులు రిటైల్ లెండింగ్‌లో దూకుడుగా వెళ్తున్న నేపథ్యంలో కస్టమర్ సర్వీస్ నాణ్యతలో లోపాలు ఎక్కువగా ఉన్నాయనేందుకు ఇదే నిదర్శనం.

**సెక్టార్ వారీగా ఫిర్యాదులు ఇలా..**

బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన మొత్తం 2,96,321 ఫిర్యాదుల్లో ప్రైవేట్ బ్యాంకుల వాటా పెరిగింది.అంతకుముందు ఆర్థిక సంవత్సరం 38.32% వాటాతో పబ్లిక్ బ్యాంకులు ముందుండగా, ఇప్పుడు 37.53% వాటాతో ప్రైవేట్ బ్యాంకులు వాటిని అధిగమించాయి. పబ్లిక్ బ్యాంకులు తమ అంతర్గత ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను మెరుగుపరుచుకోవడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**కస్టమర్ల ప్రధాన సమస్యలు**

కస్టమర్ల నుంచి వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో దాదాపు సగం (46%) కేవలం రుణాలు, క్రెడిట్ కార్డులు కేటగిరీలకే పరిమితమయ్యాయి. లోన్లు, అడ్వాన్స్‌లు విభాగంలో 29.25% వాటాలో 86,670 ఫిర్యాదులు అందాయి. వడ్డీ రేట్లలో మార్పులు, రుణాల మంజూరులో ఆలస్యాలు, రుణ చెల్లింపుల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఇందులో ఉన్నాయి.

**క్రెడిట్ కార్డులు:** 17.15% వాటాతో (50,811 ఫిర్యాదులు) రెండో స్థానంలో ఉంది. ఈ కేటగిరీలో ఏకంగా 20.04% పెరుగుదల నమోదైంది. బిల్లింగ్ తప్పులు, అనధికార లావాదేవీలు, రివార్డ్ పాయింట్ల మోసాలు వంటివి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ముఖ్యంగా, క్రెడిట్ కార్డు ఫిర్యాదుల్లో ప్రైవేట్ బ్యాంకుల వాటా (32,696) అత్యధికంగా ఉంది.

**డిజిటల్ బ్యాంకింగ్:** మొబైల్/ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ ఫిర్యాదులు అంతకుముందుతో పోలిస్తే 12.74% తగ్గడం స్వాగతించదగిన పరిణామం. డిజిటల్ సెక్యూరిటీ మెరుగుపడటం, కస్టమర్లకు అవగాహన పెరగడం దీనికి దోహదపడింది.

# అంతరిక్షంలో గూగుల్ ఏఐ



## డేటా సెంటర్ల ఏర్పాటు • 2027లో తొలి పరీక్షలు

న్యూయార్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బూమ్‌తో పెరిగిపోతున్న డేటా సెంటర్ల అవసరాలను తీర్చడానికి సరికొత్త ప్రణాళికతో అల్ఫాబెట్ (గూగుల్) ముందుకు వచ్చింది.గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఇటీవల ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంతరిక్షంలో సోలార్ ఎనర్జీతో నడిచే ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గూగుల్ దీనికి 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్'గా పేరు పెట్టింది.ఈ ప్రాజెక్టు గురించి పిచాయ్ మాట్లాడుతూ 'గూగుల్‌లో మూన్ షాట్‌లు తీసుకోవడం ఎప్పుడూ గర్వకారణం. ఏదో ఒకరోజు అంతరిక్షంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. తద్వారా సూర్యుడి నుంచి ఎనర్జీని మెరుగ్గా ఉపయోగించుకోవచ్చు అనేదే మా ప్రస్తుత మూన్ షాట్' అని తెలిపారు. సూర్యుడి నుంచి లభించే అపార శక్తిని (భూమిపై కంటే అంతరిక్షంలో అధిక ఎనర్జీ ఉంటుంది) ఉపయోగించి స్పేస్‌లో ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. దీనివల్ల భూమిపై డేటా సెంటర్ల ఏర్పాటులోని సమస్యలను పరిష్కరించాలని గూగుల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ అంతరిక్ష డేటా సెంటర్ల ప్రయాణంలో గూగుల్ ప్లానెట్ ల్యాబ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. 'మేము 2027లో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొదటి అడుగు వేస్తాం. చిన్న యంత్రాల ర్యాక్‌లను శాటిలైట్‌ల్లో పంపి పరీక్షిస్తాం. ఆ తర్వాత స్కేలింగ్ ప్రారంభిస్తాం' అని పిచాయ్ ప్రకటించారు. భవిష్యత్తులో ఈ అంతరిక్ష డేటా సెంటర్లు సాధారణ మార్గంగా మారతాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ ఇంటర్వ్యూ వీడియో క్లిప్ ఎక్స్ ప్లాట్‌ఫాంమ్‌లో వైరల్ అయింది. దాంతో టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ దృష్టిని ఇది ఆకర్షించింది. ఈ ఇంటర్వ్యూపై మస్క్ కేవలం 'ఆసక్తికరమైనది అనే ఒక్క పదంతో స్పందించారు.

# విపణి




## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.51 | ₹ 6.53 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,19,250 (22 క్యారెట్లు) | ₹ 1,30,090 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,99,000

# కొనసాగిన నష్టాలు..

## 400 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా ఫెడ్ ప్రకటన వేళ లాభాల స్వీకరణ కొనసాగింది. దీనికితోడు భారత్ నుంచి దిగుమతి అయ్యే బియ్యంపై టారిఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం వేళ ఈ ప్రకటన వెలువడడంతో అనిశ్చితి నెలకొంది. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయి తర్వాత కాస్త కోలుకుంది.సెన్సెక్స్ ఉదయం 84,742.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,102.69) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,382.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత కాస్త కోలుకుంది. ఆఖరికి 436.41 పాయింట్ల నష్టంతో 84,666.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.90 పాయింట్ల నష్టంతో 25,839.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటెర్నల్, టైటాన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి.

# యుద్ధ విలాపం

## ఇజ్రాయెల్ - పాలస్తీనా సమరంలో కేవలం ప్రజలే కాక సైనికులూ బాధితులే..

**ఇజ్రాయెల్‌కు పాలస్తీనాకు చెందిన మిలిటెంట్ గ్రూప్ హమాస్‌తో గాజా స్ట్రిప్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం తీవ్ర విషాదాన్ని తీసుకొచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ పునరావాస విభాగం తాజాగా విడుదల చేసిన గణాంకాల కన్నీరు కంటతడి పెట్టిస్తున్నాయి.మానసిక అనారోగ్యంతో ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ పునరావాస విభాగం తెలిపిన గణాంకాల ప్రకారం, 2023 అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దాదాపు 22,000 మంది గాయపడిన సైనికులకు చికిత్స అందించారు. వీరిలో అత్యధికంగా 58 శాతం మంది పోస్ట్-ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ ఇతర మానసిక ఆరోగ్య పరిస్థితులతో బాధపడుతున్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది పునరావాస కేంద్రాలకు తీవ్రమైన భారంగా పరిణమించింది.**




జెరూసలేం: పునరావాస విభాగం ప్రస్తుత. గత యుద్ధాలలో గాయపడిన వారితో సహా మొత్తం 82,400 మంది గాయపడిన మాజీ సైనికులకు సేవలు అందిస్తోంది. ఈ సంఖ్యలో 9 శాతం మంది మహిళా సైనికులు ఉన్నారు. గాయపడిన మొత్తం అనుభవజ్ఞులు అత్యధికంగా 48 శాతం మంది వారి తప్పనిసరి సైనిక సేవ సమయంలో గాయపడగా, 26 శాతం మంది రిజర్వ్ డ్యూటీలో, 13 శాతం మంది కెరీర్ సర్వీస్‌లో, తొమ్మిది శాతం మంది పోలీసు సిబ్బందిగా ఉన్న సమయంలో గాయపడ్డారని విభాగం తెలిపింది.

**వీల్‌చైర్‌కే పరిమితమై..**

పునరావాస విభాగంలో తీవ్రమైన గాయాలు, వైకల్యాలతో బాధపడుతున్న అనుభవజ్ఞుల సంఖ్య గణనీయంగా ఉంది. వీరిలో 873 మంది వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. వీరిలో 132 మంది అక్టోబర్ 7 తర్వాత గాయపడ్డారు. అత్యంత తీవ్రమైన గాయం స్థాయి (100% కంటే ఎక్కువ వైకల్యం) ఉన్నవారు 612 మంది ఉండగా, వీరిలో ప్రస్తుత యుద్ధంలో 64 మంది గాయపడ్డారు. అలాగే, 115 మంది అంధత్వంతో బాధపడుతున్నారు (ప్రస్తుత యుద్ధంలో ఐదుగురు), 1,061 మంది అంగవైకల్యం పొందినవారు ఉన్నారు, వీరిలో గత రెండేళ్ల యుద్ధంలో 88 మంది గాయపడ్డారు.

**చికిత్సకు రూ. 23,130 కోట్లు**

పునరావాస కేంద్రాలపై పెరుగుతున్న భారాన్ని దృష్టిలో ఉంచుకుని, 2026 చివరి నాటికి మరో 10,000 మంది గాయపడిన మాజీ సైనికులను కేంద్రాలు స్వీకరిస్తాయని మంత్రిత్వ శాఖ అంచనా వేసింది, వీరిలో ఎక్కువ మంది %ూఋణ% వంటి మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు, పునరావాస శాఖ మొత్తం బడ్జెట్ 2.57 బిలియన్లు గా ఉంది. ఇందులో 1.27 బిలియన్లు ప్రత్యేకంగా మానసిక ఆనారోగ్యంతో బాధపడుతున్న వారి చికిత్సకు కేటాయించారు.



# సౌదీ సంచలన నిర్ణయం..

## ముస్లిమేతర నివాసితులకు మద్యం విక్రయించాలని నిర్ణయం

రియాద్: సౌదీ అరేబియా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోని ముస్లిమేతర నివాసితులకు మద్యం విక్రయించాలని నిర్ణయించింది. అయితే ఇందుకు పలు కఠిన నిబంధనలు విధించింది.దేశీయంగా తీసుకున్న ఆర్థిక పరివర్తన లక్ష్యాలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నది. విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు సౌదీ ప్రయత్నిస్తోంది.దేశంలోని రియాద్‌లో ఏర్పాటు చేసిన ఏకైక మద్యం దుకాణంలోకి ప్రవేశించేందుకు ముస్లిమేతర నివాసితులు తమ ధృవీకరణ పత్రాన్ని చూపించాల్సి ఉంటుంది. అంతకుముందు విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభించిన ఈ దుకాణం ఇటీవల ప్రీమియం రెసిడెన్సీ హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ దుకాణంలో కొనుగోళ్లు కేవలం నెలవారీ పాయింట్-బేస్డ్ అలవెన్స్ సిస్టమ్ కింద మాత్రమే చేయవచ్చని సమాచారం. కాగా సౌదీ అరేబియా రాజధాని రియాద్‌తో పాటు ఇతర నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నిబంధనలు మద్యం యాక్సెస్‌ను సులభతరం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగమని విశ్లేషకులు అంటున్నారు. అయితే ప్రభుత్వం నుండి ఈ మార్పులపై ఎటువంటి అధికారిక ధృవీకరణ లేదు.

# సోనియా గాంధీకి కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారన్న ఆరోపణల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూలోని సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం సెషన్స్ కోర్టు సోనియాకు నోటీసులు జారీ చేసింది పిటిషనర్ తరఫు న్యాయవాది పవన్ నారంగ్ దీనిపై వాదిస్తూ.. సోనియాగాంధీకి పౌరసత్వం రాకముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారని, అందుకోసం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పునఃపరిశీలన అవసరమన్నారు. 1980లో ఓటర్ల జాబితాలో పేరు కోసం కొన్ని నకిలీ పత్రాలను సృష్టించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఆమె పేరును తొలగించి.. మళ్లీ 1983లో తిరిగి చేర్చారన్నారు. ఈ రెండు కూడా సోనియాకు పౌరసత్వం రాకముందే జరిగాయన్నారు. దీనికి సంబంధించిన కొన్ని ఆధారాలను సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించిన కోర్టు.. వివరణ ఇవ్వాలని సోనియాతో పాటు దిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 6న జరగనుంది. ఇక, గతంలో ఇదే విషయంలో మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీనిని పిటిషనర్ సెషన్స్ కోర్టులో సవాల్ చేయగా.. ఈ నోటీసులు జారీ అయ్యాయి.

# 130 అడుగుల కొండ, వయ్యారంగా సెల్ఫీ.. కట్ చేస్తే..



బీజింగ్:పర్యాటక ప్రదేశానికి వెళ్లినపుడు, అక్కడి ప్రకృతిని ఆస్వాదించడం కంటే, సెల్ఫీ తీసుకోవడం, వీడియోలు తీసుకోవడం పైనే దృష్టి. ప్రాణాలకు తెగించి మరీ సెల్ఫీ తీసుకునేటపుడు పొంచి ఉన్న ప్రమాదాలపై ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ ఈ ధోరణి మాత్రం మారణం లేదు.అత్యంత ప్రమాదకరమైన 130 అడుగులు కొండపై నుంచి నడుస్తున్నపుడు సెల్ఫీ తీసుకుంటూ జారీ పడ్డాడు. ఆ తర్వాత ఏమైందో తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే.ది సన్ కథనం ప్రకారం, చైనాలోని గ్వాంగ్'ఆన్‌లోని హువాయింగ్ పర్వతంపై ఈ సంఘటన జరిగింది. బ్లేడ్ రాక్ అనే పర్యాటక ప్రదేశంలోని 130 అడుగుల కొండ శిఖరం వద్ద సెల్ఫీ తీసుకుంటూ జారి పడిన పర్యాటకుడు అద్భుతంగా ప్రాణాలతో బయటపడ్డాడు.దీనికి సంబంధించిన వీడియో నెట్టింటవైరల్‌గా మారింది. దీని ప్రకారం అతను ఫోన్ పట్టుకుని కొండ అంచున నడుస్తున్నాడు. రాళ్లపై తన అడుగులు ఎక్కడ పడుతున్నాయో చూసుకుంటూ అడుగులు వేస్తున్నాడు. సెల్ఫీ కోసం ఇటు తిరిగాడు. అంతే క్షణాల్లో, అతని పాదాల కింద ఉన్న రాయి జరిగిరి, అదుపు తప్పి, ఠక్కున జారిపడ్డాడు. అలా కింద ఉన్న చెట్ల పొదలలోకి పడిపోయాడు. ఇది చూసి తోటి హైకర్లు దెబ్బకి షాక్‌అయ్యారు. కేకలు పెడుతూ కొండ అంచున పరుగులుపెట్టారు. కానీ పడిపోయిన వ్యక్తి దాదాపు 15 మీటర్ల ఎత్తులో ఉన్న అడవిలో పడిపోయాడు. ఆ భయంకరమైన జలపాతం నుండి తీవ్రమైన గాయాలు లేకుండా , ప్రాణాలతో బతికి బయటపడ్డాడు.ఈ విషయాన్ని సదరు పర్యాటకుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %ఔవజష్ట్రుీ%లో పోస్ట్ చేశాడు. చచ్చిపోతాననే అనుకున్నా.. కానీ ఆ పర్వత దేవతలే నన్ను ఆశీర్వదించారు. చాలా అదృష్టవంతుడిని. 40 మీటర్ల ఎత్తైన కొండపై నుండి పడి దాదాపు 15 మీటర్లు వాలుపైకి దొర్లాను అని రాసుకొచ్చాడు. మరోవైపు ప్రమాదం జరిగిందని చెబుతున్న బ్లేడ్ రాక్ ర్యాటక ప్రదేశం సుందరమైన ప్రాంతం , సరిహద్దుల్లో లేదు. వారు ఈ ప్రాంతాన్ని "దూరం నుండి మాత్రమే వీక్షించడానికి అనుమతి ఉంది , ఎక్కడానికి అనుమతి లేదు అని చెప్పారు అధికారులు. హైకింగ్ చేస్తున్నప్పుడు నిబంధనలను పాటించాలని, ఇలాంటి ప్రమాదకరమైన ప్రాంతాలలోకి ప్రవేశించకూడదని సందర్శకులకు గుర్తు చేశారు.

# యూరప్ బలహీనమైతేనే అమెరికాకు లాభం

## జేపీ మోర్గాన్ అండ్ చేజ్ సీఈఓ జామీ డిమోన్

న్యూయార్క్:అమెరికాలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన జేపీ మోర్గాన్ అండ్ చేజ్ సీఈఓ జామీ డిమోన్ ఇటీవల రీగన్ నేషనల్ డిఫెన్స్ ఫోరమ్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. యూరప్ అధికార యంత్రాంగం, ఆర్థిక విచ్ఛిన్నం అమెరికా భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తాయని హెచ్చరించారు.డిమోన్



ఈ సందర్భంగా యూరప్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను హైలైట్ చేశారు.'యూరప్‌లో సమస్య ఉంది. వారు వ్యాపారాన్ని, పెట్టుబడులను, ఆవిష్కరణలను బయటకు పంపిస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌లో కీలక అంశాలపై ఏకాభిప్రాయానికి రావడంలో ఇబ్బందులు ఉన్నాయి. ఇది ఆ ప్రాంతం స్థిరత్వానికి ప్రమాదం. యూరప్ బలహీనపడటం అమెరికాపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యూరప్ విచ్ఛిన్నమైతే 'అమెరికా ఫస్ట్' ఇకపై సాధ్యం కాదు. బలహీనమైన యూరప్ అమెరికాకు అవసరం లేదు' అని నొక్కి చెప్పారు.

**జేపీ మోర్గాన్ భారీ పెట్టుబడి**

ఈ హెచ్చరికల నేపథ్యంలో జేపీ మోర్గాన్ సంస్థ అమెరికా ఆర్థిక స్థితి స్థాపకతను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 1.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికను ఇటీవల ప్రకటించింది. ఇది గత ప్రణాళిక కంటే 500 బిలియన్ డాలర్లు ఎక్కువ కావడం గమనార్హం. ఈ పెట్టుబడులు ప్రధానంగా కొన్ని కీలక రంగాలపై దృష్టి పెట్టేందుకు తోడ్పడుతాయని కంపెనీ తెలిపింది.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 10 డిసెంబర్ 2025

## సీఎం ప్రజావాణిపై హరీష్ రావు నిరాధార ఆరోపణలు

**దిగజారి మాట్లాడుతున్న హరీష్**

**సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారంలో దాదాపు 70% సక్సెస్ రేటు ఉందని, కానీ మాజీ మంత్రి, బి.ఆర్.ఎస్ నాయకులు హరీష్ రావు సీఎం ప్రజావాణిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా హరీష్ రావు మాట్లాడడం సరికాదన్నారు. శుద్ధ అబద్ధాలతో తప్పుడు సమాచారంతో హరీష్ కాలం గడుపుతున్నారని చిన్నారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని ప్రజాభవంలో అధికారిక కార్యక్రమాలు మాత్రమే జరుగుతాయన్నారు. కరీంనగర్‌కు చెందిన గొడుగు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని హరీష్ రావు విమర్శించారని, అసలు ఆ వ్యక్తి ఎవరో తమ రికార్డుల్లో లేదన్నారు. హరీష్ తన గౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. కనీసం కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేని ప్రగతి భవన్ ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రజా భవన్ గా మార్చి, సీఎం ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తరఫున తాను, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ రెగ్యులర్‌గా ప్రజావాణి నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చిన్నారెడ్డి వివరించారు.

## మంత్రి ఆత్మీయత.. సిబ్బంది కృతజ్ఞత



**హైదరాబాద్, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో దేవాదాయ శాఖ తరఫున పనిచేసి సేవలు అందించిన స్టేట్ ఎండోమెంటు డిపార్టుమెంటు సిబ్బందిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఎండోమెంటు కమిషనర్ హరీష్ నేతృత్వంలోని పనిచేసిన సిబ్బందిని మంగళవారం ప్యానెల్ డిస్కషన్ తర్వాత ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో సైతం ఇదేవిధంగా బాగా పని డిపార్టుమెంటు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సురేఖ సూచించారు. అయితే, మంత్రి ఆత్మీయతకి ఎండోమెంటు కమిషనర్ హరీష్, సిబ్బంది కృతజ్ఞతలు మంత్రికి తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో దేవాదాయ శాఖ తరఫున పనిచేసి సేవలు అందించిన స్టేట్ ఎండోమెంటు డిపార్టుమెంటు సిబ్బందిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఎండోమెంటు కమిషనర్ హరీష్ నేతృత్వంలోని పనిచేసిన సిబ్బందిని మంగళవారం ప్యానెల్ డిస్కషన్ తర్వాత ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో సైతం బాగా పని డిపార్టుమెంటు మంచిపేరు తీసుకురావాలని మంత్రి సురేఖ సూచించారు. మంత్రి ఆత్మీయతకి ఎండోమెంటు కమిషనర్ హరీష్, సిబ్బంది కృతజ్ఞతలు మంత్రికి తెలిపారు.

# ముగిసిన ప్రచార పర్వం.. ప్రలోభాలకు తెర

**గ్రామాలలో మద్యం దంపులు**

**ఓటుకు వేయి నుండి రెండు వేలు**

**నగరాల్లో ఉండే ఓటర్లకు పిలుపు**

**గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 9 (జనంసాక్షి)** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడతలో నిర్వహిస్తున్న ఎన్నికలకు మంగళవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగిసింది. ఈనెల 11న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు తమ గెలుపు కోసం ఎన్నో ఎత్తులు వేస్తున్నారు. కుల సంఘాలను,యువతను ఆకట్టుకునేందుకు ఇప్పటికే వారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ ఓటరును ఆకట్టుకునేందుకు విందులు ఏర్పాటు చేసి వారిని అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. జీవనోపాధి కోసం గ్రామాల నుండి నగరాల్లో ఉంటున్న ఓటర్లకు ఫోన్లు చేస్తూ వారికి కూడా ఆన్ లైన్ ద్వారా డబ్బులు పంపుతూ ఓటు వేసేందుకు రావాలని ఫోన్లు చేస్తున్నారు. అభ్యర్థులు గెలుపు కోసం ఒకరిని మించి మరొకరు ఖర్చు చేస్తున్నప్పటికీ ఓటర్ నాడి ఎవరికి దొరకడం లేదు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత నిర్వహిస్తున్న వేములవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఐదు మండలాల్లో మంగళవారం సాయంత్రంతో ప్రచార ముగిసిపోయింది.

**ప్రలోభాలకు తెర**



ఈ నెల 11న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులు గెలిచేందుకు ఓటర్లను మంచిక చేసుకునేందుకు ఎన్నో రకాల ఎత్తుగడలు వేస్తున్నారు.ఇప్పటికే గ్రామాల్లో మద్యం అందుబాటులో పెట్టుకొని యువతకు,కుల సంఘాలకు మద్యం పంపిణీ చేస్తున్నారు. అభ్యర్థులు ఒక్క ఓటుకు రూ వెయ్యి నుండి రూ రెండు వేలు పంచేందుకు కూడా తమ అనుచరుల ద్వారా రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తమకు అనుకూలమైన ఓటర్ల జాబితాను తయారు చేసుకొని గుట్టు చప్పుడు కాకుండా ఓటర్ కు డబ్బులు పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ప్రతి వార్డులో విందులు ఏర్పాటు చేశారు.

**నగరాల్లో ఉండే ఓటర్లకు పిలుపు**

జీవనోపాధి కోసం గ్రామల నుండి వెళ్ళి మరోచోట ఉంటున్న ఓటర్లను గుర్తించి వారిని తమకు అనుకూలంగా మలుచుకొని ఓటు వేయించుకునేందుకు ఇప్పటికే వారికి ఫోన్లు చేస్తున్నారు.వారికి ఆన్లైన్ ద్వారా డబ్బులు పంపించి వారి రప్పించేందుకు ఏర్పాటు చేసుకున్నారు.

**ఏరులై పారుతున్న మద్యం**

పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. ప్రతి వీధిలో యువతకు,కుల సంఘాలను మద్యం పంపించేస్తూ విందులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామాల్లో మద్యం ఏర్లై పారుతుంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న క్రమంలో విందులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఓటర్ల మంచిక చేసుకునేందుకు ఎన్నో ఎత్తుగడలు వేస్తూ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు.

**ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన అధికారులు**

ఈ నెల 11న జరగనున్న పంచాయతీ ఎన్నికలకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సామాగ్రి సిద్ధం చేసుకుని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు.


## అర్జీదారు వద్దకే భూమి రిజిస్ట్రేషన్



**రాయికల్ డిసెంబర్ 9 (జనం సాక్షి) :** రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగార్జున అర్జీదారు వద్దకే వచ్చి రిజిష్ట్రేషన్ చేశారు. పేరాలసిస్ తో ఉన్న కుమ్మరి పెల్లి గ్రామానికి చెందిన అర్జీదారు కొడిమ్యాల ఇందమ్మ తన భూమిని అమ్మకం చెయ్యగా అట్టి భూమీ కొనుగోలు రిజిష్ట్రేషన్ నిమిత్తం కుటుంబం సభ్యులు ఆమెను తహసీల్దార్ కార్యాలయ ప్రాగణం వరకు ఆటోలో తీసుకురాగా అర్జీదారు నడవలేని స్థితిలో ఉందని తెలుసుకున్న తహసీల్దార్ నాగార్జున మానవత్వంతో స్పందించి కార్యాలయం బయట ఆటోలో ఉన్న ఆమె వద్దకు ప్రత్యేకంగా వచ్చిన వివరాలు తీసుకుని ఐరస్, ఈకెవై సి సంతకాలు తీసుకుని రిజిష్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి పత్రాలు అందజేశారు.

## రాష్ట్రంలో రాక్షసుల, రాబంధుల పాలన

**విజయ దివస్ వేడుకల్లో మాజీ మంత్రి వేముల**



**నిజామాబాద్ బ్యూరో (జనంసాక్షి) :** భీమగల్ పట్టణంలో మంగళవారం రోజున డిసెంబర్ 9 ప్రకటన సందర్భంగా విజయ దివస్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూల దండ వేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి. ఈ సందర&ంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమసారథి కేసీఆర్ దీక్ష ఫలితంగా వచ్చిన డిసెంబర్ 9 ప్రకటన తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు అని గుక్కెడు తాగు, సాగు నీళ్లు లేక గోస పడుతున్న తెలంగాణ ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అడవిబాట పడుతున్న వేళ అని, ఇలాంటి దుర్భిక్ష పరిస్థితులను చూసి కలత చెందిన కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడిన సందర్భం అని గుర్తుచేశారు. 2004 కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పితే కేసీఆర్ చావు నోట్ల తలకాయ పెట్ట దీక్ష చేస్తే దిగొచ్చిన యూపీఏ సర్కార్ 2014లో తప్పనిసరి పరిస్థితిలో ప్రకటన చేశారని చెప్పారు. కేసీఆర్ పోరాటం వల్లనే తెలంగాణ వచ్చింది. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదు. ముమ్మాటికీ అమరుల త్యాగం, కేసీఆర్ పోరాటం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. ఈన కాచి నక్కల పాలు చేసినట్లు కేసీఆర్ కడుపులో పెట్టుకుని సాదుకున్న తెలంగాణ నేడు దోపిడి దొంగల పాలైంది. కేసీఆర్ పాలనలో జీఎస్డీపీలో 4వ స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 12వ స్థానానికి దిగజారిపోయింది.జీఎస్టీ వసూళ్లలో 1వ స్థానం నుంచి 28 వ స్థానం, తలసరి ఆదాయంలో 1 వ స్థానం నుంచి 4వ స్థానంకు పడిపోయిందని విమర్శించారు. రూ. వేల కోట్ల విలువైన భూములు అమ్మే పని రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడు. రాష్ట్రంలో రాక్షసుల, రాబంధుల పాలన కొనసాగుతోంది. కేసీఆర్ బ్రహ్మాండంగా మార్చిన తెలంగాణను మళ్ళీ ఆంధ్రోళ్ల చేతుల్లో పెట్టే కుట్ర చేస్తున్నారు. ఇట్లాంటి కుట్రలు ప్రజలు గమనించాలి. కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలని అన్నారు.

## నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

**ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలపై ఉన్న ఆర్టీసీ కేసు కొట్టివేత**



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ సమ్మెను విచ్చిన్నం చేసేందుకు కుట్రపన్ని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను నిర్బంధాలకు గురిచేసి అక్రమ కేసులను బనాయించిందన్నారు. ఖమ్మంలో 2019లో ఆర్టిసి సమ్మె సందర్భంగా నాటి ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల పై పోలీసులు మోపిన అక్రమ కేసును ఈ రోజు స్థానిక ఖమ్మం 1వ అడిసినల్ కోర్టు జడ్జి 9 మంది నాయకులపై పెట్టిన అక్రమ కేసును కొట్టివేయడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ చింతల రమేష్ ఆజాద్ మడపల్లి లక్ష్మణ్ జమ్మి అశోక్ మంద సురేష్ భాగం హేమంత్ గోకినపల్లి మస్తాన్ గాయత్రి మాట్లాడుతూ.. 2019 సం,లో నాటి కేసీఆర్, టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీనీ ప్రైవేటీకరించకుండా, ఆర్టీసీ కార్మికులు 53 రోజులపాటు చేపట్టిన ఆర్టీసీ సమ్మెకి మద్దతుగా, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ యూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫెవిలియన్ గ్రౌండ్ నుండి బస్ డిపో ముట్టడికి చేపట్టిన కేసీఆర్ శవయాత్ర కార్యక్రమం ఉద్రిక్తత పోలీసులకు విద్యార్థి సంఘాల నాయకులు మధ్య తోపులాట పోలీసులు విద్యార్థి నాయకులు 2019లో అక్రమ కేసును పెట్టడం జరిగింది. ఈ కేసును గత 6 సంవత్సరాలుగా విచారించిన ఖమ్మం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పోలీసులు పెట్టిన అక్రమ కేసు అని కొట్టివేయడం జరిగింది. ప్రభుత్వ నిర్బంధాలు భయపడేది లేదని సమస్యలపై నిరంతరం ఉద్యమాలను కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కేసును కొట్టివేసిన జడ్జి కి, కేసును వాదించిన లాయర్లు విప్లవ్ కుమార్,సంధ్యలకు విద్యార్థి నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## తెలంగాణ ఇచ్చిన మహా తల్లి సోనియా గాంధీ

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రుద్రంగి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** ఏఐసీసీ అధ్యక్షురాలుగా సుదీర్ఘకాలం పని చేసిన సోనియా గాంధీ దేశంలో చాలా రాష్ట్రంల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వలని ఏర్పాటు చేశారు.డిసెంబర్ 9 నాడు సోనియా గాంధీ యావత్ తెలంగాణ ప్రజానీకాని ఆకాంక్షను నెరవేర్చారు.ప్రధాని పదవిని చేపట్టే అవకాశం ఉన్న రెండు సార్లు ప్రధాన మంత్రి పదవిని త్యాగం చేసింది.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఎల్లప్పుడూ పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం పాటుపడతాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సోనియా గాంధీ ఆలోచనతో ముందుకు పోతున్నారు.రాజన్న ఆశీస్సులతో సోనియా గాంధీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని,మన ప్రాంత ప్రజల పక్షాన సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గండి నారాయణ తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ చీరలో కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లోకల్ అట్రాక్షన్‌గా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్‌లోకి మంత్రి సురేఖ ఇందిరమ్మ చీరలో అడుగు పెట్టిన క్షణం మొదలు.. అందరూ ఆత్మీయంగా ఆమెను పలకరించారు. తొలుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులుతో తెలంగాణ తల్లి విగ్రహం లాంచ్ చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన ప్రతి ఒక్కరూ సురేఖక్క ఇందిర్మమ్మ చీర బాగుంది అంటూ కితాబిచ్చారు. అటుతర్వాత మంత్రి సురేఖ దేవాదాయ, అటవీ, పర్యావరణ విభాగానికి సంబంధించిన ప్యానెల్ డిస్కషన్ లో పాల్గొన్నారు. సమ్మిట్ తర్వాత వివిధ స్టాల్స్ ను పరిశీలిస్తున్న సందర్భంలో మంత్రి సురేఖతో అందరూ సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. సురేఖమ్మ, ఇందిరమ్మ చీర అదుర్స్ అంటూ చెప్పుకొచ్చారు.

## ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 9 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికల్లో భాగంగా 85 గ్రామాల్లో జరిగే పోలింగ్ ఏర్పాట్లను మంగళవారం అడిషనల్ కలెక్టర్ నగేష్ పరిశీలించారు. వేములవాడలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఐదు మండలాల్లో 85 గ్రామపంచాయతీలకు గాను 9 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కావడంతో 76 సర్పంచి స్థానాలకు,ఆ గ్రామాల్లో వార్డు సభ్యులకు మాత్రమే ఎన్నికలు జరుగుతాయన్నారు. ఐదు మండలాల్లో 748 వార్డు సభ్యులకు 227 వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో 521 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.తొలి విడత గ్రామాలను రెండు రూట్లుగా,మూడు జోన్లుగా విభజించి ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను ఆయా గ్రామాలకు పోలీస్ బందోబస్తుతో తరలించడం జరుగుతుందన్నారు.ఏర్పాట్లన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను ఎస్టిఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచనున్నట్లు తెలిపారు.అయన వెంట ఎంపిడివో కీర్తన,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్క, బావ తప్పక రావాలి..!

**వలస ఓటర్లపై అభ్యర్థుల ఫోకస్**

**రానుపోను ఖర్చులు స్పెషల్ ప్యాకేజి**

**పోలింగ్ రోజున రప్పించేందుకు ప్రణాళికలు**



**రాజోలి, డిసెంబర్ 9 (జనంసాక్షి) :** బావగారు నమస్తే..అంతా కుశలమేనా సర్పంచ్‌గా పోటీచేస్తున్న 14న మన ఊరిలో పోలింగ్ ఉంది. అక్క, అల్లుడు చిన్నోడు, నువ్వు శనివారం సాయంత్రంలోగా మన ఊరికి వచ్చేలా ప్లాన్ చేసుకో. ఏం ఫికర్ పడకు. రానుపోను చార్జీలతోపాటు పైఖర్చులు కూడా చూసుకుంట. ఈ నంబరుకు ఫోన్ పే ఉందికదా ? రవాణా చార్జీలు పంపుత లేదా మన ఊరోళ్లు మీ కాలనీలో ఎవరైనా ఉంటే ఓ కారు మాట్లాడుకోని అందరూ రండి. కిరాయి నేనేఇస్త. నామీద ఒట్టే నువ్వు తప్పకుండా రావాలి. నాకు ఓటెయ్యాలి. ఈ విధంగా వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వలస ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పడుతున్న పాట్లకు ఇది నిదర్శనం.

**ప్రతి ఓటు కీలకమే..**

గ్రామం యూనిట్ గా జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. స్వల్ప తేడా ఓట్లతోనే ఫలితం తారుమారయ్యే అవకాశాలు ఉంటాయి. స్థానిక ఎన్నికలను అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రతీ ఓటరుపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. 'నువ్వా.. నేనా' అన్నట్లు ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు శతవిధాలా యత్నిస్తున్నారు. పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ వార్డుల వారీగా అనుకూల ఓటర్లపై ఆరా తీస్తూ వారిని ఎలా కలువాలి ? ఎలా తమవైపు తిప్పుకోవాలనేదానిపై ప్లాన్ చేస్తున్నారు.

**ఉపాధి కోసం వెళ్లినవారిపై ఫోకస్**

ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన గ్రామ ఓటర్లపై అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ఎంతమంది, ఎక్కడెక్కడ ఉన్నారని ఆరా తీస్తున్నారు. అభ్యర్థుల కుటుంబసభ్యులు, బూత్ కన్వీనర్లు, ఏజెంట్ల ద్వారా ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 50 నుంచి 150 మందివరకు వలస ఓటర్లు ఉన్నట్లు అంచనా వేసుకుంటూ ప్రత్యేకంగా బృందాలనూ రంగంలోకి దింపారు. వలస వెళ్లిన వారికి ఫోన్లపై ఫోన్లు చేయిస్తున్నారు. ఎక్కడ ఉన్నా పోలింగ్కు ఒకరోజు ముందుగానే స్వగ్రామాలకు రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు పోటీ పడుతున్నారు. వారి ఫోన్ నంబర్లు సేకరిస్తూ, వాట్సప్ గ్రూప్లు క్రియేట్ చేస్తూ వారితో టచ్ ఉంటున్నారు.

## అడవిసోమన్‌పల్లి బ్రిడ్జికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




**మంథని, (జనంసాక్షి) :** అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా కాంగ్రెస్ పాలకులు అడవి సోమనపల్లి బ్రిడ్జి ని పట్టించుకోవడంలేదని, వెంటనే బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంథని మండలం అడవిసోమన్‌పల్లి మానేరుపై ఉన్న వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రిగా దుద్దిళ్ల శ్రీధర్ రెండేళ్ల ప్రజాపాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో అడవిసోమన్‌పల్లి వంతెనను చూస్తేనే అర్థం అవుతోందన్నారు. వంతెనకు ఒకవైపు సగం వరకు సున్నం వేసి మరోవైపు వేయకుండా వదిలేశారని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మంత్రి సాధించిన ఘనకీర్తి ఇదేనని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు పీవీ నర్సింహరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వంతెన నిర్మించారని, ఈనాడు కనీసం వంతెనకు సున్నం వేయించలేని పరిస్థితిలో ఉన్నారని ఆయన విమర్శించారు. ఆనాడు పీవీ తర్వాత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే ఉన్న సమయంలో బ్రిడ్జిలు వంతెనలు , ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు. చెక్ డ్యాంలు నిర్మిస్తే వాటిని వృధా అన్నారని, కానీ ఈనాడు అవి ఎంత అద్భుతంగా కన్పిస్తున్నాయో గమనించాలన్నారు. ప్రజల కోసమే పోరాటం చేస్తామని, అధికారం ఉంటే సమాజం మేలు కోసం, ప్రతిపక్షంలో ఉంటే ప్రభుత్వం మెడలు వంచి పని చేయించుకోడమేనని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు విలువను చాటి చెప్పి ప్రజలను చైతన్యం చేస్తామని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పాలకులను దోషిగా నిలబెడుతామని ఆయన స్పష్టం చేశారు.

## కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నిజామాబాద్ బ్యూరో, జనంసాక్షి డిసెంబర్ 09 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మొదటి దశలో ఎన్నికలు జరిగే మండలాల పోలింగ్ సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో మంగళవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎన్.ఐ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఏకగ్రీవం అయిన వాటిని మినహాయిస్తూ, ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.

## ఎన్నికల రోజున సెలవు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నరు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు.ఈ నెల11న మొదటి విడత,14 న రెండవ విడత,17 న మూడవ విడత ఎన్నికల నిర్వహణ ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యాసంస్థలు,పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయన్నారు.మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం 10,11 బుధవారం,గురువారం స్థానిక సెలవులు,రెండవ విడత ఎన్నికల నిర్వహణ కోసం13,14 శనివారం,ఆదివారం సాధారణ సెలవులు, మూడవ విడత ఎన్నికల నిర్వహణ కోసం 16,17 మంగళవారం,బుధవారం స్థానిక సెలవులు ప్రకటించారు.చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.

## సైబరాబాద్ పరిధిలో 10 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 09 (జనంసాక్షి) :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్స్పెక్టర్ల బదిలీలు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ బాస్ అవినాష్ మహంతి ఉత్తర్వులను జారీ చేశారు. కమిషనరేట్ పరిధి పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం బదిలీల ప్రక్రియ కేవలం మెరుగైన పోలీసింగ్ వ్యవస్థ, అధికారుల పనితీరు ప్రామాణికంగానే చోటు చేసుకుంది. అయితే ఇందులో 9 మందికి పోస్టింగులు లభించగా రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రోను మాత్రం రేంజ్ కు సరెండర్ చేయడం గమనార్హం. బదిలీ అయిన ఇన్స్పెక్టర్లలో కె. బాలరాజు, మహ్మద్ హబీబ్, బి. సంజీవులు, బి.సత్యనారాయణ, పి.నరేందర్, ఎం. ముత్తు యాదవ్, కె. తిమ్మప్ప, కె. వీరబాబు, బి. నాగేందర్ బాబు, క్యాస్ట్రో ఉన్నారు.

## తెలంగాణ ప్రభుత్వంతో రిధిరా గ్రూప్

# చారిత్రక ఒప్పందం



**ఖైరతాబాద్, డిసెంబర్ 09, (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం, రిధిరా గ్రూప్ కలిసి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయని రిధిరా గ్రూప్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రితేష్ మస్తిపురం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా యాచారంలో ఒక ప్రీమియం హాస్పిటాలిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు మొత్తం పెట్టుబడి రూ.117 కోట్లు కాగా హాస్పిటాలిటీ, టూరిజం రంగాల్లో ప్రపంచ స్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తోందన్నారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రతిష్ఠాత్మక 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రణాళికలో కీలక భాగంగా నిలవనుందని తెలిపారు. హైదరాబాద్ సమీపంలో నిర్మించబడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీని నివాస, వాణిజ్య కేంద్రాలుగా, పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, వినోదంతో కూడిన ఒక ఆధునిక నగరంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇది స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ కనెక్టివిటీ, పర్యావరణహి తం, ఆధునిక పట్టణ ప్రణాళికతో భవిష్యత్ నగరంగా రూపు దిద్దుకుంటోందని చెప్పారు. ఈ నగరంలో యాచారం హాస్పిటాలిటీ ప్రాజెక్ట్ ఒక కీలక ఆకర్షణగా మారనుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో 150 గదుల ప్రీమియం హోటల్, రెండు ఫుడ్ అండ్ బెవరేజ్ అవుట్‌లెట్లు, 18,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేక వెల్‌నెస్ సెంటర్, అలాగే అమ్మకం, లీజు సౌకర్యాలతో 20 లగ్జరీ బ్రాండెడ్ విల్లాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే రెండేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300కి పైగా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. దీని వల్ల యాచారం ప్రాంతం ఒక మంచి లగ్జరీ హాస్పిటాలిటీ మరియు వెల్‌నెస్ కేంద్రంగా అభివృద్ధి చెందనుం దని తెలిపారు.

## 'ది డైమండ్ స్టోర్ బై చందుభాయ్' నుంచి సంప్రదాయ నగలు

**ఖైరతాబాద్, డిసెంబర్ 09 (జనం సాక్షి) :** హైదరాబాద్ కు చెందిన 'ది డైమండ్ స్టోర్ బై చం దుబాయ్' సంస్థ ప్రాచీన భారత రాజరిక సంప్రదా యాల నుంచి ప్రేరణ పొందిన అద్భుతమైన వార సత్వ వధువుల నగల సమాహారాన్ని ఆవిష్కరిం చిందని ఈ ఏడువారాల నగల రూపకర్త, సంస్థ యజమాని కొట్టి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 22 వేలకుపైగా సహజ వజ్రాలు, శుద్ధమైన నవరత్నా లతో చారిత్రక 'ఏడు వారాల నగల' సంప్రదాయా నికి ఆధునిక రూపునిచ్చినట్లు తెలిపారు. ఆధునిక వధువుకు అనుగుణంగా ఈ రూపకల్పనను కొత్త గా ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ ఏడు భాగాల ను విడివిడిగా ఆభరణాలుగా ధరించడంతో పాటు అన్నింటినీ కలిపి ఒక ప్రతిష్ఠాత్మక ఆభరణంగా కూడా వేసుకోవచ్చని వెల్లడించారు.

# బానిసత్వపు ఆనవాళ్లు చెరిపేస్తున్నాం.. స్వాభిమాన భారత్ నిర్మిస్తున్నాం

**దేశ ప్రగతికి 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అనివార్యం**

**అవినీతి, కుటుంబ పాలన కోసమే కాంగ్రెస్ ఆరాటం**

**2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం.. మేధావులు నడుం బిగించాలి**

**మేధావుల సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్ తివారి**



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** భారతదేశం నేడు ఒక పరివర్తన దశలో ఉందని, బానిసత్వపు మానసిక స్థితి నుండి బయటపడి స్వాభిమాన భారత్ వైపు అడుగులు వేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్ తివారి అన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఖమ్మం నగరంలోని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో జరిగిన మేధావుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తివారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా మన వ్యవస్థల్లో, మన పేర్లలో బానిసత్వపు ఛాయలు మిగిలే ఉన్నాయని, వాటిని చెరిపివేసే బాధ్యతను మోదీ ప్రభుత్వం భుజాన వేసుకుందని తెలిపారు. దానికి నిదర్శనంగానే దేశ ప్రధాని నివాసం ఉండే '7 రేస్ కోర్స్ రోడ్' పేరును ప్రజా సంక్షేమానికి అద్దం పట్టేలా 'లోక్ కళ్యాణ్ మార్గ్'గా మార్చామని గుర్తుచేశారు. అలాగే రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్‌ను 'అమృత్ ఉద్యాన్'గా మార్చడం, బానిసత్వానికి గుర్తుగా ఉన్న రాజ్‌పథ్‌ను మన బాధ్యతను గుర్తుచేసే 'కర్తవ్య పథ్'గా తీర్చిదిద్దడం కేవలం పేర్ల మార్పు కాదని, అది జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని ఆయన స్పష్టం చేశారు. నేవీ జెండాలో మార్పులు చేయడం, జార్జ్ విగ్రహం ఉన్న చోట నేతాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వంటివి నవభారత నిర్మాణానికి పునాదులని పేర్కొన్నారు. పాలనాపరమైన సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోనే అత్యధిక సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న దేశం మనదేనని గర్వంగా చెప్పారు. గతంలో ఢిల్లీ నుండి రూపాయి పంపిస్తే పేదవాడికి చేరేసరికి పది పైసలు కూడా మిగిలేవి కావని, కానీ నేడు డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుడి ఖాతాలో నేరుగా వందకు వంద శాతం డబ్బులు జమ అవుతున్నాయని వివరించారు.

ఈ పారదర్శకత వల్ల మధ్యవర్తుల వ్యవస్థ పూర్తిగా రద్దయిందని, సిఫార్సుల ప్రమేయం లేకుండానే పేదలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. అలాగే ఆకాంక్షిత జిల్లాల పేరుతో దేశంలోని వెనుకబడిన ప్రాంతాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. దేశ భద్రత విషయంలో రాజీలేని ధోరణిని అవలంబిస్తున్నామని, ఒకప్పుడు నిత్యం బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన దేశం నేడు సురక్షితంగా ఉందని, ఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్ రూపురేఖలు మారాయని, 2026 నాటికి దేశం నక్సలిజం రహితంగా మారుతుందని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసిందని గుర్తుచేశారు. దేశంలో తరచూ వచ్చే ఎన్నికల వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని, ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికలకే లక్షా 35 వేల కోట్లు ఖర్చయ్యాయని, అందుకే దేశానికి 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' అత్యవసరమని, దీనివల్ల మిగిలే నిధులు పేదల సంక్షేమానికి ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ ఆయన, కాంగ్రెస్ అంటేనే అవినీతి అని, ఆ పార్టీ పాలనలో కుంభకోణాలు తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. తెలంగాణలో కూడా కుటుంబ పాలన, అవినీతి రాజ్యమేలుతున్నాయని, ప్రజలు వీటన్నింటిని గమనిస్తున్నారని అన్నారు. చివరగా 2047 నాటికి భారత్‌ను వికసిత దేశంగా మార్చడానికి ప్రతి పౌరుడు పంచ్ ప్రాణ్ (ఐదు ప్రతిజ్ఞలు) తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనల నుండి పర్యావరణ రక్షణ వరకు ప్రతి చిన్న బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని చంద్రశేఖర్ తివారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ గౌతమ్ రావు, జిల్లా ఇంచార్జ్ బద్దం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, సన్నీ ఉదయ ప్రతాప్, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్,దొంగల సత్యనారాయణ, నెల్లూరి బెనర్జీ,తాండ్ర వినోద్ రావు, కె శ్రీధర్ రెడ్డి, గల్లా సత్యనారాయణ, నున్నా రవి కుమార్, తాండ్ర రాంప్రసాద్ గురుస్వామి, గుత్తా సత్యనారాయణ, వీరవల్లి రాజేష్ గుప్తా ,తదితరులు పాల్గొన్నారు.

# 108 గంజాయి మొక్కలు స్వాధీనం



**1.5 కిలోల ఎండు గంజాయి పట్టివేత**

**జిల్లా మద్య నిషేధ,**

**ఆబ్కారీ అధికారి కే .విజయభాస్కర్**

**తాండూరు, డిసెంబర్ 9(జనంసాక్షి) :** 108 గంజాయి మొక్కలు స్వాధీనంచేసుకొని 1.5 కిలోల ఎండు గంజాయి పట్టివేయడం జరిగిందని జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ అధికారి కే.విజయభాస్కర్ తెలిపారు. జిల్లా మద్య నిషేధ మరియు ఆబ్కారీ అధికారి కే .విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో (01) గంజాయి కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. వివరాల ప్రకారం ఒక వ్యక్తి గంజాయి తన పొలంలో పండిస్తున్నట్లు మరియు అమ్మకాలు చేస్తున్నాడు అనే విశ్వసనీయమైన సమాచారం మేరకు డీటీఫ్ వికారాబాద్ టీం, ఎస్‌హెచ్‌ఓ తాండూర్ టీం మూకుమ్మడి దాడులు నిర్వహించి కోట్పల్లి మండలం లోని బార్వాద్ గ్రామంలో ఎర్రోళ్ల పెంటయ్య తండ్రి నాగయ్య పొలం సర్వేనెంబర్ 333అ 1/3 లో (108)గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకొని (1.5) కిలోల ఎండు గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యక్తి తన తండ్రి ఎర్రోళ్ల పెంటయ్య మరియు కొడుకు ఎర్రోళ్ల ప్రభాకర్ కలిసి ఈ పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు.అతని వివరాలు ఎర్రోళ్ల పెంటయ్య తండ్రి నాగయ్య వయస్సు:63 సంవత్సరాలు, .ఎర్రోళ్ల ప్రభాకర్ తండ్రి పెంటయ్య వయస్సు 35 సంవత్సరాలు భార్వాద్ గ్రామం, కోట్ పల్లి మండలం అని తెలిపారు. ఈ వ్యక్తులలో ఎర్రోళ్ల ప్రభాకర్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మరియు ఎర్రోళ్ల పెంటయ్య పరారి లో ఉన్నట్లు వీరి పై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్టు జిల్లా మద్య నిషేధ అధికారి కె విజయభాస్కర్ గౌడ్ తెలిపారు. అక్రమంగా గంజాయి ని పండించడం , అమ్మడం, కలిగి ఉండటం చట్ట రీత్యా నేరం అన్నారు. ఎటువంటి "మాదకద్రవ్యాల" సమాచారం ఉన్న నంబర్ లు 8712658760, 8712658754, సమాచారం ఇవ్వ వల్సింది గా కోరారు.. మీ వివరాలు గోప్యం గా ఉంచబడతాయి.మాధక ద్రవ్యాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం, వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. నిక్కచ్చి గా వ్యవహరిస్తుంది. ప్రజలు అందరు సహకరించ గలరని విజ్ఞప్తి చేశారు.ఈ దాడుల్లో ఎఈఎస్ శ్రీనివాస్ రెడ్డి మరియు డిటిఎఫ్ సిఐ శ్రీనివాస్, ఎస్ హెచ్ ఓ తాండూర్ ఇన్చార్జ్ సిఐ రాణి, డిటిఎఫ్ ఎస్సై ప్రేమ్ కుమార్ రెడ్డి,ఎస్ హెచ్ ఓ తాండూర్ ఎస్సైలు నిజాముద్దీన్, రవికుమార్ మరియు సిబ్బంది శివ ప్రసాద్, హనుమంతు, రవి కిరణ్, మహేష్, ఆసిఫా బేగం, రాధిక, భీమయ్య, రమేష్, కుమార్, కృష్ణ పాల్గొన్నారు.



## కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం

**ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ విగ్రహం ప్రజా పాలనలో నూతనోత్సాహానికి ప్రతిబింబమని పేర్కొన్నారు.ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, మల్కాజ్గిరి ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, కీసర ఆర్డిఓ శ్యాంప్రకాష్, జిల్లా విద్యాధికారిణి విజయకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక కళాకారులు ఆలపించిన ప్రభుత్వ ప్రజా పాలన, సంక్షేమ కార్యక్రమాలపై ఆధారిత గేయాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజా సంక్షేమం, పల్లెబడి అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రతిబింబించే ఈ విజయోత్సవాలు అధికార యంత్రాంగంలో ఉత్సాహాన్ని పెంపొందిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా పాలనను మరింత సమర్థవంతంగా అమలు చేసే దిశగా జిల్లా ముందుకు సాగుతుందని అదనపు కలెక్టర్ రాధిక గుప్త తెలిపారు.



## ప్రత్యర్థులు బెదిరిస్తుండ్రు

**గ్రామంలో ప్రచారం చేయలేకపోతున్నా..**

**రక్షణ కల్పించాలని ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు**

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 9 (జనం సాక్షి):** ఇది రాయలసీమ కాదు. ఫ్యాక్షనిజం లేదు. ప్రశాంతమైన పల్లెటూరు. కానీ ఎన్నికల్లో ఫ్యాక్షనిజం తరహా అదిరింపులు బెదిరింపులు ప్రచారం చేయకుండా అడ్డుకోడాలు ఇది ఎక్కడ నో కాదండోయ్ వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చంద్రవంచ చిన్న గ్రామపంచాయతీ లోని ఎన్నికల పరిస్థితి ఇది. చంద్రవంచ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ విజయ్ కుమార్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రవంచ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అందులో ఒక అభ్యర్థిని బెదిరించి బరిలో నుంచి తప్పించారు.

రెండో అభ్యర్థి విజయ్ కుమార్ రెడ్డి ఇతనిని భయపెట్టి బెదిరించి ప్రలోభ పెట్టి నామినేషన్ విడ్రా చేసే ప్రయత్నం చేశారు. ప్రత్యర్థి అభ్యర్థి సుదర్శన్ రెడ్డి ని ఏకగ్రీవం చేసే ప్రయత్నం జరిగింది. కానీ సర్పంచ్ అభ్యర్థి విజయ్ కుమార్ రెడ్డి నామినేషన్ల విత్ డ్రా వరకు కనిపించకుండా పోయాడు. నామినేషన్ల ఉపసంహరణ చంద్ర పంచ సర్పంచ్ అభ్యర్థిగా విజయ్ కుమార్ రెడ్డి గ్రామంలో అడుగుపెట్టాడు. అప్పటినుంచి ఆయనకు బెదిరింపులు మొదలయ్యాయి. ప్రత్యర్థి సుదర్శన్ రెడ్డి మద్దతుదారులు విజయ్ కుమార్ రెడ్డి ని గ్రామములో ప్రచారం చేయనీయకుండా కరపత్రాలు పంచకుండా బ్యానర్లు కట్టకుండా అడ్డుకుంటున్నారు.

ఒక సామాజిక వర్గానికి చెందిన వేరు ధన మంద బలం మందు బలంతో ఓటర్లను భ్రమలో పెట్టి గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ అభ్యర్థి విజయ్ కుమార్ రెడ్డి స్వయంగా వికారాబాద్ ఎస్పీ స్నేహ మె హ్ర జిల్లా కలెక్టర్ సాధారణ ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తాను గ్రామంలో ప్రచారం చేయకపోయినా తనకు ప్రజాబలం ఉందని పంచాయతీ ఎన్నికల్లో గెలుస్తానని సర్పంచ్ అభ్యర్థి విజయ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజా బలం లేని ప్రత్యర్థి అభ్యర్థులు మందు విందు బెదిరింపులు డబ్బు ప్రలోభాలు పెట్టి గెలుపొందే ప్రయత్నం చేస్తున్నారని వారు ఈ ఎన్నికల్లో గెలవడం కల్లా అని అన్నారు. ప్రత్యర్థి అభ్యర్థులు తనపై దాడి చేసే ప్రమాదం ఉందని గ్రామ ప్రజల నుంచి అందుతున్న సమాచారం మేరకు రక్షణ కల్పించాలని ఎస్పీ కలెక్టర్కు విజ్ఞప్తి చేసినట్లు తెలియజేశారు. దీనిపై ఎస్పీ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలియజేశారు.

## అభ్యర్థి లేకుండానే నామినేషన్ ఉపసంహరణ

**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అభ్యర్థి రాజు**

**శివ కుమార్ అనే అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసిండ్రు**

**ఆత్కూరులో సంఘటన**



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 9 (జనంసాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికలు కుటుంబాల్లో కుంపటి పెట్టి కాపురాలు కూల్చే వరకు వచ్చాయి. ఏకగ్రీవం కోసం ఎన్నికల నిబంధనలను పక్కకు పెట్టి సర్పంచ్ అభ్యర్థులను బెదిరించి లొంగదీసుకుని ఏకగ్రీవం చేసిన సంఘటనలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. తాజాగా వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ఆత్కూరు గ్రామంలో జరిగింది. సర్పంచ్ అభ్యర్థి రాజు తెలియజేసిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సర్పంచ్ అభ్యర్థిగా తాను నామినేషన్ వేశానని తనకు తెలియకుండానే తన అనుమతి లేకుండా ఎన్నికల అధికారులు తమ నామినేషన్ ను ఉపసంహరించినట్లు ప్రకటించి ఉపసంహరణ పత్రాన్ని అందజేసినట్లు తెలియజేశారు. తాను గ్రామంలో లేనప్పుడు తన అన్న అయిన బేగారి ఎల్లయ్యను తీసుకువెళ్లి నామినేషన్ పత్రాన్ని ఉపసంహరించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా ప్రత్యర్థి అభ్యర్థి శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలియజేశారు. ఈ విషయమై కొందరు గ్రామ పెద్దలను ప్రశ్నిస్తే గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవం కోసం తన అన్న ఎల్లయ్య మద్దతుతో నామినేషన్ ఉపసంహరించినట్లు వారు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ కుటుంబంలో కలహాలు పెట్టి ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ విషయమై వికారాబాద్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. విషయమై తమకు న్యాయం చేయాలని సర్పంచ్ అభ్యర్థి బె గారి రాజు విజ్ఞప్తి చేశారు

# చెరువుల రూపురేఖలు మారుస్తాం

**సైదాబాద్లో ఎర్రకుంటను అభివృద్ధి చేస్తాం**

**రామంతాపూర్ చిన్నచెరువును ఆహ్లాదంగా మారుస్తాం**

**ప్రభుత్వానికి నివేదించి పనులు ప్రారంభిస్తామన్న హైడ్రా కమిషనర్**



**ఉప్పల్, డిసెంబర్ 09 (జనంసాక్షి) :** నగరంలో చెరువుల పరిరక్షణతో పాటు.., అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. చెరువులకు పట్టిన మురుగును వదిలించడంతో పాటు ఆ పరిసరాలు ఆహ్లాదకరంగా మార్చాలనేది ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా హైడ్రా పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. నగరంలో చెరువుల కబ్జాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సైదాబాద్లోని ఎర్రకుంట చెరువుతో పాటు రామంతాపూర్లోని చిన్న చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నగరంలో చెరువులు కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయడంతో పాటు.. వాటి రూపు రేఖలను మార్చుతామన్నారు. హైడ్రా తొలివిడతా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణలో ఇప్పటికే బతుకమ్మకుంటను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని చెప్పారు. మరో 5 చెరువులు త్వరలోనే ప్రారంభానికి సిద్ధమౌతున్నాయని అన్నారు. అదే మాదిరి సైదాబాద్లోని ఎర్రకుంట చెరువును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ చెప్పారు. 6 ఎకరాలకు పైగా ఉన్న చెరువుకు హైడ్రాలిక్ ఫ్యూచర్స్ అన్నీ ఉన్నాయని అన్నారు. కొంతమంది ఈ చెరువు తమదిగా చెబుతున్నారని.. సర్వే ఆఫ్ ఇండియా, ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) మ్యాపులు, శాటిలైట్ చిత్రాలు, గ్రామ రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎక్కడా ఎలాంటి వివాదానికి ఆస్కారం లేకుండా.. పారదర్శకంగా చెరువుల అభివృధిని చేపడుతున్నామన్నారు. ఎర్రకుంట అభివృద్ధితో పరిసరాలన్నీ ఎంతో ఆహ్లాదంగా మారుతాయని చెప్పారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డితో పాటు.. పలువురు ఈ సందర్భంగా కమిషనర్ను కలిసి చెరువును అభివృద్ధి చేయాలని వినతిపత్రాలు అందజేశారు.

**రామంతాపూర్ చెరువు రూపు మారుస్తాం..**

రామంతాపూర్ చిన్న చెరువు రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపి.. వెంటనే పనులు ప్రారంభిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు అక్కడి స్థానికులకు హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో పాటు.. రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీ వాణి హైడ్రా కమిషనర్ను కలిసి చెరువును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో ఉన్న ఈ చెరువులు వరద కట్టడికి ఎంతో దోహదపడతాయని.. మరీ ముఖ్యంగా మూసీ నదికి ఆనుకుని ఉన్న చెరువులను రక్షించుకుంటే వరదలను చాలా వరకు నియంత్రించవచ్చునన్నారు. నగరంలో దక్షిణ, తూర్పు భాగంలో వరదలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇక్కడ చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.

రామంతాపూర్ చిన్న చెరువు చుట్టూ అనేక నివాస ప్రాంతాలున్నాయని.. భూగర్భజలాలు కూడా కలుషితంగా మారాయని.. ఈ నేపథ్యంలో ఈ చెరువు అభివృద్ధిని వెంటనే చేపడతామన్నారు. చెరువులో పూడికను పూర్తి స్థాయిలో తొలగించి మంచి నీరు చేరేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్లు, పిల్లల ప్లే ఏరియాలు, ఓపెన్ జిమ్లు ఇలా ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు.

## హైడ్రా సేవలపై గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధుల ఆరా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు హైడ్రా కార్యకలాపాలపై ఆసక్తి చూపించారు. చెరువుల పునరుద్ధరణ గురించి ఆరా తీశారు. వర్షాకాలం వరదల నివారణకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని కలిసి హైడ్రా కార్యకలాపాల పట్ల అభినందనలు తెలిపారు. పలువురు పర్యావరణ వేత్తలు హైడ్రా కమిషనర్‌ను కలిసి జీవ వైవిద్యాన్ని పెంపొందించడంలో హైడ్రా చర్యలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నగరీకరణలో చెరువులు మురికి కూపాలుగా మారిపోతున్నాయని, వాటిని పునరుద్ధరించి అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా అభివృద్ధి చేయడం చాలా శుభ పరిణామమని కొనియాడారు. చెరువులతో పాటు.. వాటిని అనుసంధానం చేసే కాలువలను పరిరక్షించుకుంటే.. వరద ముప్పు చాలావరకు తప్పించుకోవచ్చునని.. ఆ దిశలో హైడ్రా పని అద్భుతమన్నారు. చెరువులను సందర్శించడానికి పలువురు ఆసక్తి కనబర్చారు.

## పాస్‌పోర్ట్ పోయినది

నా మనవి తెలియజేయునది ఏమనగా నేను రాజారాపు అశోక్, తండ్రి : రాజారాపు పోచమల్లు, 10వ వార్డు (లింగంపేట), ఇంటినెం: 1-704/4, జిల్లా : జగిత్యాలకు చెందిన నేను 05-12-2025 నాడు లింగంపేట నుండి జగిత్యాలకు వెళ్తుండగా మధ్య మార్గంలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.: M8162635 పోయినది. ఎవరికైనా దొరికినచో దయచేసి నా పాస్‌పోర్ట్ నాకు తిరిగి ఇవ్వగలరు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 7989591406.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) : రూపాయి బలహీనత ఎఫెక్ట్‌తో బంగారం, వెండి ధరలు భగభగ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల తగ్గినట్లే తగ్గిన పసిడి ధరలు.. మళ్లీ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్ ధర తగ్గగా.. సిల్వర్ ధర పెరిగింది.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,090 ఉంది.. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,19,250 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 ఉంది. కిలో వెండి ధర రూ.1,99,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,240, 22 క్యారెట్ల ధర రూ.1,19,400 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,910.. 22 క్యారెట్ల ధర రూ.1,20,000 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,30,090, 22 క్యారెట్లు రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

- రెండ్రోజులపాటు అట్టహాసంగా సాగిన సదస్సు
- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ విడుదల
- సిఎం రేవంత్‌పై ఆనంద్ మహీంద్ర ప్రశంసలు
- విజన్ అద్భుతంగా ఉంది : ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి




హైదరాబాద్, డిసెంబర్9 (జనంసాక్షి) : భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహించారు. ఈ అంతర్జాతీయ స్థాయి సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా అండ్ మహీంద్రా చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి దిశ, విజన్ డాక్యుమెంట్ ఆయనను బాగా ఆకట్టుకుందని వెల్లడించారు. సమ్మిట్ వేదికపై మాట్లాడిన ఆనంద్ మహీంద్రా టెక్నాలజీ ఎంత వేగంగా ఎదిగినా, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విస్తరించినా హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదన్నారు. మానవీయ నైపుణ్యాన్ని ఏ సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమన్ స్కిల్స్‌కు కీలక పాత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత లక్ష్యాలను మరింత విస్తృతంగా, పెద్ద స్థాయిలో పెట్టుకోవాలని అనిపించిందని ఆనంద్ మహీంద్రా తెలిపారు. ఆ డాక్యుమెంట్‌ను చూస్తే నిపుణుల అభిప్రాయాలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆశయాలు కూడా ప్రతిబింబించినట్లు అనిపించిందన్నారు. యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలు సమతుల్యంగా ఇందులో పొందుపరిచినట్లు ప్రశంసించారు. ఇంత స్ఫూర్తి దాయకమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దిశ, ధైర్యమైన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్న నాయకత్వం తెలంగాణలో కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో మహిళలు నిర్వహిస్తున్న బ్యాటరీ తయారీ పరిశ్రమ తమకు గర్వకారణమని ఆనంద్ మహీంద్రా చెప్పారు. మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి రెండూ కలిసొచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నాలుగు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్న తన అనుభవంతో చూస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు ఒక సమవుజ్జీలా కనిపిస్తున్నారని ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో ఈ తరహా నాయకత్వం కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, అగ్రనటుడు చిరంజీవి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను రూపొందించారని కితాబిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికతకు అభినందనలు తెలిపారు. 'స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని మొదట సీఎం నన్ను అడిగారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున వద్దని చెప్పాను. అయితే, ఆయన లక్ష్యాలు, విజన్ విన్నాక తిరస్కరించలేకపోయాను. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశాను. ప్రజలు కేంద్రంగా దీన్ని రూపొందించారని అన్నారు. తెలంగాణ గొప్ప అభివృద్ధి సాధిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. 'హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచింది. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉంది. నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉంది. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఏటా 8-9 శాతం వృద్ధి సాధిస్తే.. తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదు ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నిలిచింది. భౌతిక మౌలిక వసతులతోపాటు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగాలి. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుంది. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదు.. అన్ బీటబుల్ అని సుబ్బారావు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు విభిన్న ఆలోచనలతో వచ్చిన అందరికీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. అందరి సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. 'తెలంగాణ భవిష్యత్తుకు ఈ డాక్యుమెంట్ ఒక దిక్సూచి. డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని రంగాల మేధావుల సలహాలు తీసుకున్నాం. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు.

## విరాళాలతో బాబ్రీ మసీదు కడతా

- తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) : ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడం ఇదేం కొత్త కాదు. మొన్నటికి మొన్న.. తృణమూల్ కాంగ్రెస్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పిక్చర్ అభి బాకీ హై' అంటూ కామెంట్లు చేయడం వివాదాస్పదంగా మారింది. హుమాయున్ కబీర్ నుంచి బాబ్రీ మసీదు ప్రకటన వెలువడిన వెంటనే పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు టీఎంసీ ఓ ప్రకటన జారీ చేసింది. దీంతో డిసెంబర్ 22న కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కబీర్ వెల్లడించారు. ఈ రాజకీయ పరిణామాల నడుమ తాజాగా కబీర్ బాబ్రీ మసీదు వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. బాబ్రీ మసీదు విరాళాలకు సంబంధించి నిధులు ఒక్క రోజులోనే హుమాయున్ ఇంట్లో పేరుకుపోయినట్లు తెలుపుతున్నట్లు ఉన్న ఓ వీడియోని హుమాయున్ కబీర్ తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మొత్తం 11 ట్రంక్‌ల విరాళాలు సేకరించినట్లు హుమాయున్ కబీర్ ఈ సందర్భంగా తెలిపారు. కోడ్ ద్వారా అతని బ్యాంకు ఖాతాలో రూ.9.3 మిలియన్లు జమ చేసినట్లు.. అందుకోసం డబ్బును లెక్కించడానికి ముప్పై మందిని నియమించడానికి లెక్కింపు యంత్రాన్ని కూడా ఆ వీడియోలో చూపించారు. బీజేపీ నుంచి వచ్చిన నిధులతోనే తాను ఈ మసీదును నిర్మిస్తున్నానని అందరూ మాట్లాడుతున్నారని, అది అబద్ధం అని నిరూపించడానికే తన ఈ ప్రత్యక్ష వీడియో నిదర్శనమని హుమాయున్ చెప్పడం గమనార్హం. డబ్బు లెక్కింపు ప్రక్రియ సీసీటీవీ పర్యవేక్షణలో జరుగుతుందని, తన బాబ్రీ మసీదును విరాళంగా వచ్చిన డబ్బుతోనే నిర్మిస్తామని హుమాయున్ కబీర్ వెల్లడించారు.

## సాంబారు పాత్రలో పడి బాలుడి దుర్మరణం

- పెద్దపల్లి జిల్లా గురుకులంలో ఘటన



హైదరాబాద్, డిసెంబర్9 (జనంసాక్షి) : నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తూ వేడి సాంబారు పాత్రలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. తెల్లారితే బాబు పుట్టిన రోజు వేడుక జరుపుకోవాల్సిన తరుణంలో కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లికి చెందిన మొగిలి మధుకర్ మల్లాపూర్ గురుకుల హాస్టల్ లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హాస్టల్ లోని సిబ్బంది కోసం కేటాయించిన క్వార్టర్స్ లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం హాస్టల్ లో విద్యార్థుల కోసం మధుకర్ సాంబారు సిద్ధం చేశాడు. మిగతా వంటకాలు సిద్ధం చేస్తుండగా మధుకర్ కొడుకు మోక్షిత్ (4) అక్కడే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ మోక్షిత్ సాంబారు పాత్రలో పడిపోయాడు. సాంబార్ వేడిగా ఉండడంతో మోక్షిత్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మోక్షిత్ ను కరీంనగర్ ఆసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సోమవారం మోక్షిత్ బర్త్ డే కావడంతో ఆదివారం సాయంత్రం ధర్మారం వెళ్లాలని మధుకర్ భావించాడు. వంట పనులు త్వరగా పూర్తిచేసుకుని కొడుకు పుట్టిన రోజు కోసం కొత్త దుస్తులు, కేకు, ఇతర సామాగ్రి తీసుకురావాలని అనుకున్నాడు. ఇంతలోనే ఈ దురెటన చోటుచేసుకుంది. పుట్టిన రోజున ఆనందోత్సాహాలతో గడపాల్సిన ఇంటికి బాలుడు విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## సంస్కృత విశ్వవిద్యాలయంలో దారుణం

- లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు ప్రొఫెసర్ల అరెస్ట్




తిరుపతి, డిసెంబర్9 (జనంసాక్షి) : తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒడిశాలోని బాధితురాలి ఇంటి వద్ద విచారణ చేపట్టిన తిరుపతి వెస్ట్ పోలీసులు,యువతి ఇచ్చిన వీడియో స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ విచారణలో పోలీసులు కీలక వివరాలను రాబట్టినట్టు సమాచారం. ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్.. తనను పలుమార్లు లైంగికంగా వేధించారంటూ.. స్టేట్‌మెంట్‌లో కీలక విషయాలను బాధితురాలు వెల్లడించింది. ఆ వేధింపులు తాళలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. అయితే.. 'ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి వద్ద మన ఇద్దరి వీడియోలు ఉన్నాయి. ఆ వీడియో ఎలా వెళ్లింది' అని ప్రశ్నిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని తెలిపింది. కానీ, ప్రొ.శేఖర్ రెడ్డి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని పోలీసుల విచారణలో పేర్కొంది బాధితురాలు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడైన ప్రొ.లక్ష్మణ్ కుమార్ సహా మరో ప్రొఫెసర్శేఖర్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.

## సిద్ధరామయ్య పూర్తికాలం సీఎం..!!

- యతీంద్ర వ్యాఖ్యలపై వివాదాస్పద వ్యాఖ్యలు



బెంగుళూరు, డిసెంబర్ 9 (జనంసాక్షి) : కర్నాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర చేసిన వ్యాఖ్యలు, వాటిపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... ముఖ్యమంత్రి మార్పు ఉండదని, సిద్ధరామయ్య పూర్తికాలం పదవిలో కొనసాగుతారని, డీకే శివకుమార్ డిమాండ్‌ను అధిషా'నం తోసిపుచ్చిందని యతీంద్ర సోమవారం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఈ రోజు బెంగళూరులో మీడియా ప్రశ్నించగా.. డీకే శివకుమార్ కేవలం "చాలా సంతోషం. అంతా మంచే జరగాలి, రాష్ట్రానికి మంచి జరగాలి" అని క్లుప్తంగా బదులిచ్చారు. ఆ తర్వాత, శీతాకాల సమావేశాల కోసం బెళగావి విమానాశ్రయానికి చేరుకున్న డీకే శివకుమార్‌కు మద్దతుదారులు "డీకే నెక్స్ట్ సీఎం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు డీకే సన్నిహితురాలైన మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ సోదరుడు, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహెూళి.. తన సోషల్ మీడియా ఖాతాలో డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రి అని సంబోధిస్తూ పోస్ట్ చేయడం కలకలం రేపింది. యతీంద్ర వ్యాఖ్యలు అనవసరమని చన్నరాజ్ అభిప్రాయపడ్డారు. సీఎం పదవిపై అధిషా'నం సరైన సమయంలో నిర?యం తీసుకుంటుందని చెప్పినప్పుడు, అంతవరకూ వేచి చూడాలని సూచించారు. ఈ పరిణామాలపై రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి స్పందిస్తూ, పార్టీలో ఎలాంటి గందరగోళం లేదని, అధిషా'నం నిర్ణయమే అంతిమమని స్పష్టం చేశారు. అయితే, నేతలు బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని హితవు పలికారు. మొత్తం మీద నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. సీఎం కుర్చీ చుట్టూ ఇరు వర్గాల మద్దతుదారుల వ్యాఖ్యలు, నినాదాలు కర్నాటక కాంగ్రెస్‌లో అంతర్గత పోరును మరోసారి బహిర్గతం చేశాయి.

## కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్తాడు

- మైనంపల్లి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, డిసెంబర్ 9 (జనంసాక్షి) : మైనంపల్లి హన్మంతరావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీమంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వరం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. మైనంపల్లి హన్మంతరావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీమంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వరం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో కోల్పోయిన ఇంకా అధికారంలోనే ఉన్నట్టు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం, ఈ కారు, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లాలో 240 గ్రామ పంచాయతీలు ఉంటే 15 మంది ఏకగ్రీవమయ్యారన్నారు. స్థానిక సంస్థల్లో 80శాతం స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

## విజయ్ సభ వద్ద కలకలం..

### తుపాకీతో సభకు వచ్చిన వ్యక్తి

పుదుచ్చేరి, డిసెంబర్ 9 (జనంసాక్షి) : పుదుచ్చేరిలో నటుడు విజయ్ ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) బహిరంగ సభ వద్ద కలకలం రేగింది. సభా ప్రాంగణంలోకి తుపాకీతో ప్రవేశించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతడిని పార్టీ శివగంగై జిల్లా కార్యదర్శి ప్రభుకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న డేవిడ్‌గా గుర్తించారు. ఈ ఘటనతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషాదం తర్వాత విజయ్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఇదే కావడంతో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్స్‌పో గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ సభకు పార్టీ అభ్యర్థన మేరకు కేవలం 5,000 మందిని మాత్రమే అనుమతించినట్లు సీనియర్ ఎస్పీ ఆర్. కలైవానన్ తెలిపారు. భద్రతా కారణాల ద ృష్ట్యా పొరుగున ఉన్న తమిళనాడు నుంచి ప్రజలు రావద్దని పోలీసులు ముందే సూచించారు. సభా ప్రాంగణంలోకి పిల్లలు, గర్భిణులు, వ ృద్ధులకు ప్రవేశం నిరాకరించారు. పార్టీ జారీ చేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్ పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించారు. తాగునీరు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స బ ృందాలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు విజయ్ రోడ్ షోకు అనుమతి నిరాకరించిన పోలీసులు, కేవలం సభకు మాత్రమే కఠిన షరతులతో కూడిన అనుమతినిచ్చారు.

## రేణుకా చౌదరి శునకం వివాదంపై బీజేపీ సీరియస్

### రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేత



న్యూఢిల్లీ, డిసెంబర్9 (జనంసాక్షి) : కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున రేణుకా చౌదరి తన వాహనంలో ఓ శునకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె ప్రవర్తన సభా హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసును పరిశీలించిన ఛైర్మన్, తదుపరి విచారణ నిమిత్తం హక్కుల కమిటీకి (ప్రివిలేజ్ కమిటీ) పంపారు. ఈ కమిటీ రేణుకా చౌదరి వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, తన సిఫారసులతో కూడిన నివేదికను ఛైర్మన్‌కు సమర్పించనుంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వివాదంలో తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

తెలంగాణ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్

నెం.వ్య.మా.క/గుడి/.../2025-26 టెండరు ప్రకటన తేది: 09/12/2025

వ్యవసాయమార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ నందు ఈ క్రింద తెలిపిన పనుల నిర్వహణ చేయుటకు ఆసక్తి గలవారి నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.పనికి అర్హతలు మరియు ఇతర వివరాలు కొరకు కార్యాలయము నందు సంప్రదించగలరు. అర్హతలు కలిగిన సంస్థలు లేదా వ్యక్తులు, అర్హతలు సంబంధించిన పత్రములు, టెండరు ఫారం ధర మరియు ధరావత్తు సొమ్మును డిమాండు డ్రాఫ్ట్ ద్వారా సమర్పించినతో పొందవచ్చును. డిమాండు డ్రాఫ్టను సెక్రటరీ, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ వారి పేరు మీద ఉండవలయును.ల్ వ

| క్రమ సంఖ్య | పనిపేరు | ధరావత్తు రూ. | టెండరు షెడ్యూల్ ధర |
| --- | --- | --- | --- |
| 1 | పూలమార్కెట్ యార్డ్‌లో టాయిలెట్ బ్లాక్-1 నడుపుటకు | 50,000/- | 3,000/- |
| 2 | పూలమార్కెట్ మరియు రిటైల్ కూరగాయల మార్కెట్ యార్డులో మొబైల్ కాంటీన్ నడుపుటకు.. | 1,00,000/- | 3,000/- |

టెండరు షెడ్యులు జారీ చేయుటకు తేది:10.12.2025 తేది ఉదయం గం.10.30 నుండి తేది:13.12.2025 రోజున మధ్యాహ్నం 3.00 వరకు కార్యాలయ పనివేళలో టెండరు షెడ్యులు అమ్మబడును. టెండరు సమర్పించుటకు తేది:15.12.2025 నాడు ఉదయంగం..11.30 నుండి మధ్యాహ్నం గం.12.00 వరకు తేది:15.12.25 నాడు గం.12.30లకు టెండరు షెడ్యూల్ తెరవబడను. అసంపూర్తిగా ఉన్న టెండరు గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు అన్ని ఎలాంటి కారణము చూపకుండా టెండరు ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వాయిదా వేయుటకు లేదా మార్పు చేయుటకు లేదా టెండరు ప్రక్రియ ఏ దశలోనైనా రద్దుచేయుఉ అధికారము ఈ దిగువ సంతకందారునకు కలదు.ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.ఇతర వివరాల కోసం కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR No.11867-PP/CL/ADVT/1/2025-26 సం/- కార్యదర్శి(ఎఫ్ఏసీ), వ్యవసాయమార్కెట్ కమిటీ. గుడిమల్కాపూర్

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370